గీతం
డీమ్డ్ టు బి యూనివర్సిటీ
బెంగళూరు • హైదరాబాద్ • విశాఖపట్నం

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

: fb.com/vaartha Digital

GITAM
DEEMED TO BE UNIVERSITY
BENGALURU • HYDERABAD • VISAKHAPATNAM

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-7-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 169 పేజీలు: 12 వెల: 8.00




GITAM
DEEMED TO BE UNIVERSITY

GITAM Student Selected for 1:1 Startup Pitch to Tim Cook

Manas Malla
B.Tech. CSE

Recognised in Apple's Swift Student Challenge 2026

Only a few seats left in
B.Tech. CSE
COMPUTER SCIENCE AND ENGINEERING

Apply with
JEE Main,
AP & TS EAPCET,
KCET and COMEDK.

Scholarships up to
100%
Including food and accommodation.

BENGALURU | HYDERABAD | VISAKHAPATNAM

LAST DATE TO APPLY
24 July

APPLY ONLINE
apply.gitam.edu

CALL US
88849 84000

SCAN TO APPLY

19-7pg2exHMNWJQE_19-7pg2exHMNWJQE.qxd 19/Jul/26 12:06 AM Page 1






శనివారం న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరాహారదీక్ష చేపట్టిన అభిజిత్ దీప్కేను కలిసిన బృందాకరత్

# ఆర్టీసీ బస్సు బోల్తా

>> పక్కన గల ముళ్ళచెట్టు ఉండడంతో బస్సును గట్టిగా ఆపింది. దీని వల్ల ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. లేని పక్షంలో పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ముఖ్యంగా ఆర్‌అండ్‌బి రహదారి వెడల్పు లేకపోవడంతో రెండు బస్సులు ఎదురెదురుగా ప్రయాణించాలంటే ప్రమాదకరంగా తయారైంది. ఆర్‌అండ్‌బి రహదారిని విస్తరిస్తే తప్ప ప్రమాదాలు నివారింపబడవు. జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ, ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ టీజే చంద్రశేఖర్, సూపరింటెండెంట్ నాయక్, చీమకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రసాద్, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. పోలీసు శాఖ, స్థానిక గ్రామస్తులు ప్రమాదం జరిగిన వేళ సత్వరమే స్పందించి ప్రయాణికులను బస్సులో నుంచి బయటకు తరలించారు. గాయపడ్డ 17 మందికి ఆర్టీసీశాఖ నుండి తాత్కాలికంగా ఒక్కొక్కరికి రూ.1500లు పారితోషికంను అందజేశారు. సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేశారు. పెద్ద ప్రమాదం తప్పిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కండక్టర్ బేగం, మరొక వ్యక్తికి మినహా మిగిలిన 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ బస్సులో అనకళ్లపూడి నుండి మద్దులూరు హైస్కూల్‌కు పది మంది విద్యార్థులు పయనించారు. విద్యార్థులు కూడా సురక్షితంగా బయటపడ్డారు. వారంతా తమ స్వగ్రామం అనకర్లపూడికి తరలి వెళ్లారు. విద్యాశాఖాధికారులు వారి స్వగ్రామంలో వారిని పరామర్శించారు.

# విక్రమ్-1 సక్సెస్

>> 11 గంటల 30 నిమిషాలకు జరగవాల్సి ఉంది. ప్రయోగం చివరిఐదు నిమిషాలలో సరిగ్గా 11 గంటల 20 నిమిషాలకు సాంకేతిక లోపాన్ని గుర్తించి కౌంట్ డౌన్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో షార్ ఉత్కంఠ నెలకొంది. అనంతరం రాకెట్‌తోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి తిరిగి ప్రయోగానికి శాస్త్రవేత్తలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కౌంట్ డౌన్‌ను 11.45 నిమిషాలకు తిరిగి ప్రారంభించి 20 నిమిషాల పాటు కౌంట్ డౌన్‌ను కొనసాగించారు. 12 గంటల 5 నిమిషాలకు రాకెట్‌ను నింగిలోకి పంపారు.

**నాలుగు దశల్లో ప్రయోగం:**

విక్రమ్ వన్ రాకెట్ ప్రయోగం నాలుగుదశల్లో జరిగింది.మొదటి మూడు దశల్లో ఘన ఇంధనాన్ని ఉపయోగించగా, నాలుగవ దశలో ద్రవ ఇంధనాన్ని ఉపయోగించారు. 350 కిలోల బరువు గల ఉపగ్రహాలను నిర్దేశించిన 450 కిలోమీటర్ల ఎత్తులోని కక్షలోకి విక్రమ్ వన్ రాకెట్ విజయవంతంగా ప్రవేశపెట్టింది.

**రాకెట్‌లోని ఫేలోడ్లు:**

మిషన్ ఆగమన్ అనే పేరుతో నిర్వహించిన ఈ ప్రయోగంలో విక్రమ్ వన్ రాకెట్‌లో స్కై రూట్ రూపొందించిన స్కోప్/శాటిలైట్, గృహ స్పేస్, మిషన్ ఎంబ్రాస్ అనే పేరుతో అంతరిక్షంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు వీలుగా రూపొందించిన ప్రథమ సాఫ్ట్ రోబోటెక్ క్యాప్చర్ సిస్టం, కాస్మిక్ బ్లూమ్, విక్రమ్ వన్ సూక్ష్మ రాకెట్ నమూనా, 18 క్యారెట్ల బంగారంతో తయారుచేసిన అంతరిక్ష పితామహులు సర్ సి.వి.రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ఎపిజె అబ్దుల్ కలాంల సూక్ష్మ ప్రతిమలు, ప్రధానమంత్రి మోడీ స్వయంగా రాసిన వందేమాతరం పోస్ట్‌కార్డు, దేశంలో నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు పోస్ట్ కార్డులను రాకెట్‌లో పేలోడ్లుగా పొందుపరిచారు. ఈ పేలోడ్లను విక్రమ్ వన్ రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది.

**విజయ పరంపర కొనసాగాలి:ప్రధాని మోడీ**

విక్రమ్ వన్ ప్రయోగ విజయం తర్వాత శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ సెల్ ఫోన్‌లో ప్రథమ స్వదేశీ ప్రైవేట్ భాగస్వామ్యంతో రూపొందించిన విక్రమ్ రాకెట్ ప్రయోగం విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్కై రూట్ సిఇఒ డాక్టర్ పవన్ కుమార్ చందనను అభినందించారు. ఈ విజయ పరంపర ఇలాగే కొనసాగాలి అని చెప్పారు. ప్రభుత్వం స్పేస్ టెక్నాలజీ రంగంలో ప్రైవేట్ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు సంస్థను ప్రశంసించారు. అలాగే ఇస్రో స్కై రూట్ సంస్థల సమిష్టి కృషితో ఈ విజయం సాధించడం భారతదేశ అంత రిక్ష రంగంలో శుభపరిణామంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సిఇఒ పవన్ కుమార్ చందన ప్రధానితో మాట్లాడుతూ మీరు పంపిన వందేమాతరం పోస్ట్ కార్డును విజయవంతంగా అంతరిక్షంలోకి విక్రమ్ వన్ రాకెట్ ప్రవేశపెట్టిందంటూ చెప్పారు. ప్రయోగానికి ముఖ్యఅతిథిగా హాజరైనకేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశంలో ఇటువంటి ఘనతను సాధించడం మంచి పరిణామం అన్నారు.రాష్ట్ర ఐటీ,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ స్కై రూట్ సంస్థ సాధించిన విజయం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు.



శనివారం హైదరాబాద్‌లో డి.సిఎం పవన్‌ను పరామర్శిస్తున్న మంత్రి నారా లోకేష్

# డి.సిఎం పవన్‌ను పరామర్శించిన మంత్రి లోకేష్

**విజయవాడ,జూలై 18, ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఇటీవల ముంబయిలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని డిశ్చార్జి అయి వచ్చి హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను తీసుకుంటున్నారు.ఆయనను శనివారం విద్యఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. పవన్ కళ్యాణ్ నివాసానికి వచ్చిన లోకేష్ ఆయన ఆరోగ్యవిషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.శస్త్రచికిత్స విజయవంతమైనందుకు సంతోషాన్ని వ్యక్తం చేసారుపలు అంశాలపై చర్చించారు.ఇరువురు వర్తమాన రాజకీయంశాలపైన చర్చించారు.

# పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు విడుదల

**విజయవాడ జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రాజెక్టుకు రూ.24.94 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది. ప్రాజెక్టును నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేసే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.వచ్చే యేడాది ప్రథమార్ధంలో ప్రాజెక్టును పూర్తి చేయాలనే దిశలో ప్రభుత్వం ఉంది.ఇటీవల సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, శంకుస్థాన సందర్భాల తేదిల వెల్లడి సందర్భంలోను ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టం చేసింది.

# చలనచిత్ర అవార్డులు

>> నటిగా ఆర్టికల్ 370లో నటించిన యామిగౌతమ్ ఎంపికయింది. ఉత్తమ దర్శకుడుగా రాజ్‌కుమార్ పెరియాసామి అమరన్ చిత్రానికిగాను ఎంపికయ్యారు. ఉత్తమ తెలుగుచిత్రంగా కమిటీ కుర్రోళ్ల జాతీయ పురస్కారానికి ఎంపికకాగా ఉత్తమ తమిళ చిత్రంగా రాయన్‌ను ఎంపికచేసారు.

**జాతీయ చలన చిత్ర అవార్డులపరంగా**

ఉత్తమ నటుడు: కార్తిక్ ఆర్యన్ (చందూ చాంపియన్ చిత్రం)
ఉత్తమ నటుడు: ముమ్ముట్టి (భ్రమయుగం)
ఉత్తమ నటి: యామిగౌతమ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ దర్శకత్వం: రాజ్‌కుమార్‌పెరియాసామి (అమరన్)
ఉత్తమ సహాయనటి: మధ్య (రూపశ్రీ వర్కాడే)
ఉత్తమ సహాయనటి : సచన నమిదాస్ (మహారాజ)
ఉత్తమ సహాయనటుడు: సంజయ్ మిశ్రా (బక్షక్ చిత్రం)
ఉత్తమ తెలుగు చిత్రం: కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం: చిన్నకథకాదు (దర్శకుడు నందకిశోర్)
ఉత్తమ జాతీయ విలువల చిత్రం: కెప్టెన్‌మిల్లర్ ( దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్)
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: కల్కి 2898 (నాగ్ అశ్విన్)
ఉత్తమ తొలిచిత్ర దర్శకుడు: రణదీప్ హుడా (స్వాతంత్ర్య వీర్‌సావర్కర్)
ఉత్తమ యాక్షన్ చిత్రం : మహారాజ (తమిళం)
ఉత్తమ నృత్యదర్శకత్వం: విజయ్ గంగూలీ (ఆజ్‌కిరాత్ స్త్రీ-2)
ఉత్తమ గేయరచన: మనోజ్ ముంతాషిర్ (జానేదో మైదాన్0
ఉత్తమ సంగీతం(నేపథ్యం): జివి ప్రకాష్‌కుమార్ (అమరన్)
ఉత్తమ సంగీతం (పాటలు): శశ్వాంత్ సచ్‌దేవ్ (ఆర్టికల్ 370)
ఉత్తమ మేకప్ : పి.రవికుమార్ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ కాస్ట్యూమ్స్ డిజైన్: దీపాలి నూర్,శీతల్‌శర్మ (పుష్ప-2)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్ : నితన్ జిహానీ చౌదరి (కల్కి 2898ఎడి)
ఉత్తమ ఎడిటింగ్ : ఆర్ కలైవానన్ (అమరన్)
ఉత్తమ సౌండ్ డిజైనింగ్ : మానస్ చౌదరి (భూల్ భులయ్యా-3 హిందీ)
ఉత్తమస్క్రీన్‌ప్లే రచయిత (అడాప్టెడ్): యోదేశ్‌దేశ్ పాండే (స్వరగందర్వ సుదీర్ ఫాడ్కే)
ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత ఒరిజినల్: సుకుమార్ (పుష్ప-2)
ఉత్తమ సినిమాటోగ్రఫీ : షెహనాద్‌జ లాల్ (భ్రమయుగం)
ఉత్తమ గాయని: వైకోమ్ విజయలక్ష్మి (ఎఆర్ఎం)
ఉత్తమ గాయకకుడు : అభయ్ జోధ్‌పూర్కర్ (గరాత్ గణపతి)
ఉత్తమ బాలనటులు: రిద్దిమాన్ బెనర్జీ, తపోమయ్‌దేవ్, గీతాశ్రీచక్రవర్తి(ఆంకోంకి కితిన్-బెంగాలి)
ఉత్తమ బాలనటుడు: అరుణ్‌దేవ్ పోతుల (35-చిన్నకథకాదు)
ఉత్తమ బాలనటుడు: అతిశెట్టి
ప్రత్యేక ప్రస్తావన: మెయ్యజగన్-తమిళ్ ఫిలిం సౌండ్‌మిక్స్ ఇంజినీర్ సురేన్‌జి
కెప్టెన్ మిల్లర్ (తమిళ్): ధనుష్

కాగా ఈ పురస్కారాల్లో ప్రాంతీయ చిత్రాలకు కూడా అవార్డులు దక్కాయి. వీటిలో ఉత్తమ తెలుగు చిత్రంగా కమిటీ కుర్రోళ్ల, ఉత్తమ తమిళచిత్రంగా రాయన్, ఉత్తమ ఒడియా చిత్రంగా లహరి, ఉత్తమ మరాఠీ చిత్రంగా ముక్కమ్‌పోస్ట్ బొంబిల్‌వాడి, ఉత్తమ మణిపురిచిత్రంగా సునీత, ఉత్తమ మళయాళ చిత్రంగా ఫెమినిచ్చి ఫాతిమా, ఉత్తమ కొంకణి చిత్రంగా మోగ్ ఆసుమ్, ఉత్తమకన్నడ చిత్రంగా మిథియా,ఉత్తమ హిందీ చిత్రంగా శ్రీకాంత్, ఉత్తమ గుజరాతి చిత్రంగా మారన్, ఉత్తమ బెంగాలి చిత్రంగా చలిచిత్ర ఎకోన్, ఉత్తమ అస్సామీ చిత్రంగా జుయ్‌ఫిల్మ్ ఆరెంజ్ అండ్ పర్పుల్ ఎంపికయ్యాయి.

నాన్‌ఫీచర్ చిత్రాల కేటగిరీలో స్పెషల్‌జ్యూరీ చిత్రం కింద చోలా దోరా ఔర్ సుయ్ హిందిచిత్రం,భద్రకాళి నాటకం మళయాళంలో ఎంపికయ్యాయి. హిందీ కశ్మీరీ కేటగిరీలో ఉత్తమ స్క్రిప్ట్ ఓబర్ ఫరాజ్ ఆలీ ఎంపికయితే ఉత్తమ వాయిస్ ఓవర్‌లో సుందరాయ జయచంద్రన్ లిటిల్‌ప్లానెట్: ఎ టేల్ ఆఫ్‌ఫ్రాగ్స్‌కు ఎంపికయ్యారు . ఉత్తమ సంగీత దర్శకత్వంలో శివ్‌పాల్‌సింగ్ కాంగ్ ఛాయా మగవీర్ పరాట్ 41 డిగ్రీస్ అన్న చిత్రానికి ఎంపికచేసారు.

ఉత్తమ లఘుచిత్రంగా మరాఠికి చెందిన హమ్‌సఫర్, ఉత్తమ యానిమేషన్ చిత్రంగా టచ్డ్ ఏజ్ వాటర్, ఉత్తమ సాంఘిక పర్యావరణ విలువలున్న చిత్రంగా పిప్లంత్రి ఏ టేల్ ఆఫ్ ఎకో ఫెమినిజం, ఉత్తమ డాక్యుమెంటరీ చినరతంగా రామ్‌నామి (హిందీ),ఉత్తమ ఆర్ట్ కల్చర్ చిత్రం మెయిన్‌నిదా (హిందీ) ఉత్తమ హిస్టారికల్ పునర్నిర్మాణ చిత్రంగా కకోరి హిందీచిత్రం ఎంపికయ్యాయి.

# 4 చిత్రాలు.. 8 అవార్డులు

>> చిత్రంగా నిలిచింది. అద్భుతమైన సంభాషణలు రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన లక్కీభాస్కర్ దర్శకుడు వెంకీ అట్లూరికి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డు దక్కించుకున్నారు. ఇక బాక్సాఫీసును ఊపు ఊపేసిన చిత్రం పుష్ప2 ఇపుడు ఏకంగార రెండు జాతీయ అవార్డులు సొంతంచేసుకుంది. ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత సుకుమార్ ఒరిజినల్ కేటగిరీలో అవార్డురాగా ఉత్తమ కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా దీపాలినూర్, సీతల్‌శర్మలకు అవార్డు వచ్చింది. అలాగే 35 చిన్న కథకాదు ఇపుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతోపాటు ఉత్తమ బాలనటుడు అరుణ్‌దేవ్ పోతులకూ జాతీయ అవార్డులు వచ్చాయి.

# రావణ్ రిమాండ్ పొడిగింపు

**గన్నవరం(కృష్ణా), జులై 18, ప్రభాతవార్త :** ఉపాకేసులో నెల్లూరు జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ ఎలియాస్ ప్రశ్న రావణ్ రిమాండ్‌ను మరో 14రోజులు పొడిగిస్తూ గన్నవరం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. గతంలో విధించిన రిమాండ్ గడువు శనివారంతో ముగియటంతో శనివారం రావణ్‌ను పోలీసులు వర్చువల్‌గా కోర్టులో హాజరుపరచారు.

**21వతేదీ విచారణకు రావాలని గమన, ఇంద్రసేనకు నోటీసులు :**

రావణ్ కేసులో గమన, ఇంద్రసేనలను పోలీసులు శనివారం సుదీర్ఘంగా విచారించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వీరిద్దరిని వేర్వేరుగా ఉంచి గన్నవరం డిఎస్పీ కార్యాలయంలో గన్నవరం సిఐ శివప్రసాద్ విచారించారు. పోలీసులు అడుగుతున్న ఏప్రశ్నకు వీరిద్దరూ సరైన సమాధానం ఇవ్వటంలేదు. సాంకేతిక ఆధారాలు వచ్చిన తరువాత వీరిని మరోమారు విచారించేందుకు నిర్ణయించిన పోలీస్ అధికారులు ఈనెల 21వతేదీ విచారణకు రావాలని నోటీసులు ఇచ్చి ఇద్దర్నీ పంపించివేసారు.

# గుంటూరులో మహిళపై దాడి

>> వేగవంతం చేయాలని సూచించారు. కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదే సమయంలో బాధితురాలి ఫిర్యాదుపై సకాలంలో స్పందించడంలో లోపాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో నగరంపాలెం సిఐ సత్యనారాయణపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సిఫార్సు చేశారు. మహిళల భద్రతకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో స్వీకరించి వెంటనే చర్యలు తీసుకోవాలని అన్ని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహిళల భద్రత, న్యాయ పరిరక్షణ విషయంలో గుంటూరు జిల్లా పోలీసు శాఖ రాజీలేని వైఖరితో వ్యవహరిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# చట్టం ఎవరినీ వదలదు..

**విజయవాడ, జులై18, ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరులో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టంచేశారు. సమాజంలో ఏ ఒక్క మహిళకు అవమానం జరిగినా అది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సమాజంలో ఇలాంటి వాటికి తావులేదని సిఎం తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ దారుణానికి సంబంధించి ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదైందని, నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారని చెప్పారు. ఈ ఉదంతంలో ప్రమేయం ఉన్న పార్టీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. రాజకీయ అండదండలు ఉన్నా సరే చట్టం వదిలిపెట్టదని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం తప్పు చేసిన వారి విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని వివరించారు. చట్టం ఎవరికీ లొంగదు, పక్షపాతం చూపదన్నారు. ప్రతి మహిళకు తమ గౌరవానికి, భద్రతకు ఎల్లప్పుడూ రక్షణ ఉంటుందనే నమ్మకాన్ని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్ట్‌చేశారు.

# ఎపిలో పెట్టుబడుల పర్యాటకం

>> హోమ్‌స్టే నిర్వాహకులు, చేనేత కార్మికులు మరియు మహిళా ఉపాధి గ్రూపులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని స్పష్టం చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూనే స్థానిక సంస్కృతిని పెంపొందించడమే తమ ప్రభుత్వ విధానమన్నారు.ఈ సందర్భంగా ఎడిటిఒఐ సంస్థకు మంత్రి దుర్గేష్ 7 కార్యాచరణ అంశాలు ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఎడిటిఒఐ చాప్టర్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కనీసం రెండు ప్రత్యేక పర్యాటక సర్క్యూట్‌లను ప్రమోట్ చేయాలని కోరారు. విభిన్న వర్గాల పర్యాటకుల కోసం ఉమ్మడిగా 3, 5, 7 రోజుల ప్యాకేజీలను రూపొందించాలని తెలిపారు. టూర్ ఆపరేటర్ల కోసం త్వరలోనే ప్రత్యేక ఫామిలియరైజేషన్ టూర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వాణిజ్యపరంగా లాభదాయకమైనవిగా, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడేవిగా, సంస్కృతిని పెంపొందించేవిగా మరియు స్థానిక సమాజానికి మేలు చేసేవిగా ఉండే అద్భుతమైన ప్రయాణ అనుభూతులను మనం ఉమ్మడిగా సృష్టిద్దామన్నారు.అందరం కలిసి దేశీయ పర్యాటక రంగాన్ని బలోపేతం చేద్దాం, స్థానిక వర్గాలకు ఆర్థిక సాధికారత కల్పిద్దాం. తద్వారా జాతీయ సంకల్పమైన "స్వదేశీ పర్యటన్- సశక్త్‌భారత్" సాకారంలో మన వంతు భాగస్వామ్యం అందిద్దామని మంత్రి కందుల దుర్గేష్ తన ప్రసంగాన్ని ముగించారు.ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఒఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎపిలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధిపై కపిల్ దేవ్‌తో మంత్రి కందుల దుర్గేష్ చర్చలు..**

రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం అభివృద్ధి, తద్వారా పర్యాటక రంగాన్ని బలోపేతం చేసే అంశాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నోయిడా (ఢిల్లీ)లో సుప్రసిద్ధ క్రికెట్ మరియు గోల్ఫ్ క్రీడాకారుడు, పిజిటిఐ అధ్యక్షుడు కపిల్ దేవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజం విస్తరణకు ఉన్న అవకాశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. విశాఖపట్నం, అమరావతి ప్రాంతాలలో గోల్ఫ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు గల సాధ్యాసాధ్యాలను మంత్రి దుర్గేష్ .. కపిల్ దేవ్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాల్సిందిగా కపిల్ దేవ్‌ను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు.

# గొల్లప్రోలులో కొవిడ్ కలకలం

>> ప్రకటనలో తెలిపారు.ఇదే విషయాన్ని సిఎంసి వైద్య నిపుణులు నిర్ధారించారని వెల్లడించారు. జిల్లాలో ఎటువంటి కోవిడ్ కేసులు లేవని ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆమె తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులకు వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా శాంపిల్స్‌ను వైద్యాధికారులు ల్యాబ్‌కు పంపించారు.

# విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ పాజిటివ్ కేసు!

**విజయవాడ, జులై18,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కొవిడ్ లక్షణాలతో 13 ఏళ్ల బాలిక అడ్మిట్ అయింది.ఆమె కోవిడ్ పాజిటీవ్ రిపోర్టు వచ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొవిడ్ ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

# చెత్తనుంచి సంపద సృష్టి

>> నతో మనం పనిచేయాలి అన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛతా లక్ష్యం సాధ్యం అవుతుంది.పచ్చదనం, పరిశుభ్రత ఉంటేనే మన లక్ష్యాన్ని సాధించగలం.. శాంతిభద్రతలు, సంక్షేమం, ఆదాయంతో మెరుగైన జీవన ప్రమాణాలు ప్రజలకు ఉండాలన్నదే మా లక్ష్యం అన్నారు. తెలుగు జాతి భవిష్యత్తును రక్షించే బాధ్యత నేను తీసుకున్నాను.పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి సహించబోం అన్నారు. మన ప్రజా రాజధాని అమరావతిని కాపాడుకునేలా ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా పనిచేయాలి.. గతంలో జన్మభూమి పిలుపు ఇచ్చినప్పుడు ప్రపంచ వ్యాప్తంగా వచ్చి పనిచేశారు. ఇదే స్ఫూర్తి కొనసాగాలి అన్నారు. 120 పట్టణ ప్రాంత స్థానిక సంస్థల కింద రూ.15,274 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపనలు చేశాం అన్నారు. ప్రజారోగ్య మున్సిపల్ ఇంజనీరింగ్ కింద ఈ పనులు చేపడుతున్నాం. ప్రతిఇంటికి కుళాయి ఇవ్వడానికి రూ.23 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. వాటర్ సప్లై కోసం రూ. 10 కోట్లు వరకు ఖర్చు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో గుడివాడలో రూ.162 కోట్లు ఖర్చు పెడతాం. అందరి భాగస్వామ్యంతో అనేక పనులు పూర్తవుతాయి. గుడివాడ ప్రజలు బంపర్ మెజారిటీతో కూటమిని గెలిపించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో ముందుకెళ్తున్నాం. కార్బన్ న్యూట్రల్స్ అనే కొత్త విధానం మనకు అలవాటు కావాలి. ఇంటి నుంచి చెత్త రాకుండా నెట్ జీరో అన్నది మన విధానం కావాలని పిలుపునిస్తున్నానని సిఎం చంద్రబాబు అన్నారు. కార్బన్ న్యూట్రల్స్ అనే కొత్త విధానం మనకు అలవాటు కావాలన్నారు.ఇంటిపై పడిన వర్షాన్ని భూగర్భజలాల కింద మార్చుకోవాలి అన్నారు. 12 ఏళ్లకు ముందు కృష్ణాడెల్టాకు నీటి ప్రవాహాలు తగ్గిపోయాయి. దేశానికి అన్నపూర్ణగా నిలిచిన కృష్ణా జిల్లా నీటి ప్రవాహాలు లేక సతమతం అయ్యింది.అందుకే 12 నెలల్లో పట్టిసీమ ప్రాజెక్టు పూర్తి చేసి డెల్టాకు గోదావరి నీళ్లు తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. గుంటూరులో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన తగాదాలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఓ మహిళ పట్ల దుర్మార్గంగా ప్రవర్తించారు. తక్షణం పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నాను. ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులను కూడా బదిలీ చేస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకునేందుకు వీల్లేదు.తప్పు చేసింది పరాయి పార్టీ వాడైనా మా పార్టీ వ్యక్తి అయినా మా ప్రభుత్వానికి ఒక్కటే. తప్పు చేసిన ఎవరినీ వదిలిపెట్టబోనని ప్రజలందరికీ మరో మారు చెబుతున్నానని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు.అంతకు ముందు ప్రజావేదిక సమీపంలో ఆన్ లైన్ వర్క్స్ మానిటరింగ్ సిస్టమ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబుపరిశీలించారు. మెప్మా మహిళా సంఘాలు తయారు చేసి ప్రదర్శించిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించిన సిఎం.. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్' కింద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను చూసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పి,నారాయణ, కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు హాజరయ్యారు

**అమరావతికి, గుడివాడ బస్టాండ్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన దాతలు**

అమరావతికి, గుడివాడ బస్టాండ్ నిర్మాణానికి దాతలు విరాళాలు ఇచ్చారు. అమరావతి కోసం రెండు బంగారు గాజులను గుడివాడకు చెందిన ఎలవర్తి సాయిశ్వేత సిఎంకు విరాళాలు అందించారు. అదేవిధంగా తమ అబ్బాయి నిర్వాన్ గణేశ్ దాచుకున్న నగదును కూడా ఆ దంపతులు నిర్మాణం కోసం ఇచ్చారు. గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ. 3కోట్ల విరాళ చెక్కును సిఎం చంద్రబాబుకు అందజేశారు. అంతేకాకుండా గతంలో కూడా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూ. 3కోట్లు విరాళం ఇచ్చారు.

# వాంగ్చుక్ దీక్ష భగ్నం



నేడు జంతర్‌మంతర్ వద్ద దీక్ష ప్రారంభించిన సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

>> గిన విచారణ ఈ ప్ రి ణా వ ా ని కి దారితీసింది. "ఏ పౌరుడి ప్రాణమైనా అత్యంత విలువైంది" అని పేర్కొన్న హైకోర్టు వాంగ్‌చుక్ ప్రాణాలను కాపాడటానికి అవసరమైన అన్ని వైద్య చర్యలు తీసుకోవాలని, రోజువారీ నివేదికలు సేకరించాలని కేంద్రప్రభుత్వానికి రెండు రోజుల క్రితమే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఆయనను పరీక్షించిన వైద్యులు అవయవాలు విఫలమయ్యే (ఆర్గన్ ఫెయిల్యూర్) ప్రమాదం ఉందని, పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని హెచ్చరించడంతో పోలీసులు రంగంలోకిదిగారు. తాము కోర్టు ఆదేశాల మేరకే ఈ చర్య తీసుకుంటున్నట్లు మైకుల ద్వారా అనౌన్స్ చేశారు. 20 రోజులుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ దీక్ష వల్ల వాంగ్‌చుక్ ఏకంగా 8 కేజీల బరువు తగ్గారు. ఆయన ఆరోగ్యం విషమిస్తుండటంతో గత రెండు రోజులుగా ప్రతిపక్ష నేతలు కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా దీక్ష విరమించాలని కోరారు. ఆసుపత్రిలోనూ నిరసన కొనసాగుతున్న తరుణంలో, జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజున పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తామని నిరసనకారులు ప్రకటించారు. ఈ మార్చ్‌లో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

**నా అనుమతిలేకుండా ఆయనకు చికిత్సచేయవద్దు:వాంగ్‌ఛుక్ సతీమణి**

పోలీసుల తీరుపై సోనమ్ సతీమణి గీతాంజలి జె ఆంగ్మో తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్స చేయకూడదని హెచ్చరించారు. ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతి లేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతి ఒక్కరిని బాధ్యులను చేస్తా. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీల్లేదు. అది మా హక్కు అని సోనమ్ సతీమణి గీతాంజలి మీడియాకు స్పష్టంచేశారు. సోనమ్‌కు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో పోలీసులు ఇవాళ నిరసన ప్రాంతం నుంచి ఆయనను బలవంతంగా తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తున్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించాలని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నాం అని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

**ఆమరణదీక్షకు ఉపక్రమించిన సిజెపి చీఫ్ దీప్కే...**

వాంగ్‌ఛుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం ఆమరణ దీక్షకు పూనుకున్నారు.వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు కూర్చున్న ప్రదేశంలో అభిజీత్ దీప్కే ఆందోళనకు దిగారు. అయితే ఈనెల 20వ తేదీన జరగాల్సిన తమ ర్యాలీ యథావిధిగా జరుగుతుందని అన్నారు. జంతర్ మంతర్ నిరసన ప్రదేశానికి ప్రజలు రావాలని ఆయన వేడుకున్నారు. ప్రభుత్వం తీవ్రమైన తప్పు చేసిందని, ప్రతి ఒక్కరూ జంతర్ మంతర్ చేరుకోవాలని తెలిపారు. సిపిఐ ఎంఎల్‌కు చెందిన నేహా, అమీన్, మనీశ్ జంతర్ మంతర్ వద్ద 21వ రోజు కూడా దీక్ష చేపట్టనున్నట్లు ఎఐఎస్ఎ ప్రెసిడెంట్ ఎన్ సాయి బాలాజీ తెలిపారు.

## వారం - వర్జ్యం

19-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పునర్వసు కార్తె
షష్ఠి రా.3.32
ఉత్తరఫల్గుణి సా.6.17
వర్జ్యం : రా.3.01-తె.4.41
దు.సా.4.54-సా.5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** మాటల చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని పనులు చేస్తారు. వృత్తిలో మీ బుద్ధి కుశలత బాగా లాభిస్తుంది.

**వృషభం:** కుటుంబ పురోభివృద్ధి సాధిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. నేర్పుగా ముందుకు సాగుతారు.

**మిథునం:** ఆధ్యాత్మిక విషయాలలో చురుకుగా పాల్గొంటారు. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్ర లాభం.

**సింహం:** ఇతరుల సలహాలు అతిగా స్వీకరిస్తారు. కానీ మీ మనస్సుకు తోచిన పనులనే చేస్తారు. బంధువుల కలయిక.

**కన్య:** పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు.అప్రయత్నంగా అవకాశాలు.

**తుల :** తప్పుకు తిరగకుండా ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొని అనుకూల ఫలితాలు సాధిస్తారు. వస్త్రలాభాలు.

**వృశ్చికం:** చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**ధనుస్సు:** వాహనం నడిపేటప్పుడు లావాదేవీలు, మధ్యవర్తిత్వము మొదలయిన వాటి విషయ వ్యవహారాలలో జాగ్రత్తలు పాటించండి.

**మకరం:** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తల నొప్పిగా మారుతుంది. స్పెక్యులేషన్ లాభించదు.

**కుంభం:** నమ్మకాలకు తావివ్వకుండా రోటీన్ సంతకాల విషయంలో వ్యక్తిగత బంధుత్వాలకు అతీతంగా వ్యవహరించండి.

**మీనం:** స్థిరాస్థి వివాదాలలో స్తబ్ధత నెలకొంటుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగ్గా ఉంటాయి. శుభవార్తలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
ఒంగోలు
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

19-7-2026 ఆదివారం
సంపుటి: 32 సంచిక: 169
పేజీలు: 12 వెల: 8.00




శనివారం శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి నింగిలోకి దూసుకుపోతున్న విక్రమ్-1 రాకెట్

## తొలుత స్వల్ప సాంకేతిక లోపం తలెత్తినా, వెంటనే సరిచేసి ప్రయోగించిన శాస్త్రవేత్తలు

### విక్రమ్-1 ద్వారా ఉపగ్రహాలు కక్ష్యలోకి

### రూపకర్తలకు అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ, కేంద్రమంత్రి జితేంద్రసింగ్

**సూళ్లూరుపేట, జూలై 18 ప్రభాతవార్త :** సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో హైదరాబాద్ చెందిన స్పేస్ టెక్ స్టాటప్ కంపెనీ స్కైరూట్ సంస్థ రూపొందించిన ప్రథమ స్వదేశీ ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగం గ్రాండ్ సక్సెస్ అయింది. శనివారం శ్రీహరికోట లోని ప్రథమ లాంచ్ ప్యాడ్ నుంచి మధ్యాహ్నం 12 గంటల 5 నిమిషాలకు విక్రమ్ మన రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. వాస్తవానికి ఈ ప్రయోగం ఉదయం >>2


రాకెట్ ప్రయోగం సక్సెస్‌తో హర్షం వ్యక్తం చేస్తున్న డా. పవన్ కుమార్ తదితరులు

# చెత్తనుంచి సంపద సృష్టి

అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో చెత్తలేకుండా చేస్తాం

ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు

పూర్తి పారదర్శకంగా సుపరిపాలన

గుడివాడలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు


శనివారం గుడివాడలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి లక్ష్యం అని తెలిపారు. ఇంట్లో ఎవరికివారే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలన్నారు. శాశ్వతంగా చెత్త నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేస్తామని సిఎం స్పష్టం చేశారు.

కృష్ణా జిల్లా గుడివాడలో పర్యటించిన చంద్రబాబు, స్వచ్ఛాంధ్ర.స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ గ్రౌండ్‌లోని ప్రజావేదిక సభలో పాల్గొని మాట్లాడారు. అమృత్ 2.0 ఎఐయుడిఎఫ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. 18వ స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని గుడివాడలో నిర్వహిస్తున్నాం.ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలబడిన ప్రాంతం ఇది.స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, స్వాభిమానం అనే అంశాలపై ఎన్టీఆర్ పార్టీ పెట్టారు.గతంలో స్వార్ధ రాజకీయాలు మాత్రమే ఉన్న పరిస్థితిని మార్చి అభివృద్ధి, సంక్షేమాన్ని తీసుకువచ్చారు అన్నారు. అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి ఉద్యోగాలు, సంపద వచ్చేలా పాలన అందిస్తున్నామన్నారు.రోడ్లు ఊడ్చటం ఒక్కటే పరిశుభ్రత కాదు, పర్యావరణం, ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉండాలి. గత పాలనలో చెత్తాచెదారం నింపేసిన ఈ ప్రాంతాన్ని ఇప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దాం. మనజన్మస్థలాన్ని చెత్తలేకుండా పరిశుభ్రంగా ఉంచాలన్న ఆలోచ >>2


శుక్రవారం న్యూఢిల్లీలో సోనం వాంగ్చుక్ ఆమరణ దీక్షను భగ్నంచేసి ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

# సోనం వాంగ్చుక్ దీక్ష భగ్నం

### 20 రోజులుగా సాగుతున్న నిరాహారదీక్ష

### అదేచోట దీక్ష ప్రారంభించిన సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

### నేడు పార్లమెంట్ మార్చ్ యధాతథం

**న్యూఢిల్లీ,జులై 18:** దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా సాగుతున్న సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష శనివారం తెల్లవారుజామున ఊహించని మలుపు తిరిగింది.నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో 59 యేళ్ల పర్యావరణ, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఈ కఠిన దీక్షకు దిగారు. ఈ నిరసనలకు మద్దతుగా నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తల తీవ్ర నినాదాల మధ్య, పోలీసులు ఆయనను బలవంతంగా దీక్షా శిబిరం నుంచి తరలించి ఆసుపత్రిలో చేర్చారు. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో జరి >>2

# 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు

**ఉత్తమ తెలుగు చిత్రం:** కమిటీ కుర్రోళ్లు
**ఉత్తమ కన్నడ చిత్రం:** మిధ్య
**ఉత్తమ తమిళ చిత్రం:** రాయన్
**ఉత్తమ నటులుగా** మమ్ముట్టి (భ్రమయుగం), కార్తిక్ ఆర్యన్ (చందూఛాంపియన్)
**ఉత్తమ నటిగా** యామి గౌతమ్ (ఆర్టికల్ 370)


ఉత్తమ నటుడు మమ్ముట్టి (భ్రమయుగం)


ఉత్తమ నటి యామి గౌతమ్ (ఆర్టికల్ 370)

**న్యూఢిల్లీ,జులై 18:** జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శనివారం ప్రకటించింది. 72వ అవార్డుల కోసం 2024 సంవత్స రానికిగాను మొత్తం 400కిపైగా చిత్రాలు జ్యూరీముందుకు రాగా వాటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వాటిని ఎంపికచేసినట్లు కమిటీ వెల్లడించింది. ఉత్తమనటుడు అవార్డు ఇద్దరికి లభించింది. చందూ చాంపియన్ నటనకుగాను కార్తీక్ ఆర్యన్; భ్రమయుగం నటనకుగాను ముమ్ముట్టిలను ఈ అవార్డుకు ఎంపికచేసారు. అలాగే ఉత్తమ >>2

## 4 చిత్రాలు.. 8 అవార్డులు

### తెలుగు చలనచిత్ర ప్రతిభకు నిదర్శనాలు




**న్యూఢిల్లీ,జులై 18:** కేంద్రం ప్రకటించిన 72వ జాతీయ చలనచిత్రపురస్కారాల్లో తెలుగు రాష్ట్రాల పంట పండింది. ప్రతిభకు నిదర్శనంగా ఈ పురస్కారాలు నిలిచాయి. నాలుగు చిత్రాలకుగాను 8 పురస్కారాలు వరించాయి. కమిటీ కుర్రోళ్లు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికయింది. ఉత్తమ మేకప్ విభాగంలోను అవార్డు వచ్చింది. ఇక నాగ్అశ్విన్ విజువల్ వండర్‌గా నిలిచిన కల్కి 2898 ఎడికి రెండు కేటగిరీల్లో పురస్కారాలు లభించాయి. సెట్స్,విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతోపాటు ఉత్తమ ప్రజాదరణ పొందిన >>2


శనివారం సంతనూతలపాడు మండలంలో బోల్తాపడ్డ ఆర్టీసి బస్సు

# ఆర్టీసీ బస్సు బోల్తా

### 17 మందికి గాయాలు

### సంతనూతలపాడు మండలంలో దుర్ఘటన

**సంతనూతలపాడు, జులై 18, ప్రభాతవార్త :** సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ హైర్ బస్ బోల్తా పడగా 17 మంది గాయాలకు లోనయ్యారు. గాయాలకు గురైన వారిలో పది మంది కొండపి ప్రభుత్వ హాస్పిటల్‌లో మరొక ఏడుమంది ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మరొక ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ ఎస్‌కే బేగం, మరొక వృద్ధునికి తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కామేపల్లి నుండి ఎపి 39 టీవై 1589 నంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సు శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఒంగోలుకు బయలుదేరింది. ఈ బస్సు సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా ఒంగోలు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి బస్సు డ్రైవర్ మార్జిన్‌కు తిప్పడంతో బస్సు ఒరిగి రహదారి పక్కన డౌన్‌లో బోల్తా పడింది. అయితే >>2

## ఎపిలో పెట్టుబడుల
# పర్యాటకం

### టూరిజంకు పారిశ్రామిక హోదా కల్పించాలి

### తిరుపతి నుంచి అరకుదాకా ఏడు పర్యాటక హబ్‌లు

### ఢిల్లీలో జరిగిన సదస్సులో మంత్రి దుర్గేష్

**విజయవాడ. జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని టూరిజం. సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలో అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ - సశక్త్ భారత్" అనే ప్రధాన ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సులో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేస్తూ పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్ల పూర్తి చేసుకున్న ఎడిటిఒఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలిసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాల నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ కాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు.

**టూర్ ఆపరేటర్లే అసలైన సారథులు:**

"ప్రభుత్వాలు మౌలిక వసతులను కల్పిస్తాయి కానీ టూర్ ఆపరేటర్లు మాత్రమే పర్యాటక ప్రదేశాలను సందర్శకులకు చేరువ చేసి అద్భుతమైన ప్రయాణ అనుభూతులుగా మారుస్తారు" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఎడిటిఒఐ, నేషనల్ ట్రావెల్ మార్ట్ విజయవంతం కావడాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ భాగస్వామ్యాన్ని వాస్తవబుకింగ్‌లు, నూతన ప్యాకేజీలుగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.పర్యాటక వృద్ధి కేవలం పర్యాటకుల సంఖ్య పెంచడానికే పరిమితం కాకూడదని, స్థానిక గైడ్‌లు, రవాణాదారులు, >>2


శనివారం న్యూఢిల్లీలో కపిల్‌దేవ్‌తో భేటీ అయిన మంత్రి దుర్గేష్

# గోదావరిలో చేపల వేట.. ఐదుగురు మృతి

**చింతూరు జూలై 18 ప్రభాత వార్త:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గోమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు శనివారం చేపల వేటకు వెళ్లి గోదావరి నది నీటిలో మునిగి ఐదుగురు మృతి చెందగా మరో ఆరుగురు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు.ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెండటంతో ఆ గ్రామములో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంభందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం ఉదయం గ్రామస్తులు గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లాలని భావించి ఇద్దరు పురుషులు, 9 మంది మహిళలు కలిసి దోమ తెరలు తీసుకొని గోదావరి నదిలో దిగి వేట కొనసాగిస్తున్నారు. అదే సమయంలో లోతు ఎక్కువగా ఉన్న లోయలోకి 11 మంది జారీ పోయారు. వారిలో ఒక మహిళ ఒడ్డుకు చేరుకొని తన చీర సహాయంతో ఐదుగురు మహిళలు కాపాడింది.మొత్తం ఆరుగురు సురక్షితంగా బయట పడగా సుశీల , ఊకె లక్ష్మి ్మ , తుర్రం భారతి బాసిబోయిన బాలరాజు, ఊకె రమేష్‌లు గోదావరి నీటిలో మునిగిపోయారు. మిగిలిన వాళ్ల గ్రామస్తులకు, సమీపంలోని చేప బోట్లకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న ఎటపాక పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలింపు చేపట్టి మృత

# గొల్లప్రోలులో కొవిడ్ కలకలం

### చెన్నైలో చికిత్స పొందుతూ బాలిక మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూల18,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా గొల్లప్రోలు కు చెందిన ఒక బాలిక చెన్నైలో చికిత్స పొందుతూ కోవిడ్ లక్షణాలతో మృతి చెందడం స్థానికంగా కలకలం సృష్టించింది. స్థానిక జగనన్న కాలనీకి చెందిన 16 సంవత్సరాల బాలిక దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో గత కొన్ని సంవత్సరాలుగా కాకినాడ,విశాఖపట్నం ఆసుపత్రులలో చికిత్స పొందింది. మెరుగైన చికిత్స కోసం గత వారం చెన్నైలోని సిఎంసి హాస్పటల్ కు వెళ్లగా ఆమెకు అనేక పరీక్షలు నిర్వహించగా కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కాగా రక్తహీనత ఇతర అనారోగ్య లక్షణాలతోనే బాలిక మృతి చెందిందని కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత ఒక >>2

# గుంటూరులో మహిళపై దాడి

**• 9 మంది అరెస్టు, 14 రోజుల రిమాండ్ • నిందితుడు రాము పార్టీనుంచి తొలగింపు • మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు: 'ఎక్స్'లో సిఎం చంద్రబాబు • సిఐపై చర్యలు: మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్**

**గుంటూరు, జులై 18, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఘటనపై ప్రభుత్వం, తీవ్రంగా స్పందించింది. మహిళా దాడి ఘటనలో బాధ్యులైన 9 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు తరలించారు.. ఈ ఘటంలో నిందితుడుగా పేర్కొన్న రాములు తెలుగుదేశం పార్టీ నుంచి తొలగించారు. మహిళా దాడి ఘటన పట్ల పోలీసు యంత్రాంగం, మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించి చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు వేగంగా దర్యాప్తు జరిపి మొత్తం తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే, వారిపై దౌర్జన్యాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని తప్పించుకునే అవకాశం ఎవరికీ ఉండదని తేల్చిచెప్పారు.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసులు వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టుచేశారు. ఈ ఘటనపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవికూడా వెంటనే స్పందించారు. బాధిత కుటుంబం తనను కలిసి జరిగిన విషయాన్ని వివరించిన వెంటనే నగరంపాలెం పోలీసులను సంప్రదించి కేసు నమోదు చేయించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మహిళల గౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, ఆరోపణలు ఎదుర్కొంటున్న మల్లెల మూర్తిని తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ కూడా స్పందించి, నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత మహిళకు పూర్తి న్యాయంజరిగేలా చట్టపరమైన చర్యలు >>2

# 5 రోజులు వర్షసూచన

### కోనసీమ, పోలవరంలో భారీ వర్షాలు

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం 5 గంటల నాటికి కోనసీమ జిల్లా ముమ్మడివరంలో 36.2 మిమీ, పోలవరం జిల్లా ఎర్రంపేటలో 35.7మిమీ, కోనసీమ జిల్లా గంగవరంలో 29.7మిమీ, పోలవరం జిల్లా బుట్టాయిగూడెంలో 27.2మిమీ, కాకినాడ జిల్లా రాయభూపాల పట్నంలో 27.2మిమీ చొప్పున వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది.రాష్ట్రంలో రానున్న ఐదు రోజులు మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దక్షిణ ఒడిశా,దాని పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని తెలిపారు. దాని ప్రభావంతో కోస్తాంధ్రలో గంటకు 4050 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రిందవిధంగాఉండే అవకాశం ఉన్నట్లు ప్రఖర్ జైన్ వివరించారు..ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం,కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల,ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు, మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,.. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలుకురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు..ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని సూచించారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలన్నారు. సముద్రం అలజడిగా ఉండి, అలలు ఉధృతంగా ఉన్నప్పుడు చిన్నబోట్లు ఉపయోగించే మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

19-7pg4_19-7pg4.qxd 18/Jul/26 10:48 PM Page 1



# ఎల్‌నినో ప్రభావంతో కమ్ముకొస్తున్న కరవు

సిహెచ్.వి.వి.రఘుబాబు

ప్రపంచ వాతావరణాన్ని శాసించే ఎల్‌నినో వేగంగా బలపడుతోందన్న హెచ్చరికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. జులైలో ముసురు పట్టాల్సిన వేళ ఏప్రిల్, మే నెలలను తలపించే ఎండలు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే అధికఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులను ఆకాశం నిరాశపరుస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే తగ్గుతున్న వర్షాలు, పెరుగుతున్న వేడిరాబోయే రోజుల్లో దేశం మరో సంక్షోభాన్ని ఎదుర్కోనబోతోంది. 1950 తర్వాత అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో ఘటనల్లో ఒకటిగా ఇది నిలిచేఅవకాశం ఉందని అమెరికా జాతీయ సముద్ర, వాతావరణ సంస్థ హెచ్చరించింది. అక్టోబర్‌డిసెంబర్‌మధ్య 81శాతం అవకాశంతో వెరీ స్ట్రాంగ్ ఎల్‌నినోగా మారవచ్చని తాజాబులెటిన్లో వెల్లడించింది. ఈపరిణామం భారత్లో వర్షపాతం, వ్యవసాయం, ఉష్ణోగ్రతలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఫలితంగా దేశానికి ఆహార సంక్షోభం, ఆర్థిక కష్టాలు వెంటాడే పరిస్థితులు ఎదురు కానున్నాయి. వర్షాలు లేకపోవడంతో ఆ ప్రభావం అన్ని రంగాలపై పడుతోంది. వ్యవసాయ రంగం కుంటుపడితే అనేక వ్యవస్థలు కుప్పకూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. నైరుతి రుతుపవనాలు కొంచెం లేటైనా తెలుగు రాష్ట్రాలతోపాటు, దేశమంతా విస్తరించాయి. కానీపరిస్థితులు మాత్రం చాలా భిన్నంగా వున్నాయి. వానల్లేక అల్లాడిపోయిన మహారాష్ట్రలో భారీ వర్షాలు కుమ్మేస్తున్నాయి. మహారాష్ట్రతోపాటు గుజరాత్, కేరళ వంటి రాష్ట్రాల్లో వర్షంబీభత్సం సృష్టిస్తుంటే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో మాత్రం వాన చినుకు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. మబ్బులు,గాలులు తప్ప వర్షం పడడంలేదు. అడపాదడపా కొన్ని చినుకులు పడిపోతున్నాయే తప్ప పెద్ద వానల్లేవ్.పరిస్థితి చూస్తుంటే కరవు కాటు తప్పదేమోననిపిస్తోంది.

సూపర్ ఎల్‌నినో ప్రభావం, నైరుతి రుతుపవనాల బలహీనత కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు, దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌పై తీవ్ర కరవు ఛాయలు కమ్ముకుని పంటల సాగుపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. సకాలంలో రుతుపవనాలు రాకపోవడంతో చినుకు లేక రైతులు చిత్తయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. జూలై మొదటి వారంలో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా ఆ తర్వాత మాత్రం రుతుపవనాల్లో హఠాత్తుగా స్తబ్దత ఏర్పడింది. దీని వల్ల దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణ స్థాయి కంటే పడిపోవడమే కాకుండా, ఎండ తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు ఎగబాకాయి. దేశంలోని సుమారు 197 జిల్లాలపై ఎల్‌నినో ప్రభావం చాలా ఘోరంగా ఉంటుందని కేంద్ర వ్యవసాయ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఈసారి కరవు ఛాయలు నెలకొంటున్నాయి. ప్రధాన పంటల సాగు బాగా ఆలస్యమవుతుండగా, కొన్నిచోట్ల రైతులు పొలాల్లో వేసిన విత్తనాలు మొలకలు రాలేదు. మరికొన్ని చోట్ల మొలిచినా నీళ్లలేక ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ప్రాణహిత మినహా ఇతర ప్రాజెక్టులకు ఇంకా వరదలే మొదలు కాలేదు. అప్పుడప్పుడు తేలికపాటి వర్షం పడుతుందే తప్ప వారం పాటు భారీవర్షాల ఊసే ఉండదని చెబుతోంది.వానలు పడతాయనే నమ్మకంతో దుక్కులు దున్ని, విత్తనాలు వేసిన రైతులు ఇప్పుడు మొలకలు ఎండిపోతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరికొన్ని చోట్లనీరు లేక నారుమళ్లు ఎండిపోతుండగా, బావులు, బోర్లలో కూడా నీటిమట్టాలు పడిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.వర్షాలు ఆలస్యం కావడం పంటల సాగులో కొంత వెనుకబాటు కనిపిస్తోంది. దీనిని అధిగమించడానికి తక్కువ నీటితో, స్వల్పకాలంలో చేతికొచ్చే పంటలను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. మొక్కజొన్న,సజ్జలు, పెసర్లు వంటి పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని చెబుతోంది. దేశవ్యాప్తంగా ముందస్తు సన్నాహాలు మొదలుపెట్టిన కేంద్రం, ప్రతి జిల్లాకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ఇచ్చింది. ఖేత్ బచావో అభియాన్ ద్వారా లక్షలాది మంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా విత్తనాల కొరత రాకుండా 1.75లక్షల క్వింటాళ్ల జాతీయ విత్తన నిల్వలను అందుబాటులో ఉంచారు. రైతులకు పెట్టుబడి కష్టాలు రాకుండా కిసాన్ క్రెడిట్ కార్డ్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన ఆమోదిస్తున్నారు. పంటనష్టపోతే ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రిజిస్ట్రేషన్లను వేగవంతం చేస్తున్నారు.



విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా చూడటం ద్వారా రైతులపై భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్‌నినోతో పంటల సాగు తదితర ప్రభావిత రంగాలపై నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ఎల్‌నినో ప్రభావంపై పూర్తిస్థాయి నిఘాకోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ పనిచేస్తోంది. పంటల వాతావరణ నిఘా విభాగం, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌లు 24గంటలు పనిచేస్తూ సాగు ప్రగతిని మానిటర్ చేస్తున్నాయి. ఏ చిన్నసమస్య తలెత్తినా వెంటనే స్పందించేలా క్షేత్రస్థాయిలో బృందాలను సిద్ధంగా ఉంచారు. తెలంగాణలో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. విస్తృతంగా వర్షాలు కురవాల్సిన ఈనెలలో ఇప్పటికే సగం రోజులు గడిచిపోయింది. అయినా వర్షాల జాడేలేకుండా పోయింది. దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితి ఏర్పడి 35 శాతం వర్షపాత లోటును ఎదుర్కొంటోంది. తెలంగాణలోని33 జిల్లాల్లో 27జిల్లాల్లో వర్షపాత లోటు నమోదైంది. దాదాపు88 శాతం జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అంతే కాకుండా, ఈ నెలలో ఇక మిగిలిన రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. సాగు సీజన్ జూన్ నెల మొదటి వారం నుంచి ఇప్పటి వరకు వర్షపాతం లోటు 35శాతంగా నమోదైంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 243.4 మిల్లీమీటర్లు కాగా, కేవలం 159.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఇది 35 శాతం వర్షపాత లోటు. మల్కాజిగిరి,హన్మకొండ జిల్లాలు వరుసగా 60శాతం, 67 శాతం వర్షపాత లోటును నమోదు చేస్తూ భారీ లోటు కేటగిరీలో ఉన్నాయి. ఓవైపు వర్షాలు లేకపోవడం, మరోవైపు జలాశయాల్లో నీళ్ల అడుగంటిపోతున్నాయి. రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన జలాశయాల్లో నీటినిల్వలు మొత్తం సామర్థ్యంలో కేవలం 1.261 బీసీఎం (బిలియన్ క్యూబిక్ మీటర్లు) నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలో 30.31 శాతం నిల్వలుండగా, పదేళ్ల సాధారణ సగటు 19.26 శాతంగా నమోదయ్యేది. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ఏకంగా 33శాతం మేర నీటితగ్గుదల రికార్డయింది. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వ 3.62 శాతానికి పడిపోయింది. సింగూర్‌లో 15.56 శాతం, శ్రీరాంసాగర్‌లో 18.80 శాతం, కడెం ప్రాజెక్టులో 21.85 శాతం,లోయర్ మానేర్‌లో 26.02 శాతం, జూరాలలో 33.33శాతం నీరు మాత్రమే నిల్వఉంది. ఇక రాష్ట్రంలో 16 జిల్లాల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. గత పోస్ట్‌మాన్‌సూన్ స్థాయిలతో పోల్చితే భూగర్భ జల మట్టాలు గణనీయంగా క్షీణించాయి. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో దాదాపు 8,831 గ్రామాలపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. నష్టం నివారణకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై మంత్రులు, ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాల ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేనురోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతంలోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది.అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు70శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28జిల్లాల్లో ఏఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది. రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. బోర్లు ఎండిపోవడం,చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్రప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. ●

# రెండు రోజుల్లో.. !

ఎ.వి.వి ప్రసాద్

పశ్చిమ బెంగాల్

రాజకీయ వైకుంఠ పాళిలో ఇవాళ నిచ్చెన ఎక్కిన వారు రేపు పాము నోట పడవచ్చు. మళ్లీ బయటకు రావచ్చు, రాకపోవచ్చు. చెప్పలేం.ప్రస్తుతం మమతా బెనర్జీ పరిస్థితి కూడా అలాగే ఉందనిపిస్తుంది. పాము నోట పడినా, అది పాము కాదు.. గజమాల అనుకుంటారుకొందరు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఓ వెలుగు వెలిగిన మమతా బెనర్జీ ఎన్నికలు గడిచి రెండునెలలైనా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొనకపోవడం చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. తన నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రోజురోజుకు ముదురుతున్నా ఆమె మొక్కవోని ధైర్యంతోనే కనిపిస్తున్నారంటే అది కూడా ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. పార్టీ అంతిమ దశకు చేరుతున్నా, అందుకు అంగీకరించకుండా, మేనల్లుడు అభిషేక్ బెనర్జీ ఏదోఒక మంత్రంవేసి కాపాడుతాడులే అనుకోవడం కూడాఆశ్చర్యకరమే. గత పదిహేను సంవత్సరాలుగా ఆమెకు ఎంతో అండగా నిలిచిన పార్టీలోని సీనియర్ నేతలందరు ఒక్కొక్కరుగా ప్రత్యర్థి శిబిరంలోకి జారుకొంటున్నారు. కమర్ హాటి ఎమ్మెల్యే మదన్ మిత్రా గతవారం మమత వర్గం నుంచి బయటకొచ్చిన తర్వాత పార్టీ పరిస్థితి మరింత క్షీణించిట్లేఉంది. మిత్రా తిరుగుబాటు వర్గంలో చేరడం రాజకీయం గా పెద్ద చర్చకు దారి తీసింది. పార్టీ ఆవిర్భావం నుంచి కీలక నేతగా ఎదిగిన మిత్రా హఠాత్తుగా శత్రు శిబిరంలలోకి వెళ్లడం టిఎంసికి గట్టిఎదురు దెబ్బేనని చెప్పాలి. పాఠశాల నియామకాల కేసులో ఆయన కుటుంబ సభ్యులకు ఇడి నోటీసులు జారీ కావడం,వెంటనే పార్టీ నుంచి ఆయననిష్క్రమించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. వారం క్రితం అలీపూర్ కోర్టు ఇచ్చిన తీర్పు తిరుగుబాటు వర్గంలో మరింత బలాన్ని పెంచింది. అయితే దానిని కూడా తిరస్కరించడం ఆమెలోని అసహనాన్ని తెలియజేస్తుంది. రెబెల్ నేత రితబ్రత వర్గాన్నే తృణమూల్ కాంగ్రెస్ ఏకైక చట్టబద్ధమైన విభాగంగా కోర్టు తీర్పు చెప్పడం రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం కలిగించింది. జూన్ 22న జాతీయ కార్యవర్గ సమావేశంలో ఏర్పాటు చేసిన కమిటీయే చట్టబద్ధమైనదనికూడా కోర్టు పేర్కొనడం ప్రకంపనలు సృష్టించింది.పార్టీ కార్యాలయాలు, నిధులపై ఆ వర్గానికేనియంత్రణ కలిగిస్తున్నట్లుగా కోర్టుతీర్పు చెప్పింది. ఈ తీర్పు మమత గొంతులో పచ్చి వెలక్కాయలా చిక్కుకొంది. కోర్టు తీర్పును రితబ్రత ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు నివేదించి తగిన నిర్ణయం తీసుకోవలసిందిగా కోరారు.మమత కూడా తన కౌంటర్‌ను ఇసికి సమర్పిస్తూ తన నాయకత్వం లోనిదే అసలైన పార్టీగా పేర్కొ న్నారు. దీనిపై ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని ప్రకటించవలసి ఉంది.



మమతా బెనర్జీ

ఈ దశలో మమతకు అత్యంత సన్నిహితురాలైన మరో రాజ్యసభ ఎంపీ నటి కోయల్ మల్లిక్ కూడా గత వారం పార్టీని వదిలి వెళ్లడం టిఎంసికి మరో దెబ్బ. దీనితో రాజ్యసభ లో టిఎంసి బలం 13నుంచి 9కి పడిపోయింది. ఈ పరిస్థితిలో మరో రెండు రోజుల్లో జరిగే 'షహీద్ దివస్' పైనే ఇప్పుడు అందరి దృష్టికేంద్రీకృతమై ఉంది. ఆ రోజున ఏదో అద్భుతం జరగబోతోందంటూ మమత అనుచరులు ప్రచారం చేస్తుండడంతో అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. కోలకతాలోని షహీద్ మినార్‌వద్ద భారీ కార్యక్రమం నిర్వహించేందుకు కాంగ్రెస్ కూడాఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగా చేసే ఈ రెండు కార్యక్రమాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కాంగ్రెస్ మమతను ఆహ్వానించినట్లుగా బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు శుభంకర్ నర్కర్ ప్రకటించడంతో అందరిలో ఆసక్తి మరింత పెరిగింది. అయితే ప్రతి సంవత్సరం మాదిరిగా తాము సొంతంగా షాహిద్ దివస్ జరుపుతామని మమత అంటున్నారు. ఆమె రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పిన రోజు అది.1993 జులై 21న ఓటరు గుర్తింపుకార్డులు తప్పనిసరి చేయాలనే డిమాండ్‌తో అప్పటియువజన కాంగ్రెస్ నాయకురాలైన మమత భారీ ఆందోళన నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన పోలీసు కాల్పుల్లో 13మంది కార్యకర్తలు మరణించిన దుర్ఘటన అప్పట్లో తీవ్రసంచలనంసృష్టించింది. ఆ ఘటన మృతులకు సంస్మరణగా మమతా బెనర్జీ యేటా జులై 21న షహీద్‌దివస్‌గా నిర్వహిస్తున్నారు. ఈసారి కూడా ఆ కార్యక్రమం భారీగా నిర్వహించేందుకు అటు కాంగ్రెస్, ఇటు టిఎంసి కూడా ఏర్పాట్లు చేస్తున్నాయి.ఆమె ఆరోజున కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటిస్తారని ప్రచారమవుతోంది. కాదు,పార్టీని బలోపేతంచేసే ప్రణాళిక ప్రకటిస్తారని కొందరు అంటున్నారు. దీనితో అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. టైమ్ పత్రిక గతంలో, ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావశీల నేతల్లో ఒకరుగా మమతను పేర్కొంది. అప్పటి ఆమె రాజకీయ శక్తికి అదొక ఉదాహరణ. కానీ ఇప్పటి మమత పరిస్థితివేరు. ఓటమితర్వాత ఊహించని విధంగా పార్టీ క్షీణించింది. ఎవరినీ ప్రభావితం చేయగలిగే శక్తి ఇప్పుడు ఆమెకు లేదు. పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తమను పార్లమెంటులో ఒక ప్రత్యేక వర్గంగా గుర్తించాలంటూ స్పీకర్‌కు లేఖఇవ్వడాన్ని ఆమె నివారించలేకపోయారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఒక అనామక పార్టీలోకి తరలివెళ్లడాన్ని కూడా అడ్డుకోలేకపోయారు.టిఎంసిపార్టీకి'మమత బ్రాండ్' ఒక కీలక శక్తిగా ఉండేది. అది కూడా ఇప్పుడు కరవైంది.టిఎంసి నాయకులను అవినీతి ఆరోపణలపై పెద్దసంఖ్యలో అరెస్టు చేస్తుంటేఆమె గట్టిగా ప్రశ్నించలేకపోతున్నారు కూడా. పార్టీని తిరిగి పటిష్టం చేసేందుకు తన వద్ద గల ప్రణాళిక ఏమిటో చెప్పలేకపోతున్నారు. పార్టీ రోజు రోజుకు అస్తిత్వ సంక్షోభంలోకి జారిపోతున్నా ఏమీ చేయలేకపోతున్నారు. 'పార్టీకి కొత్త జవసత్వాలు కల్పిస్తాం. అందుకు నాంది జులై 21' అని రెండురోజుల క్రితం ఆమె చేసిన ఒక్రప్రకటనే పార్టీ కార్యకర్తల్లో ఇప్పుడు ఆశలు పెంచుతోంది. మరో రెండు రోజుల్లో ఏం జరుగుతుందో! అది

# నెతన్యాహుకు ఎన్నికల పరీక్ష..!

గన్ని మోహన్

ఇజ్రాయెల్

మూడు ఖండాలకు క్రాస్ రోడ్స్‌గా ఉన్న పశ్చిమాసియా దేశంలో అంతర్గత సంక్షోభం పేరుకుంది. మధ్యప్రాచ్యంలో నిఘా విభాగం ఎంతటి శత్రువునైనా వ్యూహాత్మక విధానంతో మట్టుబెట్టగలిగే దేశంగా ఉన్న ఇజ్రాయెల్‌లో ఇప్పుడు ఎన్నికలు అనివార్యం అయ్యాయి. మధ్యప్రాచ్యంలోని ఈ దేశంలో బెంజమిన్ నెతన్యాహుపై పెరుగుతున్న అసమ్మతితోపాటు ఇరాన్‌తో సుదీర్ఘకాలంగా జరుగుతున్న యుద్ధంలో అమెరికాను తప్పుదారి పట్టించిందన్న భావన కూడా ఇపుడున్నప్రధానిపై వ్యక్తం కావడంతో ఆదేశంలో ప్రతిపక్షాలు ఇదే సాకుగా తీసుకుని నెతన్యాహు ప్రజల్లో తన విశ్వాసాన్ని నిరూపించుకోవాలని పట్టుబడుతున్నాయి. దీనితో అనివార్యంగా ఎన్నికల ప్రకటన వెలువడింది. ఇజ్రాయెల్‌లో నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తిచేసిన పార్లమెంట్ అత్యంత అరుదుగా కనిపిస్తుంది.1988 తర్వాత ముందస్తు ఎన్నికలు లేకుండా పూర్తికాలం కొనసాగిన పార్లమెంటు ఇదే కావచ్చేమో. 2019 నుంచి 2022 మధ్యకాలంలో ఇజ్రాయెల్‌ప్రజలు ఐదుసార్లు ఎన్నికల్లో పాల్గొనాల్సివచ్చింది. సగటున ప్రతి 2.4ఏళ్లకు ఒకపర్యాయం ఎన్నికలు నిర్వహించారు.రాజకీయ అస్థిరతకు ఇదే ప్రత్యక్షనిదర్శనంగా ఇజ్రాయెల్‌లోని డెమొక్రసీ ఇన్‌స్టిట్యూట్ వెల్లడించింది. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, మరోవైపు దక్షిణ లెబనాన్‌వైపు దాడులు, పాలస్తీనా గాజాపై నిరంతర పోరాటం వంటి వాటితో ఇజ్రాయెల్‌ప్రజలు నిరంతరం యుద్ధాలతో విసిగిపోయారు. మూడేళ్లక్రితం జరిగిన హమాస్ దాడితో దేశప్రజలు మళ్లీ యుద్ధం వస్తుందేమోనన్నంతగా భయపడిపోయారు. ఇప్పుడు అమెరికాతో జతకట్టి ఇరాన్‌పై దాడులు చేస్తుండటంతో ఆ భయాలు ఇంకా వారిలో గూడుకట్టుకునే ఉన్నాయి. పార్లమెంటును రద్దుచేసిన వచ్చే అక్టోబరు 27న 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పీకర్ అమీర్ ఒహానా ప్రకటించడంతో ఇజ్రాయెల్‌లో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల ప్రకటన వెలువడటానికి ముందే నెతన్యాహు ఆధ్వర్యంలోని అధికార పార్టీ అనేక అత్యవసర చట్టాలను అమలులోకి తీసుకువచ్చింది. డజనుకుపైగా బిల్లులను అత్యవసరంగా ఆమోదింపచేసుకోడం వెనుక ఎన్నికల్లో మరోసారి తన పట్టు నిరూపించుకునేందుకేనని నిస్సంకోచంగా చెప్పవచ్చు. ప్రధాని నెతన్యాహుకు గట్టిప్రత్యర్థిగా మాజీ ప్రధాని నఫ్తాలీ బెన్నెట్ ముందువరుసలో ఉన్నారు. ఆయనతోపాటే మాజీ సైనికాధికారి నాయకత్వంలోని మధ్యేవాద శక్తులు కూడా కొన్ని దేశంలో బలపడుతూ వస్తున్నాయి. కేవలం 91.41 లక్షల మంది మాత్రమే జనాభా ఉన్న ఈదేశం ప్రపంచ దేశాల నిఘావ్యవస్థల్లో అత్యున్నత వ్యవస్థను కొనసాగిస్తుందన్నది తెలిసిందే. మొస్సాద్ రంగంలోకి దిగిందంటే పని అయిపోయినట్లే అన్న భావన సర్వత్రా వ్యక్తం అవుతుంది. అణ్వాయుధ తయారీకి సంబంధించి ఇరాన్‌ను ముందు నుంచీ వ్యతిరేకిస్తున్న ఈ దేశం అమెరికాతో కలిసి పోరాటంచేస్తున్నసంగతి తెలిసిందే. ఒకదశలో యుద్ధవిరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నుంచి నెతన్యాహు చీవాట్లు కూడా తిన్న సందర్భాలు మీడియా పతాక శీర్షికలకు ఎక్కాయి. ఉత్తరాన లెబనాన్, ఈశాన్యంలో సిరియా, ఆగ్నేయంలో జోర్డాన్, నైరుతిలో ఈజిప్టు పశ్చిమాన మధ్యధరా సముద్రం సరిహద్దులుగా ఉన్న ఈ దేశం జెరూసలెంను తన రాజధానిగా కొనసాగిస్తోంది. ఎన్నికలకు ముందుగా నెతన్యాహు సర్కారు న్యాయవ్యవస్థలోసంస్కరణలు, మీడియా నియంత్రణ, అటార్నిజనరల్ అధికారాలు పరిమితం చేయడం వంటివి ప్రతిపక్షాలకు అస్త్రాలుగా లభించాయి. నెతన్యాహు ఆధ్వర్యంలోని సంకీర్ణ ప్రభుత్వం నిజానికి అనేక వివాదాస్పద బిల్లులు ఆమోదించింది. అనేక ఏళ్లుగా కొనసాగుతున్న యూదు యువకులను సైనిక సేవల్లోకి తప్పనిసరిగాచేర్చే ప్రక్రియను నిలిపివేస్తూ వచ్చిన బిల్లును ఆమోదించడం




బెంజమిన్ నెతన్యాహు

చూస్తే అతిసాంప్రదాయవాదుల మద్దతును కూడగట్టుకునేందుకు నెతన్యాహు వేసిన ఎత్తుగడల్లో భాగమేనని అర్థం అవుతోంది. నాలుగేళ్ల పదవీ కాలంలో తొమ్మిది బడ్జెట్లు వందలాది బిల్లులు ఆమోదించామని, మాపై విశ్వాసం ఉంచినందువల్లనే మళ్లీ ఎన్నికల్లో మేమే గెలుస్తామంటూ నెతన్యాహు పార్టీనేతలు ధీమాతోఉన్నారు. నిజానికి నెతన్యాహుకు సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డుఉంది. ప్రధానికి పదవీకాల పరిమితులు లేకపోయినా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగారు. నాలుగేళ్ల పదవీకాలం పూర్తిచేసిన సందర్భాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వాలు కుప్పకూలినా మళ్లీ సంకీర్ణ ప్రభుత్వంలో నెతన్యాహు ప్రధాని పీఠంపై కొనసాగి తన పట్టును నిరూపించుకోగలిగారు. ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే ఆర్థికసహకారం అభివృద్ధిసంస్థ (ఓఇసిడి) దేశాల జాబితాలో ఎన్నికల మధ్య అత్యల్ప వ్యవధి ఉన్న దేశాల్లో ఇజ్రాయెల్ రెండో స్థానంలో ఉంది. దేశంలోని రాజకీయ అస్థిరతకు ఇదే నిదర్శనమని అక్కడి డెమొక్రసీ సంస్థకూడా విశ్లేషిస్తోంది. ప్రస్తుతం ఆదేశ జిడిపి 719.85 బిలియన్ డాలర్లుగా ఉంది. తలసరి ఆదాయం కూడా 69,804 డాలర్లుగా లెక్కలు వేసారు. చుట్టూ శత్రుమూకలు ఉన్నప్పటికీ సాహసోపేతమైన దాడులకు పూనుకుంటూ తన ఉనికిని కాపాడుకుంటూ వస్తున్న ఇజ్రాయెల్‌లో ఈసారి జరిగే ఎన్నికలు నెతన్యాహుకు ఒక సవాలు వంటిదేనని చెప్పాలి. ఎన్నికల్లో విదేశీ ప్రమేయం కనిపించకపోయినా మిత్రదేశాల సహకారం అంటూ ఇజ్రాయెల్‌కు అందుతూనే ఉంటుంది. ఓపక్క ఆర్థికవృద్ధి, దేశంలో సంక్షేమం, ప్రజాభ్యుదయానికి ప్రాధ్యాం ఇస్తూనే మరోపక్క ఇరాన్, సిరియా,లెబనాన్ వంటి దేశాలనుంచి ఎదురయ్యే దాడుల ముప్పును ఎదుర్కొనడం నెతన్యాహుముందున్న అతి పెద్దసవాల్. యుద్ధంపై విసిగిపోయిన ప్రజలు నెతన్యాహుకే తిరిగిపట్టం కడతారా లేక కొత్తనేతకు పట్టం కడతారా అన్నది రానున్న ఎన్నికలే నిర్ణయిస్తానడంలో ఎలాంటి సందేహంలేదు. ●

# విద్యారంగం నాణ్యత పెంచే కొత్త సంస్కృతి అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

మానవ మేధస్సుకు పదును పెట్టి, సత్ప్రవర్తనను నేర్పి, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ఒక దివ్యమైన సాధనం విద్య. ఒకప్పుడు పాఠశాల విద్య అంటే కేవలం అక్షరాల గుర్తింపు మాత్రమే కాదు, విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం, ఆలోచనా శక్తిని విశ్వవ్యాప్తం చేయడం, నిశిత విమర్శనాత్మక జ్ఞానాన్ని పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసానికి సుదృఢమైన పునాది వేయడం అనే మహోన్నతమైన, పవిత్రమైన భావన ఉట్టిపడేది. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే బోధకుడు కాదు, విద్యార్థి జీవితాన్ని సమున్నతంగా తీర్చిదిద్దే శిల్పిగా విరాజిల్లాడు. కానీ, నేటి ఆధునిక, ప్రపంచీకరణ యుగంలో మార్కెట్ శక్తుల ప్రవేశంతో విద్యా వ్యవస్థ తన ప్రాథమిక నైతిక అస్తిత్వాన్ని కోల్పోతూ ఆందోళనకరమైన రీతిలో వ్యాపారీకరణ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. మార్కుల వేట, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలనే తాపత్రయం, కార్పొరేట్ విద్యాసంస్థల అహంకార పూరితమైన ర్యాంకుల పోటీలమధ్య అసలైన విద్యా ప్రమాణాలు నిలువునా బలైపోతున్నాయి. విద్యార్థుల హృదయాలలో జ్ఞాన తృష్ణను, జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం అంకెలు, శాతాల చుట్టూ తిరిగే ఒక కృత్రిమ ఫలితాల సంస్కృతిని రుద్దడం వల్ల, విద్య అనేది నిరంతర ఆనందదాయకమైన ప్రక్రియ కాస్తా, అత్యంత భయంకరమైన మానసిక బంధనంగా మారిపోతోంది.భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు ఒక కోటి యాభై లక్షల మంది విద్యార్థులు తత్సమాన బోర్డు పరీక్షల వేదికలపై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుండగా, అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కలిపి ప్రతి ఏడాది దాదాపు పది లక్షలకు పైగా బాల్యప్రాయపు విద్యార్థులు పరీక్షల పీఠం ఎక్కుతున్నారు. అయితే ప్రతి ఏటా ఈ పరీక్షల ఫలితాలు వెలువడినప్పుడు సమాజంలో కనిపించే దృశ్యాలు అత్యంత విచిత్రంగా, దారుణంగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, పాఠశాల యాజమాన్యాలు తాము సాధించిన ఉత్తీర్ణత శాతాలనే ఒక గొప్ప విజయంగా, అట్ట హాసంగా చాటుకుంటూ ప్రచార ఆర్భాటాల్లో మునిగిపోతు న్నాయి. ఏ జిల్లా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది, ఏ పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డులకెక్కింది, ఎవరికి పదికి పది జీపీఏ గ్రేడింగ్ వచ్చింది అనే అంశాలే పత్రికల ముఖ్యాంశాలుగా, దృశ్య మాధ్యమాల చర్చలుగా మారుతున్నాయి. దురదృష్టవశాత్తూ, ఈ సంఖ్యాపరమైన ఆరాటంలో అసలైన ప్రాథమిక ప్రశ్నలు పూర్తిగా అణచివేయబడుతున్నాయి. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు నిజంగా ఆయా సబ్జెక్టులలో ఎంత మేర ప్రాథమిక అవగాహనను, లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నారనే శోధన ఎక్కడా జరగడం లేదు. చదివిన అంశాన్ని నిత్య జీవితంలో అన్వయించుకునే సృజనాత్మక నైపుణ్యాలు వారిలో వికసించాయా, రేపటి సమాజంలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సరిపడా వివేకాన్ని వారు సంపాదించగలిగారా అనే మౌలిక ఆశయాలు ఈ శాతాల హోరులో కొట్టుకుపోతున్నాయి. ఈఉత్తీర్ణత శాతం పెంచాలనే అదృశ్య, నిరంకుశ ఒత్తిడి అటు ప్రభుత్వ పాఠశాలలపై, ఇటు ప్రైవేటు పాఠశాలలపై తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపుతోంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికను విద్యార్థులకు క్షుణ్ణంగా, హృదయాలకు హత్తుకునేలా బోధించి వారిలో జిజ్ఞాసను రేకెత్తించాల్సింది పోయి, కేవలం పరీక్షా సన్నద్ధతకే సింహభాగం సమయాన్ని ధారపోస్తున్నారు. ఫలితంగా సిలబస్‌ను సంపూర్ణంగా బోధించకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చిపెట్టే ముఖ్యమైన ప్రశ్నలు, రెడీమేడ్ గెస్ పేపర్లు, ప్రశ్న బ్యాంకులు, నమూనా పత్రాల కంఠస్థీకరణకే పరిమితం చేస్తున్నారు. ఇది విద్యార్థుల్లోని ఆలోచనా శక్తిని చంపేసి, కేవలం తాత్కాలిక జ్ఞాపకశక్తి ఆధారిత క్షుద్ర విద్యను మాత్రమే ప్రోత్సహిస్తోంది. ఈ భయానకమైన పోటీ ప్రపంచంలో కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు తమ వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు, కొత్త అడ్మిషన్ల వేటకు విద్యార్థుల మార్కులను అంగడి సరుకులుగా వాడుకుంటున్నాయి. టాప్ ర్యాంకులను సాధించడమే లక్ష్యంగా, పదో తరగతి వయసులో ఉన్న పసివాళ్లపై అమానవీయమైన, అసాధారణమైన మానసిక ఒత్తిడిని నూరిపోస్తున్నాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ప్రత్యేక తరగతులు, రాత్రి పది గంటల వరకు స్టడీ అవర్ల పేరిట విద్యార్థులను ఇనుప గదుల్లో బందీలను చేస్తున్నాయి. బాల్యానికి సహజ సిద్ధమైన ఆటపాటలు,



శారీరక శ్రమ, మానసిక వికాసానికి కనీస స్థానం కూడా లేకుండా, కేవలం పరీక్షల్లో మార్కులు గుంజడమే ధ్యేయంగా సాగుతున్న ఈ యాంత్రిక విధానం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వైకల్యానికి, నిరాశకు లోనవుతున్నారు. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ఏటా విడుదల చేస్తున్న నివేదికలు ఈ భయంకరమైన వాస్తవాన్ని కళ్లముందు ఉంచుతున్నాయి. పరీక్షల ఒత్తిడిని తట్టుకోలేక, తల్లిదండ్రుల మితిమీరిన అంచనాలను అందుకోలేక, ఆశించిన గ్రేడింగ్ రాదేమోననే తీవ్రమైన భయాందోళనలతో దేశవ్యాప్తంగా ప్రతి ఏటా వేలాది మంది విద్యార్థులు ఆత్మహత్యల వంటి దారుణమైన నిర్ణయాలు తీసుకుని కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. మార్కుల కోసం ఆరాటపడే ఈ క్రూరమైన విద్యా వ్యవస్థ పసివాళ్ల బాల్యాన్ని బలి తీసుకుంటున్న వైనం సమాజ విజ్ఞతకే ఒక పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఉత్తీర్ణత శాతం కోసం సాగుతున్న ఈఅడ్డగోలు రేసు మరో ప్రమాదకరమైన, అనైతికమైన ధోరణికి దారితీస్తోంది. అదే పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగతంగా జరుగుతున్న అపసవ్యాలు, అవకతవకలు. కొన్నిపాఠశాలలు,విద్యాసంస్థలు, ఆఖరికి కొన్ని ప్రాంతాల్లోని విద్యాశాఖ యంత్రాంగాలు కూడా తమ పరిధిలోని ఫలితాలు మెరుగ్గా చూపించుకోవడానికి పరీక్షల నిర్వహణలో అవాంఛనీయమైన జోక్యానికి, అక్రమాలకు పాల్పడుతున్నాయనే నగ్నసత్యాలు నిరంతరం వెలుగుచూస్తూనే ఉన్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక శక్తుల ప్రయోజనాల కోసం సామూహిక కాపీయింగ్‌ను పరోక్షంగా ప్రోత్సహించడం, ఇన్విజిలేషన్ విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించడం లేదా చూసీచూడనట్లు వ్యవహరించడం, విద్యార్థులకు ప్రత్యక్షం గానో, పరోక్షంగానో సమాధానాలు చేరవేయడం వంటి ఘటనలు తరచూ విద్యావ్యవస్థ నైతికతను ప్రశ్నిస్తున్నాయి. ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత, పరీక్షా కేంద్రాల వెలుపల నుండి మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాలకే సమాధానాలు లోపలికి చేర వేయడం వంటి సంఘటనలు దేశవ్యాప్తంగా పరీక్షల విశ్వ సనీయతను నిలువునా దెబ్బతీస్తున్నాయి.గత రెండు దశాబ్దాల కాలంలో వివిధ రాష్ట్రాల్లో వెలుగుచూసిన సామూహిక కాపీయింగ్ ఉదంతాలు, ముఖ్యంగా పాఠశాల భవనాల కిటికీలు, గోడలు ఎక్కి మరీ బంధువులు విద్యార్థులకు కాపీ చీటీలను అందిస్తున్న అపురూప దృశ్యాలు అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. ఇటువంటి అక్రమాల ద్వారా, కాపీయింగ్ సాయంతో బోర్డుపరీక్షల గండం గట్టెక్కుతున్న విద్యార్థులు, భవిష్యత్తులో ఉన్నత విద్యా కోర్సులలోనూ, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలోనూ, అత్యంత పోటీతో కూడిన ఉపాధి రంగాలలోనూ తీవ్రమైన అసమర్థతను ప్రదర్శిస్తూ నిలువునా కుప్పకూలిపోతున్నారు. పునాది లోపించిన ఈ విద్యావిధానం దేశ మానవ వనరుల నాణ్యతను ఎంతగా దిగజారుస్తుందో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం.పరీక్షల నిర్వహణను,విద్యార్థుల భవిష్యత్తును పట్టిపీడిస్తున్న మరో ప్రధాన రుగ్మత 'మార్కుల దాహం'. ప్రస్తుతం అమలులో ఉన్న గ్రేడింగ్ విధానంలో 10 జీపీఏ సాధించడం, లేదా 600మార్కులకుగానూ 600 మార్కులు సాధించాలనే అహేతుకమైన, కృత్రిమమైన లక్ష్యాలను విద్యార్థులపై రుద్దడం వల్ల సమాజంలో ఒక అనారోగ్యకరమైన పోటీ వాతావరణం నెలకొంది. పరీక్షలు అనేవి విద్యార్థి మేధస్సుకు ఒక ఆరోగ్యకరమైన కొలమానం కావాలి తప్ప, విద్యను పరీక్షల గదికే పరిమితం చేసే ఒక నిర్బంధ సాధనంగా మారకూడదు. ఉత్తీర్ణత శాతం కన్నా విద్యా నాణ్య

ong-5_ong-5.qxd 7/18/2026 11:44 PM Page 1



## జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్. యుగంధర్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ జి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు, పోలీసు సిబ్బంది కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ ప్రాంగణాలు, పరిసర ప్రాంతాలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణానికి పునాది అని, స్వచ్ఛమైన వాతావరణం మానసిక ప్రశాంతతను పెంపొందించి విధులను మరింత సమర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహించేందుకు దోహదపడుతుందని తెలిపారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొని ఎస్ఎఎస్ఏ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టంగుటూరు మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**- మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




సార్వత్రిక ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. టంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ జాబ్ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించగా, సుమారు 200 మందికి పైగా అభ్యర్థులు హాజరై ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. మాస్టర్ మైండ్స్, డీబీఎస్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, క్యూ మోటార్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ముత్తూట్ మైక్రోఫిన్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొని అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. రాష్ట్రంలో సుపరిపాలనతో పాటు ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యంగా వెనుకబడిన కొండేపి ప్రాంత యువతకు సాంకేతిక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు పెంచాలని అధికారులకు సూచించారు. రామాయపట్నం పోర్టు, పోర్టు ఆధారిత పరిశ్రమలు, రాష్ట్రానికి వస్తున్న కొత్త పెట్టుబడులతో భవిష్యత్తులో వేలాది ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని చెప్పారు. ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి యువకుడు తన ప్రతిభను నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు కెరీర్ మార్గదర్శకత్వం కూడా అందించేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, టంగుటూరు మండల టీడీపీ అధ్యక్షుడు చెదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు, బెజవాడ వెంకటేశ్వరులు, ఎంపీడీవో దేవసేన కుమారి, తహసీల్దార్ ఆంజనేయులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగల దొంగలపై ఉక్కుపాదం

**- జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలను దొంగిలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. దొంగిలించిన రాగిని కొనుగోలు చేసే స్క్రాప్ వ్యాపారులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ రాగి తీగల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రకాశం భవనంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఇరు జిల్లాల విద్యుత్ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో చోటుచేసుకున్న దొంగతనాల వివరాలను ఏపీ సీపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు కట్టా వెంకటేశ్వర్లు, అబ్దుల్ కరీం వివరించారు. రాగి తీగల చోరీ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రైతులు సాగునీరు అందక పంట నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాగి తీగలను దొంగిలించే వారితో పాటు వాటిని కొనుగోలు చేసే వారినీ నేరంలో భాగస్వాములుగా పరిగణించి కేసులు నమోదు చేయాలని సూచించారు. రాగి, స్క్రాప్ వ్యాపారులు కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలతో ప్రత్యేక రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సోలార్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ రాగి తీగల దొంగతనాల కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ చట్టం కింద కూడా కేసులు నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పి.వి. రమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీఓ అనుపమ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సమగ్ర పెత్తనం..!

**- ఎంఈఓ కార్యాలయంలో బోధనేతర సిబ్బందితో రాజ్యం - ఉపాధ్యాయులపై జులుం**

**ఒంగోలు, ప్రభాతవార్త**

విద్యావ్యవస్థలో ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మధ్యవారధిగా నిలవాల్సిన మండల విద్యాశాఖాధికారుల(ఎంఈఓ) కార్యాలయాలు ఇప్పుడు కొందరు బోధనేతర సిబ్బందికి అడ్డాగా మారాయి. ఎంఈఓ కార్యాలయాల్లో(ఎంఆర్సీ) పని చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది పెత్తనం రోజురోజుకు శృతిమించుతుంది. ఉపాధ్యాయులకు సహకరించాల్సిన వీరు నియంతల్లా వ్యవహరిస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తుండడం విమర్శలకు తావిస్తుంది. ప్రతి మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఆర్సీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఒక ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఒక డేటా ఎంట్రీ లేదా కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తుంటారు. ఇటీవల విద్యాశాఖకు సంబంధించి ప్రతి పని ఆన్‌లైన్ (సాంకేతికత)కావడంతో వీరి పాత్ర కీలకంగా మారింది. ఎంఈఓలకు పూర్తిస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో ఎంఆర్సీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లపైనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తుంది. ఇదే అదునుగా భావించిన ఈ సిబ్బంది ఎంఈఓ కార్యాలయాలను తమ గుప్పెట్లో తీసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంబంధిత సమాచారం కోసం, లేదా నివేదికలు ఇచ్చేందుకు వచ్చే ఉపాధ్యాయులకు వీరు కనీస మర్యాద ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీరిలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల స్థాయిలో నేరుగా సంబంధాలు ఉండడంతో ఎంఈఓలు సైతం వీరిని ఏమి అనలేని నిస్సహాయ స్థితిలోఉండిపోయారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఎంఈఓ తమ మాట వినకపోతే రాజకీయ పలుకుబడి ఉపయోగించి వారిని బదిలీ చేయిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ ఎంఈఓను అక్కడి సిబ్బంది బెదిరించిన ఘటన వీరి ఆగడాలకు అద్దం పడుతుంది. అద్దంకి నియోజకవర్గం, పర్చూరు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరికి భయపడి రాజీపడుతుండగా మరికొన్ని చోట్ల వీరితో కుమ్మక్కై ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతున్నారు. బోధనేతర సిబ్బంది బదిలీలకు సంబంధించి స్పష్టమైన నిబంధనలు అమలు కాకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణం. చాలా మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఎంఐఎస్ కోఆర్డినేటర్లు గత పది, పదిహేనేళ్లుగా ఒకే చోట తిష్ట వేశారు. మరికొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి డిప్యూటేషన్‌పై వచ్చి మరిపెత్తనం చెలాయిస్తున్నారు. క్లస్టర్ రిసోర్సు పర్సన్‌లను సీఆర్ఎంటీ ఉపాధ్యాయులుగా మార్చినప్పటికి వారు బడులకు వెళ్లకుండా ఆఫీసులకే పరిమితం అవుతున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

## ముద్రగడకు చింతలపూడి నివాళి

**అద్దంకి, జులై 18, ప్రభాతవార్త :**



అద్దంకి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ శనివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో కాపు ఉద్యమ నేత, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభం చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రంలో వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## గ్రూప్2 ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**

ఎ.పి.పి.ఎస్.సి. గ్రూప్2 ప్రిలిమినరీ పరీక్షలకు ఉచిత శిక్షణ పొందేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్, ఒంగోలు సంచాలకురాలు ఎస్. నిర్మలా జ్యోతి తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపికైన 100 మంది అభ్యర్థులకు ఈ నెల 30వ తేదీ నుంచి రెండు నెలల పాటు పూర్తిగా ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణ కాలంలో గ్రూప్2 ప్రిలిమినరీ పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా నిపుణులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్సీఎస్సీ, ఇంటర్, డిగ్రీ, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (వార్షిక ఆదాయం రూ.5.10 లక్షల లోపు), ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈ నెల 25లోపు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని ఎ.పి. బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99892 85530, 89850 90926 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు బోల్తా.. 17 మందికి గాయాలు

***- గాయపడ్డ ప్రయాణికులను హాస్పిటల్లో పరామర్శించిన మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, రాష్ట్ర మారి టైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, ఆర్టీసీ అధికారులు - ఇద్దరికి మినహా, మిగిలిన 15 మందికి స్వల్ప గాయాలు***







**సంతనూతలపాడు/కొండపి, జులై 18, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ హైర్ బస్ బోల్తా పడగా 17 మంది గాయాలకు లోనయ్యారు. గాయాలకు గురైన వారిలో పది మంది కొండపి ప్రభుత్వ హాస్పిటల్‌లో మరొక ఏడు మంది ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. మరొక ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ ఎస్కే బేగం, మరొక వృద్ధునికి తీవ్ర గాయాలు కాగా ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. కామేపల్లి నుండి ఏపీ 39 టీవై 1589 నంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సు శనివారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఒంగోలుకు బయలుదేరింది. ఈ బస్సు సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా ఒంగోలు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి బస్సు డ్రైవర్ మార్జిన్‌కు తిప్పడంతో బస్సు ఒరిగి రహదారి పక్కన డౌన్‌లో బోల్తా పడింది. అయితే పక్కన గల ముళ్ళచెట్టు ఉండడంతో బస్సును గట్టిగా ఆపింది. దీని వల్ల ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. లేని పక్షంలో పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ముఖ్యంగా ఆర్అండ్‌బి రహదారి వెడల్పు లేకపోవడంతో రెండు బస్సులు ఎదురెదురుగా ప్రయాణించాలంటే ప్రమాదకరంగా తయారైంది. ఆర్అండ్‌బి రహదారిని విస్తరిస్తే తప్ప ప్రమాదాలు నివారింపబడవు. జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ, ఒంగోలు ఆర్టీసీ డిపో మేనేజర్ టీజే చంద్రశేఖర్, సూపరింటెండెంట్ నాయక్, చీమకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రసాద్, సంతనూతలపాడు ఎస్సై వేజెండ్ల అజయ్‌బాబు, పోలీసు సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. పోలీసు శాఖ, స్థానిక గ్రామస్తులు ప్రమాదం జరిగిన వేళ సత్వరమే స్పందించి ప్రయాణికులను బస్సులో నుంచి బయటకు తరలించారు. గాయపడ్డ 17 మందికి ఆర్టీసీశాఖ నుండి తాత్కాలికంగా ఒక్కొక్కరికి రూ.1500లు పారితోషికంను అందజేశారు. సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేశారు. పెద్ద ప్రమాదం తప్పిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కండక్టర్ బేగం, మరొక వ్యక్తికి మినహా మిగిలిన 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ బస్సులో అనకర్లపూడి నుండి మద్దులూరు హైస్కూల్‌కు పది మంది విద్యార్థులు పయనించారు. విద్యార్థులు కూడా సురక్షితంగా బయటపడ్డారు. వారంతా తమ స్వగ్రామం అనకర్లపూడికి తరలి వెళ్లారు. విద్యాశాఖాధికారులు వారి స్వగ్రామంలో వారిని పరామర్శించారు. ప్రమాద సంఘటనపై గాయపడ్డ ప్రయాణికులను ఒంగోలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో, కొండపి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు పరామర్శించారు. దీనిపై మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రమాద సంఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌తో ఫోన్లో తెలియజేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని మంత్రి బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. క్షతగాత్రులు పూర్తిగా కోలుకునే వరకు వైద్యం అందిస్తామన్నారు. అదృష్టవశాత్తు ప్రయాణికులకు చిన్న చిన్న గాయాలై బయటపడడం ఒక వరమని మంత్రి స్వామి పేర్కొన్నారు. బస్సు ప్రమాదం దురదృష్టకరమన్నారు. ప్రమాద సంఘటనపై ఆర్టీసీ జిల్లా అధికారులతో ఫోన్లో మంత్రి రాంప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణమే వైద్యం అందించాలని మంత్రి రాంప్రసాద్ ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్ రజియాకు మెరుగైన చికిత్స అందించాలని మంత్రి రాంప్రసాద్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. బాధిత ప్రయాణికులకు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలను కల్పించాలని మంత్రి రాంప్రసాద్ ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చిందని అన్నారు. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని మంత్రి రాంప్రసాద్ ఆకాంక్షించారు. ఇటువంటి ప్రమాద సంఘటనలు పునరావృతం కాకుండా భద్రత చర్యలు మరింతగా కట్టుదిట్టం చేయాలని మంత్రి రాంప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా ఆర్అండ్‌బి రహదారిని ఈ ప్రాంతంలో విస్తరిస్తే తప్ప ప్రమాదాలు నివారింపబడవని పలు గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం మరింతగా ఇరుకుగా ఉంటుంది. అంతే కాకుండా రహదారి మార్జిన్ లోతట్టుగా ఉంటుంది. ఆర్అండ్‌బి శాఖ వారు దీనిపై స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## శాఖల సమన్వయంతోనే పచ్చదనం పెంపు: కలెక్టర్ రాజాబాబు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



పచ్చదనాన్ని పెంపొందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చెప్పారు. సముద్ర తీరంలోని ప్రభుత్వ స్థలాలు, పట్టణాలలోని ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ప్రకాశం భవనంలో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. అటవీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్థిక సహాయం, నిబంధనలను డీఎఫ్‌వో వినోద్ కుమార్ (టెరిటోరియల్) ఈ సమావేశంలో వివరించారు. సముద్ర తీర ప్రాంతంలో గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తే వచ్చే ఐదేళ్లలో మొక్కలు నాటేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అదే విధంగా నమో వన యోజన పథకం కింద మున్సిపాలిటీలలో నగరవనాలు పెంచేందుకు పాఠశాలల్లో మొక్కలు నాటేందుకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రాష్ట్రంలో హరిత విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే ఆర్థిక సహకారాన్ని వినియోగించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని వినోద్ కుమార్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో పీవీ రమణ, డీఎఫ్‌వో రాజశేఖర్(సోషల్ ఫారెస్ట్రీ), ఒంగోలు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపిచంద్, డీఈవో రేణుక, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో అనుపమ, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, జిల్లా వ్యవసాయాదికారి శ్రీనివాసరావు, గనులశాఖ డిప్యూటీ డైరక్టర్ రాజశేఖర్, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మీ, తీర ప్రాంత మండలాల తహసీల్దార్లు, ఒంగోలు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో మళ్లీ ఎన్నికలు.. సమరానికి సై అంటున్న రాజకీయ పార్టీలు..! ఎప్పుడంటే..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఏపీలో మరోసారి ఎన్నికలు రానున్నాయి. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్‌లో ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకటించే ముందు పూర్తి చేయాల్సిన పరిపాలనా ప్రక్రియలను



అధికారులు వేగవంతం చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని అంశాలపై ప్రభుత్వం సమీక్షలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎన్నికలను ఒకే సారి కాకుండా దశల వారీగా నిర్వహించే అవకాశాలపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. తొలి విడతలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించి, అనంతరం గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల ఎన్నికలు పూర్తయిన తర్వాత రెండో విడతలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చివరి దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి మొత్తం స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందుగా ఓటర్ల జాబితాల సవరణ, వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి కీలక ప్రక్రియలను అధికారులు పూర్తి చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులో ముగించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికలపై రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ వ్యూహాలను పదును పెడుతున్నాయి. అయితే ఎన్నికల షెడ్యూల్, తేదీలపై ప్రభుత్వం లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన చేసిన తర్వాతే పూర్తి స్పష్టత రానుంది. అప్పటి వరకు ఎన్నికలపై జరుగుతున్న కసరత్తులే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## స్వచ్ఛ ఒంగోలు ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం: ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



స్వచ్ఛమైన ఒంగోలు నిర్మాణం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీకే ఎన్‌క్లేవ్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నగర అభివృద్ధితో పాటు పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్లపై చెత్త వేయకుండా, విచ్చలవిడిగా పశువులను వదలకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తేనే ఒంగోలు రాష్ట్రానికి ఆదర్శ నగరంగా నిలుస్తుందన్నారు. నగరాన్ని ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని, ఆ అభివృద్ధిని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని తెలిపారు. అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటి ఎక్కువ చెత్త ఉత్పత్తి అయ్యే ప్రాంతాలను బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తించి అక్కడే వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అమృత్-2 పథకం ద్వారా నగరంలో పాత తాగునీటి పైప్‌లైన్లను దశలవారీగా మార్చి ప్రతి ఇంటికి నిత్య తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని, ప్రజల సహకారంతో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయ పరుస్తామని పేర్కొన్నారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ అభివృద్ధితో పాటు పరిశుభ్రత ఉద్యమాన్ని కూడా ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నగరపాలక సంస్థ కమిషనర్ వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే ఘన వ్యర్థాల నిర్వహణ లక్ష్యాలు పూర్తిస్థాయిలో అమలవుతాయని తెలిపారు. ఐటీసీ ప్రతినిధులు వ్యర్థాల రీసైక్లింగ్ విధానాలపై నివాసితులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ శ్రీనివాస్, బీకే ఎన్‌క్లేవ్ అసోసియేషన్ అధ్యక్షురాలు సరయు, కార్యదర్శి వెంకటేశ్వరులు, టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, అపార్ట్‌మెంట్ నివాసితులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రజలతో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, "పరిశుభ్రమైన ఒంగోలే ఆరోగ్యవంతమైన ఒంగోలు" అనే సందేశాన్ని బలంగా వినిపించారు.

## సింగరకొండలో అన్నదానానికి విరివిగా విరాళాలు

**అద్దంకి, జులై 18, ప్రభాతవార్త :**



సింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి నిత్య అన్న దాన పథకానికి అద్దంకి వాస్తవ్యులు బచ్చల రవికుమార్, ధర్మపత్ని జయశ్రీ, కుమార్తె రాధాకృష్ణ శ్రీ అన్నదానానికి 25,116 రూపాయలు, సంతనూతలపాడు మండలం కొనగానివారిపాలెం వాస్తవ్యులు గుర్రం శరత్ బాబు నిత్య అన్నదానికి 10,150 రూపాయలు, అద్దంకి వాస్తవ్యులు చేబ్రోలు సాయిరాం ధర్మపత్ని ప్రియాంక నిత్య అన్నదానికి 10,116 రూపాయలు పాలకమండలి అధ్యక్షులు చుండూరి మురళీ సుధాకర్ రావుకి అందజేశారు . ఆలయ పూజారులు దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం తీర్థ ప్రసాదములు అందజేశారు.

## చక్రాయ పాలెంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం

**అద్దంకి, జులై 18, ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా శనివారం మండలంలో చక్రాయపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, వద్ద ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్వచ్ఛంద కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, ఎమ్మార్వో శ్రీచరణ్, సచివాలయం సిబ్బంది, తెలుగు దేశం పార్టీ నాయకుడు, మామిడి రాంబాబు , చక్రాయపాలెం రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం లబ్ధిదారులతో సమీక్ష

హనుమంతునిపాడు, జూలై 18, ప్రభాతవార్త



రాష్ట్రీయ కృషి వికాస్ యోజన- వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం 2025-26లో భాగంగా హనుమంతునిపాడు మండలం హాజీపురం గ్రామంలో 30 మంది రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలు, గైలెజ్ తయారీ సంచులు, వనసామూల ఎరువు తయారీ యూనిట్లను పూర్తి సబ్సిడీపై అందజేయడం జరిగింది. ఈ పథకం నిర్వహణ, ప్రయోజనాలపై కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జైనులబ్దిన్ లబ్ధిదారులతో హాజీపురం రైతు సేవ కేంద్రం నందు సమీక్ష నిర్వహించారు. వర్షాధార ప్రాంత రైతులు కేవలం వ్యవసాయంపై ఆధారపడినట్లయితే కరువు సమయంలో వారు పూర్తిగా నష్టపోతారు. అటువంటి సమయంలో వారికి ఇతర ఆదాయ వనరులు అయినటువంటి పశు పోషణ, వనసామూల ఎరువు తయారీ లేదా తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే కరువు ప్రభావం వల్ల వ్యవసాయంలో నష్టం వాటిల్లినప్పటికీ ఇతర ఆదాయ మార్గాల ద్వారా జీవనోపాధి పొందవచ్చు అన్నారు. ఈ పథకంలో ప్రభుత్వం ద్వారా అందిన పరికరాలను సక్రమంగా వినియోగించుకుని మంచి ఆదాయం పొందాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కుందురు నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్చార్జి గాయం తిరుపతిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు కోటపాటి శేషయ్య, నీటి సంఘం అధ్యక్షులు గాయం సుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, తాతపూడి స్వాల్డీ జాన్, వ్యవసాయాధికారి రవికుమార్, ఏఈవో రసూల్, పీఏపి గాయత్రి, పథక లబ్దిదారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం

హనుమంతునిపాడు, జూలై 18, ప్రభాతవార్త



పంటలపై ఎరిస్‌ ప్రభావం, సమగ్ర యాజమాన్య పద్ధతులపై హనుమంతునిపాడు మండల రైతులకు శుక్ర, శనివారాలలో రెండు రోజుల పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం సీతారాంపురం రైతు సేవ కేంద్రం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జైనులబ్దిన్ పలుపంటలలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతులు రసాయనిక వ్యవసాయాన్ని ఆదుపులో ఉంచుకుని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లితే తక్కువ పెట్టుబడులతో మంచి ఆదాయం, ఆహార ఉత్పత్తులు పొందవచ్చని అన్నారు. పంటలు సాగు చేయు రైతులు తప్పకుండా పంట నమోదుతో పాటు కంది, వరి, మిరప రైతులు పంటల భీమా పథకంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ బసవరాజు, పండ్ల కూరగాయల తోటలలో రైతులు ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. వ్యవసాయాధికారి రవికుమార్, ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ వెంగళరాయుడు, ఎరిస్‌ని పరిశీలనలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు కషాయాల తయారీ, ఉపయోగాలను రైతులకు వివరించారు. కనిగిరి డివిజన్ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ సురేఖ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన పలు శిక్షణ కార్యక్రమాలు, క్షేత్ర ప్రదర్శనలను ఆత్మ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం నిమ్మ తోటలను సందర్శించి రైతులకు పలు బిడపేపర్ గుర్తింపు, యాజమాన్య పద్ధతులను వివరించారు.

## నూతన వధువులను ఆశీర్వదించిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య

హనుమంతునిపాడు, జూలై 18, ప్రభాతవార్త



మండల కేంద్రంలోని హనుమంతునిపాడు గ్రామం ఎస్సీ కాలనీలో మల్లెల యేసయ్య- కరుణమ్మ కుమార్తెలు ఉషారాణి, ఐశ్వర్యల వివాహ మహోత్సవ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య పాల్గొని నూతన వధువులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలోమాజీ శ్రీనివాసరెడ్డి, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు వేసపోగు తిరుపాలు, కేఎస్ఎస్ సభ్యులు వేశపోగు నిరీక్షణ, వేశపోగు ప్రమీల, కత్తి మత్తయ్య, కత్తి అజయ్, గ్రామ పెద్దలు, కాలనీ వాసులు వేసపోగు కృపారావు, వేసపోగు జకరయ్య, కత్తి శ్రీను, వేసపోగు జీవన్, కత్తి ప్రవీణ్, మేకల మర్కు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న జనసేన నాయకులు

చీరాల, జూలై 18, ప్రభాతవార్త



చీరాల మండలం కావూరి వారిపాలెం జనసైనికుడు ధరఖడి సుధీర్ వివాహానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెడపూడి విజయ్ కుమార్‌తో పాటు జనసేన పార్టీ సీనియర్ నాయకులు గూడూరు శివరాంప్రసాద్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## పరిశుభ్రతపై అవగాహన

పర్చూరు, జూలై 18, ప్రభాతవార్త



కారంచేడు పీహెచ్‌సీలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని తెలిపారు. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచడంతో పాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతుబాధ్యతగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## నూతలపాడులో ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లోన్ మేళా

పర్చూరు, జూలై 18, ప్రభాతవార్త



పర్చూరు మండలం నూతలపాడులో ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో లోన్ మేళా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పీఏసీఎస్ చైర్మన్ విన్నకోట సతీష్ పాల్గొని సహకార బ్యాంకు అందిస్తున్న రుణాలను ప్రజలకు వివరించారు. సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ చెల్లించే ఏకైక బ్యాంకు సహకార బ్యాంకు అని బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన రైతులు, మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

## ఇరు వర్గాల ఘర్షణలో గాయపడిన టీడీపీ దళిత కార్యకర్తకు అండగా గూడూరి

పెద్దదోర్నాల,జూలై18, ప్రభాతవార్త



పెద్దదోర్నాల మండలం నల్లగుంట గ్రామంలో ఇటీవల వోటు చేసుకున్న ఇరు వర్గాల ఘర్షణలో గాయపడిన పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న టీడీపీ దళిత కార్యకర్త తప్పెట్ల జేమ్స్‌ను శనివారం యర్రగొండపాలెం వైసీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పరామర్శించారు. జేమ్స్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు తన వ్యక్తిగతంగా జేమ్స్‌కు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నల్లగుంట్లలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నల్లగుంట్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు శేఖర్‌బాబు నివాసానికి వెళ్లి గూడూరి ఎరిక్షన్‌బాబు పరామర్శించారు. పరామర్శించిన వారిలో గూడూరితో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రామాయపట్నం పోర్టు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆందోళన కార్యక్రమం

గుడ్లూరు, జూలై 18, ప్రభాతవార్త



రామాయపట్నం పోర్టును ప్రైవేటీకరణ చేస్తున్నారని కందుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదనయాదవ్ ఆధ్వర్యంలో వైసీపీ ఆందోళన బాట పట్టింది. శనివారం వైసీపీ శ్రేణులతో కలిసి బైకుపై ర్యాలీగా రామాయపట్నం పోర్టు ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ వైసీపీ శ్రేణులు చేస్తున్న ఆందోళనను పోలీసులు అడ్డుకోవడంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పోర్టును పూర్తి ప్రభుత్వ నిర్మాణం చేసేందుకు, స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంతో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేశారని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ పేరుతో స్థానికుల ఉపాధి ఉద్యోగ అవకాశాలను గండి కొడుతుందని ఆరోపించారు. వైసీపీ స్థానిక నేతలతో కలిసి రామాయపట్నం పోర్టు వద్ద వైసీపీ చేస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కందుకూరులో అంగన్‌వాడీకేంద్రాలకు స్టవ్‌లు పంపిణీ

### - మహిళాశిశుసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట -ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు జూలై 18, ప్రభాతవార్త



మహిళాశిశుసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.ఇందులో బాగంగా కందుకూరు ప్రాజక్ట్ పరిధిలోని వలేటివారిపాలెం మండలానికి 53,ఉలవపాడు సెక్టార్ పరిదిలో 183 వెరసి 236ఇండక్షన్ స్టవ్‌లును,వంట పాత్రలను ఆయా కేంద్రాల సిబ్బందికి శనివారం ఎమ్మెల్యే పంపిణీచేశారు.సీడీపీవో ఉషారాణి అధ్వర్యంలో స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందన్నారు.ప్రభుత్వం చిత్తశుద్ధితో మంజూరు చేసిన ఈ స్టవ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.వీటి ద్వారా విద్యుత్ ఆదా అవుతుందన్నారు.అదేవిధంగా చిన్నారులుకు,గర్భిణీలుకు,బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంతోపాలు పలు సేవలును పారదర్శకంగా నిర్వహించాలని ఐసీడీఎస్ అధికారులకు సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉషారాణి,మాధవీలతలతోపాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## షైనింగ్‌స్టార్ స్టార్‌లుగా టీఆర్ఆర్ విద్యార్థులు

కందుకూరు జూలై 18, ప్రభాతవార్త



కందుకూరు టీఆర్ఆర్ జూనియర్ కళాశాలకి చెందిన పి.మధులత,పర్వేజ్,పి.వెన్నెల అనే విద్యార్థులు ప్రకాశం జిల్లాస్థాయి సైనింగ్ స్టార్ అవార్డులకి ఎంపికైనారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ ఆర్ లావణ్యలత, అధ్యాపకులు కట్టసుబ్బారావు చాముండేశ్వరి,మేరీ గ్రేస్,ఒరుగంటి వెంకటేశ్వరరావు ,ఖాదర్‌వలి,చుండూరి బాబురావు, బొప్పరాజు వెంకట కాశిరత్నం,హాజరతయ్య, మాధవరావు,సీతారావమ్మ,శివకుమారి,మాధవిలక్ష్మి,రాజు తదితరులు అభినందనలు తెలియజేశారు.వీరికి రూ.20 వేలతోపాటు ప్రశంసా పత్రము అందచేస్తుందని ప్రిన్సిపల్ తెలిపారు.

## బి.ఆర్. ఆక్స్‌ఫర్డ్‌లో హౌస్ ఇనాగరేషన్

### - ఆంగ్లంపై పట్టు సాధించాలి - అధినేత ఉన్నం

కందుకూరు జూలై 18, ప్రభాతవార్త




విద్యార్థులు ఆంగ్లబాషపై పట్టుసాధించాలని బి.ఆర్.ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల అధినేత ఉన్నం బాస్కర్‌రావు విద్యార్థులకు సూచించారు.అది వారి కెరీర్‌కు బలమైన పునాదని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించేందుకు హౌస్ ఇనాగరేషన్ వేడుకలును శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు.తొలుత డైరక్టర్ బాలబాస్కర్‌తోపాటు పలువరు జ్యోతిప్రజ్వలనం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నేటి ప్రపంచ పోటీని తట్టుకోవడానికి విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లీష్ భాషపై పూర్తి పట్టు సాధించాలన్నారు. డైరక్టర్ బాలబాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఇంగ్లీష్ కమ్యూనికేషన్, క్రమశిక్షణను మరింత పెంపొందించడానికి పాఠశాలలో ప్రత్యేకంగా కాయిన్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు.మరో అతిథి అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నిత్య జీవితంలో మోడరన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండటం ఎంతో ముఖ్యమన్నారు.ఈ విద్యా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్ర బాబు,పాఠశాల డీన్,ప్రిన్సిపాల్స్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## పొగాకు కొనుగోళ్లను పరిశీలించిన కిసాన్ మోర్చా జిల్లా నేతలు

కందుకూరు జూలై 18, ప్రభాతవార్త

ప్రభుత్వమే పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతి బాబు డిమాండ్ చేశారు.ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1000కోట్లు కేటాయించాలని ఆయన సూచించారు.సగటు క్వింటాల్ ధర 25వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గిట్టుబాటు ధర సాధించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. శనివారం పట్టణంలోని 27వ పొగాకు వేలం కేంద్రాన్ని జిల్లా నాయకత్వ బృందం సందర్శించింది.ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ పొగాకు ప్రభుత్వాలకు 90 వేల కోట్లకు పైగా లాభాలు వస్తాయని తెలిపారు. దాంట్లో నుండి అప్పుగా 1000 కోట్లు కేటాయించి ప్రభుత్వమే రైతుల వద్ద నుండి పొగాకును కొనుగోలు చేయాలని తద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. 2వ దశ పోరాటంలో 27వ వేలం కేంద్రంలోని పొగాకు రైతులు అందరూ పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జే జయంతి బాబుతోపాటు సభ్యులు వి.హనుమారెడ్డి, జిల్లా కన్వీనర్ చుండూరి. రంగారావు, సిఐటియు నాయకులు జివిబి కుమార్, వాసుబాబు తదితరులు పాల్గొన్నారు

## సఖి హబ్ ఆరోగ్య భద్రత కోసమే లక్ష్యం

### - జిల్లా కోఆర్డినేటర్ వరం సునీత

పొదిలి, జులై 18, ప్రభాతవార్త



సమాజంలో మహిళల ఆరోగ్య భద్రత ముఖ్యమని, అలాంటి మహిళల ఆరోగ్య భద్రత కోసం సఖి హబ్ నిరంతరం పని చేస్తుందని సఖి హబ్ మార్కాపురం జిల్లా కోఆర్డినేటర్ వరం సునీత అన్నారు. శనివారం పొదిలి ట్రైలర్స్ కాలనీలో సఖి హబ్ జిల్లా స్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంటి ఇల్లాలు ఆరోగ్యంగా ఉండాలని, అలాంటప్పుడే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా సమాజమే ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. స్త్రీ లేనిదే సృష్టి లేదని సృష్టికి మూలం స్త్రీ కనుక అటువంటి స్త్రీల ఆరోగ్యం కోసం సామాజిక సేవా దృక్పథం కలిగిన సఖి హబ్ ద్వారా తన నిరంతర ఆరోగ్య ఉచిత సలహా సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిరంతరం పని చేస్తుందని తెలిపారు. తమ సఖి హబ్ కోఆర్డినేటర్లు మహిళలను బృందాలుగా చేసుకుని ఉచిత ఆరోగ్య సలహాలను అందించడమే కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహారపు అలవాట్లు పరిశుభ్రత వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతూ పోషకాహారం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకొంటూ ఆరోగ్యంగా ఎలా జీవించాలో తెలుపుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల బ్లాక్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఆల్ఫా స్కూల్లో దళిత బాలుడి పట్ల యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి నిరసనగా 20న ధర్నా

### - దళిత ఉద్యమ నాయకుడు సంద్రపాటి కాలేబు మాదిగ

పొదిలి, జులై 18, ప్రభాతవార్త



పొదిలి పట్టణం ఆల్ఫా స్కూల్లో చదువుతున్న దళితుడైన బాలుడు రిహాల్ తలకు తీవ్ర గాయమైన పట్టించుకోని ఆల్ఫాస్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరి పట్ల సోమవారం మార్కాపురం కలెక్టరేట్ కార్యాలయం వద్ద దళిత సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు దళిత ఉద్యమ నేత సంద్రపాటి కాలేబు మాదిగ తెలిపారు. ఈనెల 15వ తేదీన దళిత బాలుడైన శిరిగురి రిహాల్ పొదిలి పట్టణంలోని ఆల్ఫా స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఆ రోజు రిహాల్‌కు తలకు తీవ్ర రక్తగాయమైంది. ఈ సంఘటనపై ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు వెంటనే బాలుడు దగ్గరకు వచ్చి వారు ఒంగోలు ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం వెళ్లారు. ఆల్ఫా స్కూల్ యాజమాన్యం ప్రిన్సిపాల్ బాలుడి పట్ల ఎటువంటి శ్రద్ధ చూపకుండా బాధ్యత రహితంగా వ్యవహరించాడన్నారు. కేవలం ఎస్సీ కులం అనే ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని ఆరోపించారు. ఈ విషయంపై మార్కాపురం డీఈవో, కలెక్టర్‌లకు ఆల్ఫాస్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్‌పై తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అందుకు నిరసనగా సోమవారం మార్కాపురం కలెక్టర్ కార్యాలయం నందు నిరసన కార్యక్రమం చేపడతామని కాలేబు మాదిగ తెలియజేశారు.

## కొనకనమిట్లలో సాయిబాబా బిక్షా సేవా ప్రారంభం

కొనకనమిట్ల, జులై 18, ప్రభాతవార్త



మండల కేంద్రమైన కొనకనమిట్లలో పొదిలి శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం బిక్ష సేవా నిర్వహించారు. ఈనెల 29వ తేదీన జరిగే గురు పౌర్ణమి మహోత్సవం సందర్భంగా అన్నదానంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రచార రథ ద్వారా ఈ బిక్షా సేవా కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు కల్వా సత్యనారాయణ, కార్యదర్శి సోమిశెట్టి చిరంజీవిలు తెలిపారు. సాయిబాబా భక్తులు తమకు తోచిన విధంగా విరాళాలు అందజేసి భక్తి చాటుకుంటున్నారని చెప్పారు. గ్రామంలో తిరిగి బిక్ష సేవా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సామిరాజా, బొగ్గవరపు శ్రీనివాసరావు, తుమ్మపెంట సుబ్రహ్మణ్యం, కొండవీటి సాంబశివరావు మహిళ సేవకులు పాల్గొన్నారు.

## రైతు విభాగం సెక్రెటరీ భాస్కర్ రెడ్డి భార్య మృతి

తాళ్లూరు, జులై 18,ప్రభాత వార్త



మండలం లోని మాధవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం సెక్రెటరీ మూల భాస్కర్ రెడ్డి సతీమణి నాగేశ్వరమ్మ (36) ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆమె భర్త, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు..ఆమె మృతదేహాన్ని సందర్శించి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళిర్పించారు. రాజకీయాలలో గుర్తింపు పొందిన కుటుంబానికి చెందిన నాగేశ్వరమ్మ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నివాళిర్పించిన వారిలో రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి ఐవి సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తాళ్లూరు,జూలై 18, ప్రభాతవార్త



ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ. ఎస్.మల్లికార్జున రావు సూచించారు. శనివారం స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు, సెల్ ఫోన్‌కు, మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, హెడ్ కానిస్టేబుల్ దాసు, తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర సాకారానికి కృషి చేయాలి

తాళ్లూరు, జులై 18,ప్రభాతవార్త



స్వర్ణాంధ్ర సాకారానికి విద్యార్థులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ పి. అజిత అన్నారు.స్థానిక వీకే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో శనివారం స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు,హౌసింగ్ ఏఈ హనుమంతరావు,ఎంఈవో సుబ్బయ్య,పంచాయతీ అభివృద్ధి అధికారి వెంకటాద్రి, స్వర్ణ కార్యాలయం సిబ్బంది మాధవి , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదూ పరిశీలించి పరిష్కారానికి చర్యలు

సింగరాయకొండ, జూలై 18, ప్రభాతవార్త



విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, మాజీ జిల్లా, సెషన్స్ జడ్జి ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ అధికారులను ఆదేశించారు. ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మూలగుంటపాడు గ్రామంలోని సాయి శ్రీనివాస కళ్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సింగరాయకొండ, పరిసర గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొత్త కనెక్షన్లు, తక్కువ వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, లైన్ మార్పులు, బిల్లింగ్ లోపాలపై ఫిర్యాదులు చేశారు. వాటిని పరిశీలించిన చైర్‌పర్సన్ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వినియోగదారులు సీజీఆర్ఎఫ్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేసే విధానం, వారి హక్కులు, విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు.అధికారులు ప్రతి పిర్యాదు నమోదు చేసి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఈ వీరయ్య, ఏడీఈ యుగంధర్, ఏఈ సాంబశివరావు, సభ్యులు కె. వెంకటేశ్వర్లు, సునీత, కె.కృష్ణనాయక్, కృష్ణ, విద్యుత్ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వెలిగండ్ల, జులై 18, ప్రభాతవార్త



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో రెడ్డిగారి గంగాధర్ అన్నారు. వెలిగండ్ల మండలంలోని మొగళ్లూరు గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని సైడు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, వీధులను శుభ్రం చేయించారు. గ్రామ ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛమైన వాతావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు రాంప్రసాద్, జనార్ధన్‌రాజు, స్వర్ణ గ్రామ పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ సిబ్బంది సమయపాలన పాటించాలి

వెలిగండ్ల, జులై 18, ప్రభాతవార్త



వెలిగండ్ల మండలంలోని వెలిగండ్ల, పందువ నాగులవరం స్వర్ణ గ్రామ పంచాయతీలను డీఎల్‌డీవో కళ్ళు శ్రీనివాసరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయాలలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుద్య నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్దిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని స్వర్ణ గ్రామ పంచాయతీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రెడ్డిగారి గంగాధర్, డిప్యూటీ ఎంపీడీవోలు రాంప్రసాద్, జనార్ధన్ రాజు, స్వర్ణ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నేడు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన

గుడ్లూరు, జులై 18, ప్రభాతవార్త



గుడ్లూరు మండలంలో చెమిడిదపాడు, పొట్లూరు గ్రామాల మధ్య రాళ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయబోతున్నారు. గుడ్లూరు, తెట్టు రోడ్డులో రాళ్ల వాగుపై మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి స్టేట్ హైవే ప్లాన్ గ్రాంట్ ద్వారా రెండు కోట్లు మంజూరయ్యాయి. 20 మీటర్ల పొడవునా రెండు ఖానాలతో ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తారు. గుడ్లూరు మండలం నరసాపురం దగ్గర నుంచి వచ్చే రాళ్లవాగు, చెమిడిదపాడు, పొట్లూరు గ్రామాల మధ్యగా గుడ్లూరు- తెట్టు రోడ్డును దాటి ఉలవపాడు మండలంలోకి ప్రవేశిస్తుంది. అయితే చిన్నపాటి వర్షానానికి కూడా కందుకూరు కావలి మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. అటవీ భూముల్లో నుంచి వచ్చే వరద నీరంతా కలవడం వల్ల , రాళ్లవాగు ఉధృతంగా మారుతోంది. ఏడాదిలో రెండు మూడు సార్లు కనీసం ఒక రోజంతా రాకపోకలు ఆగిపోతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. అనేక సంవత్సరాలుగా ఈ సమస్య ఉంది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు , రాళ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపగా, రెండు కోట్లు మంజూరయ్యాయి. రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని అనేక సార్లు కలిసి బ్రిడ్జి అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం ఏడాదిలోపు నిర్మాణాన్ని పూర్తి చేసి, బ్రిడ్జి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గుడ్లూరు- తెట్టు గ్రామాల మధ్య రవాణా సౌకర్యానికి ఆటంకాలు తొలగిపోనున్నాయి. అలాగే నియోజకవర్గ అభివృద్ధిలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

## 54 అడుగుల ఎత్తు విరాట్ ఆంజనేయస్వామి విగ్రహానికి రూ.60 వేలు విరాళం

గుడ్లూరు, జులై 18, ప్రభాతవార్త



ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ రామ భక్త భవిష్యత్ బ్రహ్మశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయం నిర్మాణంతో పాటు 54 అడుగుల ఎత్తు విరాట్ ఆంజనేయస్వామి వారి విగ్రహ నిర్మాణం కోసం 18 అడుగుకు ఒంగోలుకు చెందిన శ్రీ గోకనకొండ సుబ్బారావు, ధర్మపత్ని లక్ష్మీ రాజ్యం, శ్రీ దామా విశ్వేశ్వరరావు, ధర్మపత్ని సూర్యావతి ఒంగోలు, శ్రీ పమిడి రమాదేవి, దత్త సాయి వేణుగోపాల్, తర్ల సుహాన్ రామ్, టంగుటూరు, కీ.శే శ్రీ రామాంజనేయులు ధర్మపత్ని సరళ, విశాల్ చౌదరి, సాయి లిఖిత, ఒంగోలు శ్రీ శివరాం ప్రసాద్, ప్రభావతి అరవింద్ , ప్రత్యూష, మనుమడు, అభినవ్ తేజ్ మొత్తం ఒక్కొక్కరు రూ.12వేలు వంతున మొత్తం రూ.60వేలు ట్రస్టు అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావుకు అందజేశారు. అందుకు తగిన రసీదును హనుమంతరావు ఒంగోలులో లక్ష్మీ ఇంటి వద్ద దాతలు అందరికి అందజేయడం జరిగింది 18 అడుగు నిర్మాణం కోసం విరాళం అందించిన దాతలకు ఆ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్న పరివార దేవత సమేత శ్రీ సువర్చలా పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ట్రస్టు తరుపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

7:7.qxd 7/18/2026 11:11 PM Page 1



# మార్కాపురం వార్త



## శుభ్రత-పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన

### - వేములకోటలో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహణ



**మార్కాపురం, జూలై 18, ప్రభాతవార్త**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా బిన్ అండ్ బ్యాగ్ (బిన్ బ్యాగ్) విధానం అమలు, గృహ స్థాయిలో వ్యర్థాల వర్గీకరణ (సోర్స్ సిగ్రేగేషన్), బల్క్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛరథం ద్వారా డోర్ టు డోర్ చెత్త సేకరణ వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని వీధులను పరిశుభ్రం చేయించి, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ ఎ బాల చెన్నయ్య సూచించారు. అనంతరం గ్రామ ప్రజలు, విద్యార్థులు, స్వర్ణ గ్రామం సిబ్బందితో కలిసి శుభ్రతపై ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ పి సుజాత, ఎంపీడీవో ఎ బాల చెన్నయ్య, డిప్యూటీ ఎంపీడీవో (పంచాయతీరాజ్) స్వర్ణలత, డిప్యూటీ ఎంపీడీవో (స్వర్ణ గ్రామాలు) ఖాజా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## 1,178 మంది ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ విజయవంతం




**మార్కాపురం, జూలై 18, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మార్కాపురం, కనిగిరి డివిజన్ల పరిధిలో గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాల ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించగా, మార్కాపురంలోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాలలో నిర్వహించిన శిక్షణకు డీసీఈబీ కార్యదర్శి ఎం సుధాకర్ పర్యవేక్షణ వహించారు. గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలోని మండలాల నుంచి గణితం-287, సాంఘిక శాస్త్రం-214, భౌతిక శాస్త్రం-189, జీవశాస్త్రం-204 మంది కలిపి మొత్తం 894 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. కనిగిరి డివిజన్‌లోని జీహెచ్ఎస్ కనిగిరిలో నిర్వహించిన శిక్షణకు ఏసీఈ రాజాల కొండారెడ్డి కోర్స్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, గణితం-82, భౌతిక శాస్త్రం-62, జీవశాస్త్రం-65, సాంఘిక శాస్త్రం-75 మంది కలిపి 284 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీఈఆర్టీ కేటాయించిన కూపన్ కోడ్‌ల ఆధారంగా లీప్ యాప్‌లో ప్రీటెస్ట్, పోస్ట్‌టెస్ట్ నమోదు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అకడమిక్ క్యాలెండర్, క్లిక్కర్స్, సమ్మర్ వీడియోలు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, విలువల విద్య, క్లిష్ట భావనలు, పాఠ్యపుస్తక నవీకరణలు, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, నూతన బోధనా విధానాలు, దీక్ష, అసెస్‌మెంట్ బుక్‌లెట్లు, టీచర్ హ్యాండ్‌బుక్స్ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయ దృక్పథంతో బోధన నిర్వహించి విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మరింత మెరుగుపరుస్తారని జిల్లా విద్యాశాఖాధికారి సామా సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ మండ్ల రామాంజనేయులు, వేణుగోపాల్, బాలచందర్, ప్రదీప్, శ్రీనివాసులు, ఏఐ నిపుణుడు ఎంఎస్ రాజు, మణిరాజ్, ఆదినారాయణ, భోజా నాయక్, ఆంజనేయులు, జిల్లా దీక్ష కోఆర్డినేటర్ లలితతో పాటు జిల్లా రిసోర్స్ పర్సన్స్ వివిధ అంశాలపై సెషన్ల వారీగా శిక్షణ అందించారు. మార్కాపురం జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్స్, ఏకలవ్య తదితర యాజమాన్యాల పాఠశాలలకు చెందిన మొత్తం 1,178 మంది ఉపాధ్యాయులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాచర్ల కేజీబీవీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

### - పాఠశాల నిర్వహణలో పలు లోపాలు కనిపించడంతో తీవ్ర అసంతృప్తి



**రాచర్ల జూలై 18, ప్రభాతవార్త**

శనివారం ఆయన రాచర్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, విద్యార్థుల తరగతి గదులు, వంటగదులు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, పాఠశాల రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో పలు లోపాలు కనిపించడంతో సిబ్బందిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తుంటే మీ నిర్లక్ష్యం ఆశ్చర్యం కలిగిస్తోందని సిబ్బందిని ప్రశ్నించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానాల గదులను పరిశీలించిన ఎమ్మెల్యే వాటి నిర్వహణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని ఎప్పటికప్పుడు ఎందుకు శుభ్రం చేయించడం లేదని సిబ్బందిని నిలదీశారు. తరగతి గదుల్లో సరిపడా వెలుతురు లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే, అవసరమైన చోట అదనపు లైట్లు ఎందుకు ఏర్పాటు చేయించలేదని సిబ్బందిని అడిగారు. పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతులు చేయించి విద్యార్థినులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. పాఠశాల నిర్వహణ తీరు బాగోలేదని సిబ్బంది పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించిన ఉపాధ్యాయులు, విద్యార్థినుల హాజరును తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. విద్యార్థినుల సంక్షేమం, పాఠశాల పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల పార్టీ అధ్యక్షుడు కటికె యోగానంద్, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, నల్లబోతుల శ్రీను, సంజీవ్, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి : ఎంపిడిఓ వెంకటరామిరెడ్డి



**రాచర్ల, జూలై 18 ,ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రతకు అందరూ కలిసి సమిష్టిగా కృషిచేద్దామని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణ పరిసరాల్లో స్థానిక సిబ్బందితో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి గ్రామం స్వర్ణ గ్రామం కావాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని మనం ప్రభుత్వ సంకల్పాన్ని నిజం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి

### - ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు, జూలై 18, ప్రభాతవార్త**

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులఉ ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలోని పొట్టి శ్రీరాములు రోడ్డులో కీర్తి మెడికల్ స్టోర్ సమీపంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "బల్క్ వేస్ట్ జనరేటర్ల (బిడబ్ల్యూజిఎస్) గుర్తింపు, లెక్కింపు ప్రచార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి స్వయంగా రోడ్లు, పరిసర ప్రాంతాలు చీపురుతో ఊడ్చి శుభ్రంచేసి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛమైన, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. పెద్ద మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే సంస్థలు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు తదితర బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి, వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టడం ద్వారా పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని తెలిపారు. ప్రజలందరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వల్ల కానీ మరే ఇతర విషయాల వల్ల అంటు వ్యాధులు రాకుండా చూసుకోవాలి అని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పురపాలక అధికారులు మరియు స్థానిక వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరు మృతి



**నాగులుప్పలపాడు, జులై 18, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు టీ తాగేందుకు నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌కి వెళ్ళగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టడంతో దాంతో వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలు రిమ్స్‌కు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాయక్ తెలిపారు.

## తర్లుపాడు పోలీస్ స్టేషన్‌లో ఓఎస్డీ ఆకస్మిక తనిఖీ



**మార్కాపురం, జూలై 18, ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా ఓఎస్డీ నవజ్యోతి మిశ్రా శనివారం తర్లుపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, నైట్ పెట్రోలింగ్, బీట్ పోలీసింగ్ అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి సకాలంలో పరిష్కరించాలని, విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేసి గ్రామాల్లో బీట్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ఆయుధాల భద్రతలో నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావును సన్మానించిన రోటరీ క్లబ్ బృందం

**మార్టూరు, జులై 18, ప్రభాతవార్త**

రోటరీక్లబ్ మార్టూరు ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ జస్టిస్‌డే ను పురస్కరించుకుని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావుని సన్మానించారు. ఇంటర్నేషనల్ జస్టిస్ డే సందర్భంగా మన గ్రామన్యాయవాదిని సన్మానించుకోవడం గర్వకారణమని క్లబ్ అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కొర్రపాటి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాకూరు వెంకటేశ్వర్లు, కోశాధికారి గరిమిడి శ్రీనివాసరావు, జేవీ మోహన్‌రావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026కు శ్రీకారం

### - పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

**మార్కాపురం, జూలై 18, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమరావతిఛాంపియన్‌షిప్-2026కు శ్రీకారం చుడుతూ, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత శనివారం మార్కాపురం కలెక్టరేట్‌లో ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ క్రీడా పోటీల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునే గొప్ప అవకాశం లభిస్తుందని అన్నారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీ సమన్వయంతో నిర్వహించబడతాయని, ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన క్రీడాకారుల ఎంపిక చేపడతామని చెప్పారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించి ఉన్నత స్థాయిలో రాణించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## కార్యకర్తలకు, పార్టీకి వారధిగా జగన్ 2.0 సూపర్ యాప్



**కనిగిరి, జులై 18, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పార్టీ నాయకత్వంతో నేరుగా అనుసంధానిస్తూ సమాచార మార్పిడి, పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా రూపొందించిన జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్లను కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ శనివారం స్థానిక పార్టీకార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులందరూ గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన దద్దాల నారాయణ యాదవ్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై వేదింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం పెంపొందించి, ప్రభుత్వ చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగన్ 2.0 సూపర్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పార్టీకి సంబంధించిన అంశాలను నేరుగా పార్టీ నాయకత్వానికి చేరవేయవచ్చని చెప్పారు. అలాగే పార్టీ సమావేశాలు, మీడియా సమావేశాలు ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రకటనలు లైవ్ ఫీడ్ రూపంలో ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటాయని, గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు అందరిని అనుసంధానించే వేదికగా ఈ యాప్ పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, ఒకే రెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, పులి శాతి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, సిరుప గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, పల్నాటి భాస్కర్, మండాది కృష్ణారెడ్డి, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, శ్యామల సాంబిరెడ్డి, సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, కనమర్ల వెంకటేశ్వరరెడ్డి, మూలే యోగిరెడ్డి, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, సంగు కృష్ణారెడ్డి, మల్లెల వెలుగొండయ్య, షేక్ సన్నీ, ముద్దా బాబు, వీరం రెడ్డి సురేష్‌రెడ్డి, సూరసాని చిన్న కాశిరెడ్డి, సూరసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఒంటిపెంట శివకృష్ణారెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి, భూమిరెడ్డి రామచంద్రరెడ్డి, కన్నిటి సుబ్బారెడ్డి, తమ్మనేని వెంకటరెడ్డి, తమ్మనేని రమణారెడ్డి, చిలకల నారాయణరెడ్డి, తమటం దశరథరెడ్డి, వీరంరెడ్డి రవీంద్రారెడ్డి, పగడాల శివకృష్ణ, కత్తి అసోరా, ఎర్రబెల్లి సౌరీలు, ఎర్రబెల్లి ఆంథోని, ముద్దా పాల్, దేవర వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి వెంకటస్వామిరెడ్డి, వడ్డే రవి, కాసుల బాల గురవయ్య, యనమల గోవింద్‌రెడ్డి, చీమలదిన్నె రమేష్, దాసరి మాల్యాద్రి, సగటు మహేందర్‌రెడ్డి, కటుకూరి చిన్న పేరయ్య, యాబేజ్, జగదీష్, షేక్ అహ్మద్ భాషా, వెంకటరావు, అంబటి విజయ్, కత్తి చెన్నకేశవులు, చందా నర్సారెడ్డి, మల్లెల నాగేందర్‌రెడ్డి, షేక్ ఖాజా, రేగలగడ్డ రాయుడు, డబ్బుకొట్టు వెంకటేష్, వంగేపురం జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

## అఖండ సాయినామ సప్తాహానికి దద్దాల నారాయణ యాదవ్‌కు ఆహ్వానం



**కనిగిరి, జులై 18, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను శనివారంసాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి అఖండ సాయినామ సప్తాహం, గురు పౌర్ణమి మహోత్సవాలకు ఆహ్వానించారు. జులై 21 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న అఖండ సాయినామ సప్తాహం, జులై 29న జరిగే గురు పౌర్ణమి మహోత్సవంలో పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం తరుపున దద్దాల నారాయణ యాదవ్‌ను స్వామివారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు కొప్పరపు సత్యనారాయణ, ట్రెజరర్ ముచ్చర్ల ధర్మారావు, జాయింట్ సెక్రటరీ వాగిచర్ల వెంకటేశ్వర్లు, విజయ మార్తాండేశ్వరస్వామిదేవస్థానం మాజీ చైర్మన్ గోంట్ల మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరిలో నేత్రజ్యోతి.. 265 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



**కనిగిరి, జులై 18, ప్రభాతవార్త**

కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో జన చారిటబుల్ ట్రస్టు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 541 మంది లబ్దిదారులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గత శిబిరంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 150 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈసారి శిబిరానికి హాజరైన 391 మందిలో 265 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని జులై 22,24,26,28వ తేదీల్లో నాలుగు విడతలుగా శంకర్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇటువంటి శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్యులు, నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి కార్యకర్త జగన్ 2.0 సూపర్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి



**యర్రగొండపాలెం, జులై 18, ప్రభాతవార్త**

జిల్లాలో జరిగిన డీఆర్సీ సమావేశంలో ఉమ్మడి జిల్లాల తరుపున ప్రతిపక్షంగా ఒక్క ఎమ్మెల్యే అయిన నేను పాల్గొని నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను లేవనెత్తి నినదిస్తే ఆ రెండు పచ్చ పత్రికలు ఒక ముక్క రాయడానికి చేతులాడలేదంటూ దుమ్మెత్తి పోసిన యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన ఈ యాప్‌ను పార్టీ శ్రేణులు విస్తృతంగా వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు జగన్ 2.0 సూపర్ యాప్ వినియోగంపై ఎమ్మెల్యే ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, అధికారిక సమాచారం, కార్యకర్తల అనుసంధానానికి ఈ యాప్ సమర్థవంతమైన డిజిటల్ వేదికగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ యాప్‌ను చెత్త చెదారంతో నింపకుండగా పూర్తి అవగాహనతో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన నమోదు కార్యక్రమంలో పార్టీ బీఎల్ఓలో సమర్ధవంతంగా పని చేశారని అభినందించారు. అయితే ఇంకా సర్ పని పూర్తి కాలేదని వివరాల సేకరణ, పరిశీలన, సమర్పణ విధానంపై బీఎల్ఏలు, బూత్ కన్వీనర్లు సమగ్ర అవగాహనతో పనిచేసి వందశాతానికి ముగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల, పట్టణ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, కందూరి కాశీవిశ్వనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు ఒంగోలు మూర్తిరెడ్డి, త్రిపురాంతకం మండల పరిషత్ అధ్యక్షులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ బాయ్, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి సూరే రమేష్, ఆర్యవైశ్య మండల నాయకులు సుబ్బారావు, వివిధ మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బీఎల్ఏలు, బూత్ కన్వీనర్లు, పార్టీ మహిళ శ్రేణులు పాల్గొన్నారు.

## లాటరీ వచ్చిందని ఫోన్ లేదా మెసేజ్ వస్తే నమ్మొద్దు

### - కొంచెం నమ్మితే పూర్తిగా ముంచేస్తారు
### - అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక
### - అవగాహనే మీకు రక్ష.. ప్రజలను చైతన్యం చేస్తున్న పోలీసు శాఖ




**పెద్దదోర్నాల,జులై 18, ప్రభాతవార్త**

మీకు ఎక్కువ మొత్తంలో లాటరీ వచ్చింది. మీరు భారి నగదు గెలుచుకున్నారు అంటూ ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, వాట్సప్ సందేశాలు వస్తే వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచిస్తున్నారు. ఇలాంటి మోసపూరిత సందేశాలను నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం లేదా ఓటీపీలు వెల్లడిస్తే క్షణాల్లోనే ఖాతాలోని నగదు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు లాటరీ, గిఫ్ట్, రివార్డు పాయింట్లు విదేశీ పార్శిలు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో అమాయకులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు. మొదట చిన్న మొత్తాన్ని ప్రాసెసింగ్ ఫీజు టాక్స్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు పేరుతో చెల్లించాలని చెప్పి, అనంతరం మరింత డబ్బు వసూళ్లు చేసి బాధితులను భారీగా మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు అపరిచితుల నుండి వచ్చే కాల్స్, మెసేజ్‌లను లింకులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, లాటరీలు బహుమతుల పేరుతో వచ్చే సందేశాలను వెంటనే తొలగించాలని సూచించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలను, ఏటీఎం కార్డు వివరాలు ఓటీపీలు, యూపీఐ పిన్ వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వొద్దని హెచ్చరించారు. సైబర్ నేరాల భారిన పడిన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ కు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్ క్రైమ్.జీవోవీ.ఇన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని పోలీసులు సూచించారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తూ అవగాహనే రక్ష అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

## గంటవానిపల్లెలో వింత ఘటన

### - దర్గాలో రాత్రికి రాత్రే ప్రత్యక్షమైన పీరు - భక్తుల ప్రత్యేక పూజలు



**పెద్దదోర్నాల, జులై 18, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామంలో ఉన్న మస్తాన్ దర్గాలో రాత్రికి రాత్రే ఒక పీరు ప్రత్యక్షమైన ఘటన శనివారం వెలుగు చూసింది. పీరు ప్రత్యక్షమైందనే వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం గతంలో లేని చోట ఒక్క సారిగా పీరు కనిపించడంతో దీనిని దైవమహిమగా భావిస్తున్న భక్తులు అగరబత్తీలు వెలిగించి, చాదర్లు సమర్పిస్తూ మొక్కుకుంటూ ప్రార్థనలు చేస్తున్నారు. ఈ వింత ఘటన గురించి పరిసర గ్రామాలకు కూడా సమాచారం చేరడంతో భక్తుల రాక పెరిగింది. అయితే ఈ ఘటన అధికారికంగా ఎలాంటి శాస్త్రీయ నిర్ధారణ వెలువడలేదు. పీరు ఎలా ప్రత్యక్షమైందనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కొందరు దీనిని అద్భుత ఘటనగా విశ్వసిస్తుండగా మరికొందరు ఎవరో ఇక్కడ రాత్రి వేళలో పెట్టి వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నారు. మరికొందరు పూర్తి వివరాలు తెలుసుకోవాలని భావిస్తున్నారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించిన రెవెన్యూ సిబ్బంది

**యర్రగొండపాలెం, జులై 18, ప్రభాతవార్త**

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడవ శనివారం నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని యర్రగొండపాలుం మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్‌తో కలిసి సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని చెత్తా చెదారాన్ని తొలగించి అక్కడి పరిసరాలను శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. అక్కడి చిల్లచెట్లను, ఆవరణలో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించి మంటలు వేసి కాల్చారు. ఆవరణ మొదలులో ఉండే ప్రధాన గేటుకు ఇక్కడ వాహనాలను నిలపరాదని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయభాస్కర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు. ప్రజల సహకారంతోనే స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను విజయవంతంగా సాధించవచ్చని తెలిపారు. స్వచ్ఛమైన గ్రామం- ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంగా ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్‌తో పాటు ఎన్నికల డీటీ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ షేక్ సర్దార్, సర్వర్ రహిమాన్, వీఆర్వోలు, షేక్ నాసర్‌వలి, రాంబాబు,ప్రసాద్,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ong-8_ong-8.qxd 7/18/2026 11:45 PM Page 1



## విద్యార్థులను పరామర్శించిన అధికారులు, ఉపాధ్యాయ బృందం

**సంతనూతలపాడు, జులై 18, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం మద్దులూరు సమీపంలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు ప్రమాద సంఘటనకు సంబంధించి మద్దులూరు హైస్కూల్‌కు వచ్చే విద్యార్థులను వారి స్వగ్రామమైన అనకర్లపూడి గ్రామంలో ఎంఈఓ, ఎన్‌వీఎస్ కుమార్, మద్దులూరు, చిలకపాడు, హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు బిపి శ్రీనివాసరావు, పి.స్వప్నరాజు తదితరులు పరామర్శించారు. అనకర్లపూడి గ్రామం నుండి మద్దులూరు హైస్కూల్‌కు 10 మంది విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు వస్తుంటారు. ఇందులో భాగంగా ఆయా విద్యార్థులు శనివారం ఉదయం తమ స్వగ్రామమైన అనకర్లపూడి గ్రామం నుండి ఈ ఆర్టీసీ బస్సు ఎక్కి మద్దులూరు కేంద్రంలో పాఠశాలకు వస్తున్నారు. ఇంతలో మద్దులూరు సమీపంలో ఈ ఆర్టీసీబస్సు ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి రోడ్డు పక్కన మార్జిన్లో బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 14 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఇందులో భాగంగా మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అనకర్లపూడి గ్రామంనకు వెళ్లి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. విద్యార్థులు సురక్షితంగా ఊపిరి పీల్చుకున్నారు.

## శ్రీ ప్రతిభ కళాశాలలో ఘనంగా 44వ వార్షిక ఫ్రెషర్స్‌డే వేడుకలు

**సంతనూతలపాడు, జులై 18, ప్రభాతవార్త**







సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలోని శ్రీ ప్రతిభ జూనియర్ కళాశాల శ్రీ గురుదత్త హైస్కూల్ ఆధ్వర్యంలో శ్రీ ప్రతిభ గ్రూప్స్ 44వ వార్షిక ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి శ్రీ ప్రతిభ విద్య సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాష్‌నారాయణలు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, క్రీడా స్ఫూర్తి, వ్యక్తిత్వ వికాసం విద్యార్థుల విజయానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో సంస్థల అధ్యాపక బృందంతో కలిసి 2100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా 2026 ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ పోటీలలో విజేతలకు నిలిచిన విద్యార్సులకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలతో సందడి చేస్తూ ఆనందోత్సాహాల మధ్య ఫ్రెషర్స్‌డే వేడుకలను జరుపుకున్నారు. కొత్త విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కూరగాయల సాగుపై రైతులకు శిక్షణ

**కొరిసపాడు, జులై 18, ప్రభాతవార్త :**



మండలంలోని పి.గుడిపాడు గ్రామంలో కూరగాయల సాగుపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఉద్యానవన శాఖ అధికారి ఎస్.దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. కూరగాయల పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం, తదితర అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వై.ఎం.ఎన్.వి.ఎస్ గోపిచంద్, దర్శి ఉద్యాన పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త ఎం. ఠాగుర్ నాయక్‌లు పాల్గొని రైతులు కూరగాయ ల సాగులో అనుసరించాల్సిన మెరుగైన సాగు విధానాలను వివరించారు. ముఖ్యంగా పిఎండిఎస్, మల్చింగ్, ఫార్మపాండ్స్, ఏర్పాటు, కరువు తట్టుకునే రకాలను, సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఉద్యాన అధికారి ఎస్. దీప్తి, ఉద్యానవన విస్తరణ అధికారి ఎ. స్వర్ణలత, పి.గుడిపాడు, గ్రామ ఉద్యానవన సహాయకుడు కె. రవికిరణ్ పాల్గొన్నారు.

## జగన్ 2.0 సూపర్ యాప్‌తో ప్రతి కార్యకర్తకు పార్టీ అండ

**- డాక్టర్ చింతలపూడి**

**అద్దంకి, జులై 18, ప్రభాతవార్త :**



అద్దంకి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధికారిక జగన్ 2.0 సూపర్ యాప్‌ను అద్దంకి సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతల పూడి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగిందని ఆవిష్కరించిన గంటల వ్యవధిలోనే రెండు లక్షలు పైగా డౌన్లోడ్ అయ్యాయని అన్నారు. అద్దంకి నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మీడియా పరంగా ప్రతిపక్షాన్ని ఏ విధంగా అనిచివేస్తున్నారు అందరూ చూస్తున్నారన్నారు. సోషల్ మీడియా ప్లాట్ఫారం ద్వారా మనమేదైతే పోస్ట్ చేస్తున్నామో వాటిని డిలీట్ చేయడం లేదా వాటి ద్వారా కేసులు పెట్టడం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ యాప్ ద్వారా మీకు జరుగుతున్నటువంటి నష్టాన్ని మీపై జరుగుతున్నటువంటి దాడులను పోస్ట్ చేయాలని ఈ యాప్ మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ప్రత్యక్షంగా పార్టీ పెద్దలు పర్యవేక్షిస్తారని, అధినేత జగన్మోహన్ రెడ్డి మానిటరింగ్ చేస్తాడని అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు జరుగుతున్న అన్యాయాలను అణిచివేతను యాప్ ద్వారా తెలియపరచాలని కోరారు. మీ అందరికీ అండగా నాలాంటి 175 మంది సిద్ధంగా ఉన్నారని అన్నారు. ముఖ్యంగా అద్దంకి నియోజకవర్గం లోని అందరూ 50 వేల నుంచి 70వేల వరకు యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని అద్దంకిని అగ్రగామిగా నిలిచే విధంగా చూడాలని పిలుపునిచ్చారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి:సిఐ

**కొరిసపాడు, జులై 18, ప్రభాతవార్త :**




మానవజాతిని నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాలకు ముఖ్యంగా యువత,విద్యార్థులుదూరంగా ఉండాలని అద్దంకి సీఐ మల్లికార్జున రావు పిలుపునిచ్చారు. శనివారం మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్స్ హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై ఆయన అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. ఆర్నాల్డ్స్ హై స్కూల్ నుంచి ర్యాలీగా బయలుదేరి మేదరమెట్ల ప్రధాన రహదారులలో డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నివారణకై ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సెయింట్ ఆర్నాల్డ్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ థామస్ రెడ్డి,మేదరమెట్ల ఎస్సై జి రమేష్ బాబు తోపాటు మేదరమెట్ల కొరిసపాడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధమే హత్యకు కారణం: సిఐ శేషగిరిరావు

**సంతమాగులూరు, జులై 18, ప్రభాతవార్త**




మండలంలోని పాతమాగులూరులో జరిగిన హత్య కేసులో నిందితుడు విష్ణువర్ధన్ ను శనివారం అరెస్టు చేసినట్లు సంతమాగులూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో పాత మాగులూరు హత్యకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. పాతమాగులూరు గ్రామానికి చెందిన సజ్జల పిచ్చిరెడ్డికి ముద్దాయి తల్లి వెంకటేశ్వరమ్మతో గత నాలుగు సంవత్సరాలుగా అక్రమ సంబంధం కలిగి ఉన్నాడన్నారు. ఈ విషయమై ముద్దాయి విష్ణువర్ధన్ తన తల్లి వెంకటేశ్వరమ్మను, మృతుడు పిచ్చిరెడ్డిని అనేకసార్లు మందలించడమే కాకుండా మృతుడు పిచ్చిరెడ్డితో రెండుసార్లు గొడవ కూడా పెట్టుకున్నాడు. గత గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతుడు పిచ్చిరెడ్డి వెంకటేశ్వరమ్మ ఇంటికి వెళ్లాడు. సూళ్లూరుపేట లో ఉంటున్న నిందితుడు విష్ణువర్ధన్ గురువారం తెల్లవారుజామున పాత మాగులూరులోని తన ఇంటికి చేరుకున్నాడు. ఇంటిలో తనతల్లితో మృతుడు పిచ్చిరెడ్డి కలసి ఉండటం చూశాడు. ఎంత చెప్పినా కూడా వినలేదని ఆవేశంతో రెచ్చిపోయి అక్కడే వున్న బండ రాయిని తీసుకొని మృతుని నుదుటిపై విశక్షణారహితంగా కొట్టాడు. ప్రాణభయంతో మృతుడు పారిపోతుండగా వెంటపడి పాత మాగులూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రామాంజనేయ సెల్ షాప్ వద్ద పట్టుకొని అక్కడ ఉన్న ఇటుక రాయితో తలఎడమవైపు బాధదంతో అక్కడికక్కడే పిచ్చిరెడ్డి మృతి చెందాడు. వెంటనే ముద్దాయి విష్ణువర్ధన్ అక్కడ నుంచి తప్పించుకుని పారిపోయాడు. అప్పటినుండి ముద్దాయి విష్ణువర్ధన్ కోసం స్థానిక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 18 శనివారం ఉదయం మండలంలోని పుట్టావారిపాలెం అద్దరోడ్డు కూడలి సమీపంలో లోని గంగమ్మ గుడి ఎదురుగా ముద్దాయి విష్ణువర్ధన్ ఉన్నాడన్న విషయం తెలుసుకొన్న పోలీసులు వున్న ప్రదేశానికి వెళ్లి అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. ముద్దాయిని అద్దంకి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు సిఐ శేషగిరిరావు తెలిపారు.

## ప్రజా భాగస్వామ్యంతోనే ఆరోగ్యమైన సమాజం సాధ్యం: గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, జులై 18, ప్రభాతవార్త**



దర్శి మండలం తూర్పు చౌటపాలెం గ్రామంలో శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామితో కలిసి దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్య క్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా దాదాపు 50 లక్షలతో ఐదు ట్రాక్టర్లు, 25 చెత్త వాహనాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆస్తులు, విద్యతో పాటు ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆరోగ్యమైన సమాజం కోసం పర్యావరణ పరిరక్షణ పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛమైన తాగునీరు వీటి ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మనం చెత్త తొలగింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. పొడి చెత్త, తడి చెత్త వ్యర్థాలను వేర్వేరుగా పంపించాలన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం పాటుపడదాం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిదామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పిలుపునిచ్చారు. గ్రామంలో రోడ్లు, డ్రైన్లు వాటర్ ట్యాంకు వంటి మౌలిక సదుపాయలు చేపట్టలిగామని, అదే స్ఫూర్తితో మిగిలి ఉన్న పెండింగ్ సమస్యలను కూడా త్వరలో పరిష్కరించుకుందామని అన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ, పెన్షన్లు పంపిణీకి ప్రాధాన్యతనే ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు.మంత్రి స్వామి సహకారంతో దర్శి నియోజకవర్గంలో దాదాపు పది కోట్లతో కేంద్రీయ విద్యాలయాల అభివృద్ధి, సంక్షేమ హాస్టల్లో అభివృద్ధి సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సుస్థిర పాలన కోసం కూటమి ప్రభుత్వాన్ని ఆరిద్దాం. అభిమానిద్దాం ప్రజలందరూ ప్రజా ప్రభుత్వాన్ని దీవించాలని లక్ష్మీ కోరారు.

## చెత్త నుండి కూడా సంపద సృష్టించగలుగుతున్నాం:మంత్రి డోలా

**దర్శి, జులై 18, ప్రభాతవార్త**



దర్శి మండలం, తూర్పు చౌటపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర, - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగాస్వామి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమాన్ని కూడా మన కూటమి ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆరోగ్యమైన సమాజం కోసం మంచి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి నెల మూడో వారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు. చెత్తలో ఉన్న ప్లాస్టిక్‌ను సపరేట్ చేయడం విలువైన చెత్త ద్వారా తిరిగి ఆదాయంగా ప్రజలకు సరుకులు అందించడం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర రథం గ్రామ గ్రామం తిరగడం ఇలా చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామన్నారు. ఆరోగ్యమైన సమాజం కోసం ప్రజలందరూ చైతన్యంతో చుట్టూ పరిసరాలను బాగు చేయించుకుని మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు.

అంగన్‌వాడీలు ఆకస్మిక తనిఖీః తూర్పు చౌటపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి స్వామి, టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీలో అందుతున్న సౌకర్యాలను వసతులను పరిశీలించారు.పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులతో ముచ్చటించారు. వాంతులు, విరేచనాలు, జ్వరాలు రాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు శుభ్రమైన ఆహారం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారం తదితర విషయాలను ఆరా తీశారు. అంగన్‌వాడీల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఎంఈఓ-1,2 మాల కొండయ్య, రమాదేవి, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టౌన్ టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మోడీ ఆంజనేయులు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, పుల్లలచెరువు సత్యనారాయణ, తూర్పు చౌటపాలెం టీడీపీ నాయకులు నీటి సంఘం డీసీ అధ్యక్షులు కామినేని వెలుగొండారెడ్డి, మాజీ సర్పంచ్ మారం శ్రీనివాసరెడ్డి,డీలర్ రామిరెడ్డి,మారం రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ మారం సుబ్బారెడ్డి, పాపసాని ఆదిరెడ్డి, నాగిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బండి దేవప్రసాద్, వందనం తిరుపాలు పాల్గొన్నారు.

## ప్రాణాలు వొడ్డయినా గంగమ్మ ఆలయాన్ని పరిరక్షించుకుంటాం.. యువ మోర్చా నేత శ్రీరామ్

**బల్లికురవ జులై 18( ప్రభాతవార్త)**



ప్రాణాలు ఫణంగా పెట్టి ఈర్ల గంగమ్మ దేవాలయాన్ని పరిరక్షించుకుంటామని భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుముదామి శ్రీరామ్ అన్నారు. శనివారం భారతీయ జనతా పార్టీ యువ మోర్చా బృందం స్థానిక ఈర్ల గంగమ్మ దేవాలయాన్ని సందర్శించింది. గంగమ్మ ఆలయం తలపైన స్థానిక ఎస్సార్ గ్రానైట్ ఇష్టం వచ్చినట్లుగా తవ్వకాలు జరుపుతూ, గంగమ్మ సిగ భాగాన్ని డంపింగ్ యార్డ్ గా మార్చటం పట్ల భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ భారతీయ జనతా పార్టీకి ఫిర్యాదులు చేశారు. ఆలయ పరిరక్షణలో భాగంగా శ్రీరామ్ ఆధ్వర్యంలోని యువ బిజెపి బృందం ఆలయాన్ని సందర్శించింది. సనాతన సంప్రదాయాలను, దేవాలయాలను, దేవాలయ భూములను కాపాడటమే భారతీయ జనతా పార్టీ ప్రధాన కర్తవ్యం అన్నారు . భక్తుల మనోభావాలతో ఇక్కడ ఎస్సార్ క్వారీ యాజమాన్యం ఆటలాడుతుందని, అదేమని భక్తులు ప్రశ్నిస్తే ఇక్కడ ఆలయం ఉండటమే తమ బిక్ష అన్నట్లు మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయం ఎగువున ఉన్న డంపింగ్ భారీ వర్షాలు కురిస్తే కేరళలో వాయినాడ్ వరదల మాదిరిగా ఆలయం పై విరుచుకుపడే ప్రమాదం ఉందన్నారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆలయాన్ని తమ బిక్షగా పేర్కొనడం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమేనన్నారు.ఆలయం ఎగువ భాగాన గ్రానైట్ గని పనులు నిలిపివేయాలని, అలా చేయని పక్షంలో భక్తుల మనోభావాలకు పెద్దపీట వేస్తూ మండలంలోని గ్రామాలలో తిరుగుతూ, భక్తుల చైతన్యంతో ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్, దేవాదాయ శాఖ మంత్రి రామ్ నారాయణ రెడ్డికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి గ్రానైట్ మాఫియా దేవాలయానికి చేస్తున్న నష్టాలను ఉదహరిస్తూ, గ్రానైట్ లీజు రద్దు చేయాలని కోరుతామన్నారు. త్వరలో గంగమ్మ తల్లి ఆలయ పరిరక్షణకై ఉద్యమించే కమిటీని ఖరారు చేస్తామన్నారు. ఈ బృందంలో యువమోర్చా నేతలు బాబు ,వెంకట్రావు, నరేంద్ర, సుబ్బారావు, సుభాని, అమ్మవారి భక్తులు ఉన్నారు.

## కోరం లేక మండల సమావేశం వాయిదా

**బల్లికురవ జులై 18( ప్రభాతవార్త)**



స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. 11 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి మండలంలోని అధికార యంత్రంగా మొత్తం పూర్తిస్థాయిలో హాజరయ్యారు. ఎంపిపి బడుగు శ్రీలక్ష్మి, తాసిల్దార్ రవి నాయక్ ,ఎంపీడీవో కుసుమకుమారి, జడ్పిటిసి అంజలి, సిడిపిఓ సుధా, అంజనాదేవి, విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ, ఏవో శ్రీనివాసరావు, వివిధ గ్రామ పంచాయతీల డెవలప్మెంట్ అధికారులు హాజరయ్యారు. ఎంపీటీసీ సభ్యులలో ఎంపిపి బడుగు శ్రీలక్ష్మి ఉప్పుమాగులూరు ఎంపీటీసీ వంటరి మరియమ్మ మాత్రమే హాజరు కావటం, కో రం లేకపోవడంతో ఎంపిపి ఆదేశాలతో ఎంపీడీవో కుసుమకుమారి సర్వసభ్య సమావేశాన్ని మధ్యాహ్నం ఒంటిగంటకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## సీఐ ఎల్.వీరా నాయక్‌ను కలిసిన బివి సాగర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగర టూ టౌన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎల్.వీరా నాయక్‌ను శనివారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి వి సాగర్ మర్యాదపూర్వక కలిశారు. గ్రో స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ ఎస్‌కె పీర్‌బాషా గతమూడు దశాబ్దాలపైగా ఒంగోలు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా నిర్మూలన కొరకు, బాల్యవివాహాలు, బాలలపై జరిగే లైంగిక వేధింపుల నిర్మూలన కొరకు, బాలల హక్కుల పరిరక్షణ కొరకు, నిరాశ్రయులైన మహిళలు, బాలలకు రక్షణ సంరక్షణ కుకలిగించడంలో ప్రభుత్వం సంస్థలతో సమన్వయంతో అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.విసాగర్ గ్రో స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాంమేనేజర్ ఎస్‌కె పీర్ భాష సీఐ వీరనాయక్ వివరించారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన నలుగురు విద్యార్థులు

**ముండ్లమూరు, జులై 18, ప్రభాతవార్త**





ముండ్లమూరు ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదివిన నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. పి.591, కే.లక్ష్మీ ప్రసన్న 591, సీహెచ్ 576, పి.చంద్రానాయక్ 508 మార్కులు సాధించి షైనింగ్ స్టార్స్‌కు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయులు కే.పూర్ణచంద్రరరావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## స్వర్ణాంధ్ర స్వచాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో కె. స్వరూపరాణి

**జె. పంగులూరు, జులై 18, ప్రభాతవార్త**



మండలంలోని కోటపాడు గ్రామంలో ఎంపీడీవో కె.స్వరూప రాణి ఆధ్వర్యంలో మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎన్యూమరేషన్ ఆఫ్ బల్క్ వేస్ట్ జెనరేటర్స్ థీమ్ సాస కార్యక్రమములో భాగముగా జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో విద్యార్థిని, విధ్యార్థులు మరియు గ్రామ ప్రజలచే మానవహారం నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించడం జరిగింది. గ్రామ పంచాయతీ పరిధిలోని జరుగుతున్న క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపీడీవో కె. స్వరూప రాణి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో భారీ మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసేవారు గుర్తింపు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమములో తహశీల్దార్ పి. సింగారావు, డిప్యూటీ యం.పి.డి.ఓ కే సుమంత్, డిప్యూటీ యం.పి.డి.ఓ కె. సంతోషం, ఎస్ జి ఎస్ డబ్ల్యూ శ్రీ శ్రీనివాసుల రెడ్డి, ఏపీఎం సిహెచ్ కోటేశ్వరరావు, హెచ్‌ఎం వడ్లమూడి శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది, గ్రామ నాయకలు, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది మరియు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## "మన డబ్బులు మన లెక్కలు" గురించి విస్తృత అవగాహన ర్యాలీలు

**జె. పంగులూరు, జులై 18, ప్రభాతవార్త**




రేపటి మీ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు పొదుపు చేసి వారి ఉన్నతికి దోహదపడేలా ప్రతి ఒక్క సభ్యరాలు ముందుచూపు ఆలోచన ఉండాలని ఏపీఎం సి.హెచ్. కోటేశ్వరరావు అన్నారు. మండలం లోని అన్ని గ్రామ సంఘాలలో మన డబ్బులుమన లెక్కలు గురించి ఏపిఎం సిహెచ్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అందులో భాగంగానే వెలుగుకార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ఎం.డి.ఎం.ఎల్ గురించి నినాదాలు చేస్తూ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఎం.డి.ఎం.ఎల్ గురించి ఏపీఎం సిహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంఘ సభ్యురాలు సూపర్ నారీ యాప్ డౌన్లోడ్ చేసుకుని సంఘంలోని పొదుపు, లోన్ వివరాలు వివరంగా తెలుసుకోవాలన్నారు. ఈరోజు నుండి జూలై 31 వరకు అన్ని సంఘాలలో ఎం.డి.ఎం.ఎల్, సూపర్ నారీ యాప్ డౌన్లోడ్ చేయించాలని ఈ నారి, వివోయేలకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఏపీఎం సిహెచ్ కోటేశ్వరరావు, సీసీలు సిహెచ్. సాల్మన్, జి సురేష్, ఎం. చంద్రశేఖర్, వివోయేలు, ఈ నారీలు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫారం మార్చకుండా విద్యుత్ అధికారుల కాలయాపన

**వేటపాలెం, జులై 18, ప్రభాతవార్త**



వేటపాలెం మండలంలోని దేశాయిపేట పంచాయతీ పరిధిలో ఎస్ ఎస్ 9 ట్రాన్స్ఫారం పాడైపోయి ఇప్పటికీ సంవత్సరం గడిచిన దానిని రిపేరు చేయకుండా లేదా కొత్త ట్రాన్స్ఫారం వేయకుండా విద్యుత్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఈ ట్రాన్స్ఫారం మీద ఉన్నటువంటి లోడ్ ను పక్క ట్రాన్స్ఫార్మాల మీదకి మరలించి కాలం గడుపుతున్నారు. ఈ కారణంగా ట్రాన్స్ఫారం పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరికీ ఇది ఒక పెద్ద సమస్యగా తయారయింది. విద్యుత్ అప్ అండ్ డౌన్స్ తో ఎలక్ట్రికల్ పరికరాలన్నీ (టి వి/ఫ్యాన్/మోటార్ /ఏసీ) పాడైపోవడంతో వేలకు వేలు ఖర్చు అవుతుందని వినియోగ దారులు వాపోతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను ఎన్ని సార్లు సంప్రదించినా ట్రాన్స్ఫర్మర్ మాత్రం మార్చడం లేదని, ఇది ఇలానే కొనసాగితే ఈ విషయాన్ని పై అధికారుల సమక్షానికి తీసుకు వెళ్ళవలసి వస్తుందని ట్రాన్స్ఫారం పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తెలియజేశారు. ఈ సమస్యను సత్వరమై పరిష్కరించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

## పల్లె నిద్రలో,స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ప్రాధాన్యత

**వలేటివారిపాలెం,జులై18, ప్రభాతవార్త**



వలేటివారిపాలెం మండలం సమీరపాలెం గ్రామంలో పల్లెనిద్ర నిర్వహించి స్వర్ణ గ్రామ సచివాలయంలో బసచేసిన కలెక్టర్ రాజాబాబు శనివారం ఉదయం కూడా ప్రజల నుంచి అర్జీలు తీసుకుని గ్రామంలో పర్యటించారు. పల్లెనిద్రలో గ్రామస్తులు ప్రస్తావించిన పలు అభివృద్ధి సంబంధిత సమస్యలను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ డి. హిమవంశీతో కలిసి పరిశీలించారు. ఎస్సీ కాలనీలో గ్రామసభ నిర్వహించి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ప్రాధాన్యాన్ని వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్తులు ప్రస్తావించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టామన్నారు. ముఖ్యంగా చుక్కల భూముల సమస్యను 30 రోజుల్లోగా పరిష్కరిస్తానని చెప్పారు. ఆ తరువాత మరోసారి ఈ గ్రామాన్ని సందర్శిస్తానని ప్రకటించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ కాలనీ నుంచి సచివాలయానికి వెళ్లేందుకు స్థానిక పంట కాలువ మీద కల్వర్టు కూడా నిర్మిస్తామని చెప్పారు. గ్రామంలోని ప్రధాన వాగు వెంట రైతులకు ఉపయోగపడేలా రోడ్డు నిర్మిస్తామన్నారు. ఎస్సీ కాలనీ ప్రజలు వెళ్లేందుకు స్మశానానికి దారి కల్పిస్తామన్నారు. ఎస్.టీ. కాలనీలో కూడా డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే బావిని సందర్శించి మంచినీటి నాణ్యత పై కలెక్టర్ ఆరా తీశారు. కాగా, ఆయన సమక్షంలో ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది మంచినీటి పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మంచినీటిలో మెండుగా పోషకాలు ఉన్నాయని, ఈ నీటినే తాగాలని ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. గ్రామంలో వీ.బీ.జీ. రామ్ జీ పథకం కింద చేపడుతున్న పనులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ముర్రా బ్రీడ్‌తో స్థానికంగా జన్మించిన గేదెలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడి మరింత పాల దిగుబడి కోసం దాణా అందించారు. రంగురంగుల కాగితాలతో తయారుచేసిన పూల బొకేలను చేత పట్టుకుని తాను బసచేసిన సచివాలయం వద్దకు వచ్చిన అంగన్వాడి చిన్నారులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆప్యాయంగా వారిని పైకెత్తుకున్నారు. వయసుకు తగినట్లుగా పిల్లలు బరువు ఉండాలని, అవసరమైన పోషకాహారం సమృద్ధిగా అందించాలని ఐసిడిఎస్ పి.డి. పద్మ సునందకు దిశా నిర్దేశం చేశారు. గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల స్వచ్ఛత వలన ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెటూరులో కూడా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారంటే ప్లాస్టిక్ వినియోగమే దీనికి ప్రధాన కారణం అన్నారు. ఈ పర్యటనలో వెంట డిపిఓ అనుపమ, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డ్వామా పి.డి. జోసఫ్ కుమార్, డిఆర్డిఏ పి.డి. నారాయణ, పశు సంవర్ధక శాఖ జె.డి. వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఈ. అశోక్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి సేవలో ఎమ్మెల్యే ఇంటూరి

**వలేటివారిపాలెం. జులై 18. ప్రభాతవార్త**



మండలపరిధిలోనిఅయ్యవారిపల్లి పంచాయతీ ప్రముఖ పుణ్యక్షేత్రం మాలకొండపై వెలసిన యున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారి సేవలో శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు అర్చకులు గౌరీ.లక్ష్మీ నరసింహ స్వామి. ప్రత్యేకపూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలకొండపై అందుతున్న సౌకర్యాల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా భక్తులందరికీ అన్నదానం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో శ్రీనివాసరెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, లింగసముద్రం మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, కాకుమాని హర్ష, పెగడ మోహన్, కామినేని అశోక్, పరిటాల శివ, వేమూరు రాజా, నాయకులు తదితరులు ఉన్నారు.

## మాలకొండ ఆదాయం రూ.9,68,460

**వలేటివారిపాలెం, జులై 18, ప్రభాతవార్త**



మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రంమాలకొండ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కి శనివారం భక్తుల ద్వారా రూ. 9,68,490 లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ పి. శ్రీను వాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అష్టోత్తరానికి రూ.9100, కుంకుమార్చన రూ.25,400, తలనీలాలకు రూ.40,625 ,వాహనాలపూజలకు రూ.4,440, ప్రత్యేక దర్శనాలకు రూ.2,85,200, స్థలపురాణం పుస్తకాల అమ్మకాలకు రూ.400,రూము అద్దెలకు రూ.25,940, కవర్లకు రూ.9165,లడ్డు ప్రసాదానికి రూ.2,11,510,అన్నదానానికి 2,73,806,విరాళాలు రూ.15,232, వచ్చాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

19-7Pg5exHMNWJQEG_19-7Pg5exHMNWJQEG.qxd 18/Jul/26 11:47 PM Page 1



## తిరుమల సమాచారం



## నడకమార్గంలో భద్రతా చర్యలు బలోపేతం

### భక్తుల రక్షణకు అత్యవసర ప్రతిస్పందన బృందాలు

### టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిరోజూ తిరుపతి అలిపిరి కాలినడక మార్గంలో వచ్చే భక్తులకు సున్నితమైన ప్రాంతాల్లో భద్రత రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. అటవీమార్గంలో వన్యప్రాణుల సంచారాన్ని నిరంతరం పర్యవేక్షి ంచేందుకు టిటిడి అటవీ శాఖ, విజిలెన్స్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ లతో బాటు సంబంధిత అన్ని విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత మెరు గుపరచుకోవాలని చౌదరి సూచించారు.శనివారం తిరుమల పద్మావతి విశ్రాంతి భవనంలోని సుధర్మ సమావేశ మందిరంలో టిటిడి,అటవీ శాఖ అధికారులతో అదనపు ఇఒ చౌదరి సమీక్ష నిర్వహించారు. తిరుమలకు నడకమార్గాల్లో ఒకటైన అలిపిరి నడక మార్గంలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది. తిరుమల పరిసర ప్రాంతాల్లో వన్య ప్రాణుల సంచారప్రాంతాలు, వాటి కదలికల తీరును శాస్త్రీ యంగా అధ్యయనం చేసి, భక్తులకు ప్రమాదం కలిగించే ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వన్యప్రాణుల సంచారానికి సంబంధించి ఇప్పటికే గుర్తించిన మూడు ప్రధాన ప్రమాద కారకాలను (రిస్క్ పారామీటర్లు) సమగ్రంగా పరిశీలించి, వాటి ప్రభావాన్ని తగ్గించే కార్యాచరణను రూపొం దించాలని స్పష్టం చేశారు. అలిపిరి నడక మార్గంలోని దుకాణాల నిర్వహణ వల్ల వన్యప్రాణుల సంచారంపై, భక్తుల భద్రతపై ఎలాంటి ప్రభావం పడుతుందో సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైతే తగిన నియంత్రణ చర్యలు చేపట్టా లని అధికారులను సూచించారు. అంతకుముందు టిటిడి డిఎఫ్ఒ ఫణికుమార్ నాయుడు గత రెండేళ్లలో చిరుతలు ఎక్కువగా సంచరించిన ప్రాం తాలు, ట్రాప్ కెమెరాలు, సోలార్ కెమెరాల పనితీరు, వన్యప్రాణుల సంచార ధోరణులు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. ఈ సమావేశంలో సిసిఎఫ్ శ్రీనివాసరెడ్డి, డిఎఫ్ఒ సాయిబాబా, టిటిడి సిఇ సత్య నారాయణ, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, విఎస్ఒ సురేం ద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి



## తిరుమల కొండ కిటకిట

### గదుల కోసం భక్తుల పాట్లు

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవులతో తిరుమలలో కిలోమీటర్ల మేర క్యూలైన్లు నిండిపోయాయి. శనివారం ఉదయమే శిలాతోరణం వరకు వెలుపల భక్తుల లైన్లు బారులుతీరాయి. వైకుంఠమ్‌లోని కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. ఎలాంటి దర్శన టోకెన్లు,టిక్కెట్లు లేని భక్తులు శ్రీవారి సర్వదర్శనం కోసం 30గంటల సమయం నిరీక్షణ తప్పడం లేదు. విపరీత రద్దీ కారణంగా ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు కూడా దర్శనానికి ఆరుగంటల సమయం పడుతోంది.టైమ్‌స్లాట్ దర్శన భక్తులకు 8గంటల సమయం నిరీక్షిస్తున్నారు. శుక్రవారంరాత్రి వరకు 74,096 మంది భక్తులు స్వామివారిని దర్శించుకు న్నారు.శ్రీవారి హుండీఆదాయం 3.66కోట్లుగా నమోదైంది. భక్తులకు 4 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.98లక్షల మందికి అన్నప్రసాదం స్వీకరించారు. భారీగా భక్తుల రద్దీ దృష్ట్యా టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది. క్యూలైన్ల లో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు పాలు, తాగునీరు, అన్నప్రసాదాలను నిరం తరాయంగా పంపిణీచేస్తోంది. భక్తులు ఓపికతో వ్యవహరించి, సిబ్బందికి సహక రించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## తిరుపతిలో గుంటూరు పోలీస్ పేరుతో హల్‌చల్

### పట్టుకున్న అసలు పోలీసులు

**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి యాత్రాస్థలంలో ఏకంగా ఖాకీ యూనీఫారమ్ ధరించి గుంటూరు పోలీస్‌నంటూ ఓ వ్యక్తి అలిపిరి సమీపంలో గదిని అద్దెకు తీసుకున్నాడు. అతనితోబాటు మరో యువతి కూడా రావడంతో లాడ్జి యాజమాన్యం అనుమానంతో అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో నకిలీ పోలీస్ గుట్టురట్టయ్యింది. తాను పోలీస్‌శాఖలో ఆర్ఎస్ఐ అంటూ గుంటూరు జిల్లా చోడయపాలెం కు చెందిన దాసరి కార్తీక్ అలిపిరిలోని విహా హోమ్ స్టే మేనేజర్‌ను సంప్రదించాడు. తాము తిరుమలకు వచ్చామని, ఫ్రెష్ కావడానికి తనకు గదిని అద్దెకు ఇవ్వాలని తీసుకున్నాడు. శనివారం వేకువజామున గదికి వచ్చిన అతను మరో యువతితో ఉదయం 7గంటల వరకు గదిలోనే ఉండిపోయారు. లాడ్జి సిబ్బంది తలుపు తట్టినా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం కలిగి హోమ్ స్టే యజమానికి, పోలీసులకు మేనేజర్ హేమంత్ సమాచారమిచ్చాడు. హోమ్ స్టే వద్దకు చేరుకున్న అలిపిరి పోలీసులు నకిలీ పోలీస్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ రామాంజనేయులు విచారణ చేస్తున్నారు.

## రూ.17లక్షలు విరాళమిచ్చిన

## డి.సిఎం పవన్ సతీమణి అన్నాలెజినోవా



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సంపూర్ణ ఆరో గ్యంగా కోలుకోవాలని శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీ స్సులు కోరినట్లు ఆయన సతీమణి అన్నా లెజినోవా తెలిపారు. ఇటీవల పవన్‌కళ్యాణ్ తన చేతికి శస్త్రచికిత్స చేసుకున్న విషయం తెలి సిందే. అది విజయవంతంగా నిర్వహించడం, ఆ తరువాత ఆయన ఆరోగ్యంగా ఉండాలని ,శ్రీవారి శక్తిని ప్రసాదిం చాలని వేడుకు న్నారు.రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. శనివారం వేకువజామున తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన పవన్ సతీమణి లెజినోవాకు ఆలయ అధి కారులు స్వాగతం పలికారు. వేకువ జామున సుప్రభాతసేవలో శ్రీవారిని దర్శిం చుకుని కానుకలు సమర్పించారు. ఆమె తన కుమారుడు మార్క్ శంకర్ పేరుతో వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 17లక్షలు రూపాయలు విరాళం అందించి, స్వయంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. భక్తులతో కలిసి అన్నప్ర సాదం స్వీకరించారు. అంతకుముందు ఆమె శుక్రవారం రాత్రిఅలిపిరి నడక మార్గం ద్వారా కాలినడకన తిరుమల కొండకు చేరుకున్నారు.

# రైతుల సమక్షంలోనే రీసర్వే

### రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్



శనివారం రీసర్వే పనులను జిల్లా రెవెన్యూ, సర్వేఅధికారులతో కలిసి తనిఖీ చేస్తున్న రోణంకి కూర్మనాథ్

**విజయవాడ.జులై 18.ప్రభాతవార్తప్రతినిధి:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యంగా రైతుల సమక్షంలో రీసర్వే నిర్వహిం చాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారు లను ఆదేశించారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా కం చికచెర్ల, నందిగామ మండలం సోమవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమక్షంలో సర్వే జరుగుతుండటంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోణంకి కూర్మ నాథ్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన రీసర్వేలో చోటుచేసుకున్న లోపాలు, భూ సరిహద్దుల నిర్ణయంలో జరిగిన పొరపాట్లు, జాయింట్ ఎల్పీ నంబర్ల వంటి సమస్యలు పునరావృతం కాకుండా రీసర్వే-2.0ను అమలు చేస్తున్నామని తెలిపారు. సర్వే ప్రారంభానికి ముందే సంబంధిత రైతులకు సమాచారం అందించి, వారి లేదా కుటుంబ సభ్యుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే అనంతరం డాక్యుమెంట్ల పరిశీలన ద్వారా భూ హద్దులను రైతు సమక్షంలోనే నిర్ధారించి, సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసు పుస్తకం అందే వరకు ప్రతి దశలో పారదర్శక సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధి కారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే కార్య క్రమం వేగంగా కొనసాగుతోందని, ఫేజ్-1లో 628, ఫేజ్-2లో 748, ఫేజ్-3లో 729, ఫేజ్-4లో 1,645 గ్రామాల్లో సర్వే పూర్తవుతుండగా, ప్రస్తుతం ఫేజ్-5లో 1,343 గ్రామాల్లో సుమారు 2,800 బృందాలు అత్యా ధునిక రోవర్ పరికరాలతో రీసర్వే నిర్వహిస్తున్నాయని తెలి పారు. 2027 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌ను భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం, సర్వే శాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ వై.మోహనరావు, నందిగామ డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్లు జె. బసవరావు, సాంబశివరావు, మండల సర్వేయర్ నరేంద్ర, రెవెన్యూ, సర్వేశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో ఛార్జ్ షీట్ వెనక్కి

**విజయవాడ.జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ముంబ యి నటి కాదంబరి జెత్వానీ కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో సీఐడీ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ రిటర్న్ అ యింది. ఈ కేసులో సీఐడీ అధికారులు తాజాగా విజయవాడ నాలుగో అదనపు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అయితే, ఈ ఛార్జ్ షీటును కోర్టు రిటర్న్ చేసింది. ఈ కేసు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లల్లో సంచలనంగా మారింది. వైసీపీ హయాంలో అప్పట్లో కొందరు పోలీసు అధి కారులు తనతో పాటుగా తన కుటుంబ సభ్యు లను అన్యాయంగా అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టారని జెత్వానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆరోపిస్తూ విజయవాడ పోలీసు కమి షనర్‌కు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు ఇబ్రహీం పట్నం పోలీసు స్టేషన్‌లో ఐపీసీ 120బీ, 166, 166ఏ, 167, 342, 354డీ, 420, 467, 469, 471, 34 సెక్షన్ల కింద కేసు (క్రైం నంబరు 469/2024) నమోదైంది.ఈ కేసులో వైసీపీ నేతలు సహా పోలీసుల అధికారులను నిం దితులుగా చేర్చారు. వైసీపీ నేత కుక్కల విద్యా సాగర్(ఏ1), నిఘా విభాగం మాజీ చీఫ్ పీఎస్ ఆర్ ఆంజనేయులు (ఏ2), పోలీసు అధికారులు కాంతిరాణా తాతా (ఏ3), కె.హనుమంతరావు (ఏ4), ముత్యాల సత్యనారాయణ (ఏ5), విశాల్ గున్నీ(ఏ6)తోపాటు ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాదిని నిందితులుగా చేర్చారు. పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీ, అప్పటి పశ్చిమ మండలం ఏసీపీ కె.హను మంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ సత్యనా రాయణను సస్పెండ్‌చేసారు. కాగా, ఆ తరువాత ప్రభుత్వం దీనిని సీఐడీకి బదలీ చేసింది. సీఐడీ గుంటూరు ప్రాంతీయ విభాగాధికారులు దర్యాప్తు చేశారు.కేసులో ఎవరెవరుఎలాంటి పాత్ర పోషిం చారో వివరిస్తూ చార్జిషీటు సిద్ధంచేసారు. కాగా కోర్టు దీనిని రిటర్న్ చేయడంతో త్వరలోనే మరో చార్జిషీటు దాఖలు చేసేందుకు సీఐడీ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## యూట్యూబరు రావణ్ కేసులో గమన, ఇంద్రసేనా చౌదరి విచారణ

**విజయవాడ.జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** యూ ట్యూబరు రావణ్ దర్యాప్తు కేసులో కీలకంగా భావిస్తున్న గమన, ఇంద్రసేనా చౌదరిని శనివా రం మూడవ విడత విచారణకు హాజరు పరి చారు. వారి ఆర్థిక స్థితి, వ్యక్తిగత వ్యవహా రాల తో పాటు యూట్యూబ్ ఛానళ్ల నిర్వహణ, నిధు ల సమీకరణ, విద్వేషపూరిత కంటెంట్ ప్ర చా రం వంటి అంశాలపై విస్తృతంగా ప్రశ్నిం చినట్లు సమాచారం.పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు అధికారి ధర్మేంద్ర ఆధ్వ ర్యంలో దాదా పు శుక్రవారంమంతా విచారణ కొనసాగింది. పలువురు అధికారులు విడివిడిగా ప్రశ్నలు సం ధించినప్పటికీ, కీలక ప్రశ్నలకు ఇద్దరూ ఎటు వంటి బదులు ఇవ్వలేదు.విచారణ మధ్యలో గమన, ఇంద్రసేనా చౌదరిని పోలీసులు మంగళ గిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న వారి మొబైల్ ఫోన్లను సాంకేతిక విశ్లేషణ కోసం ఇప్పటికే ఫోరె న్సిక్ పరీక్షలకు పంపించారు. ఫోన్లను అన్‌లాక్ చేయించి అందులోని సమా చారాన్ని పరిశీలించే ప్రక్రియ చేపట్టారు. ఒకవేళ ఫోన్లలోని డేటాను తొలగించి ఉంటే, దానిని సాంకేతికంగా తిరిగి రాబట్టే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. అనంతరం గమనను తిరిగి పెన మలూరు పోలీస్‌స్టేషన్‌కు, ఇంద్రసేనా చౌదరిని గన్నవరం తరలించి అక్కడ ప్రత్యేకంగా ప్రశ్నిం చినట్లు తెలిసింది.ఫోరెన్సిక్ నివేదికలు, బ్యాంకు లావా దేవీల విశ్లేషణ ఆధారంగా దర్యాప్తు మరిం త ముందుకు సాగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇక గమన,ఇంద్రసేనా చౌదరి విచారణలో రావణ్‌తో పరిచయం ఎప్పటి నుంచి ఉందని ప్రశ్నించగా రెండేళ్లుగా పరి చయం ఉందని చెప్పినట్లు సమాచారం. యూ ట్యూబ్ ఛానళ్ల నిర్వహణకు ఇప్పటివరకు ఎంత మొత్తం ఖర్చు చేశారు, ఆదాయ వనరులు ఏమిటి, నగదు బదిలీలు ఎలా జరిగాయి వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని తెలుస్తోంది. ఇప్పటివరకు ఎన్ని వీడియోలు అప్ లోడ్ చేశారన్న ప్రశ్నకు కూడా ఖచ్చితమైన వివ రాలు చెప్పలేదని సమాచారం. రావణ్ రూపొం దించిన వీడియోల సంఖ్యపై కూడా స్పష్టత ఇవ్వలేదని తెలిసింది.

## తిరుమలేశుని ఆరాధన విధానానికి వైఖానస భగవత్ శాస్త్రం మూలం

### రాఘవ దీక్షితులు



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డల వేంకటేశ్వరస్వామి నిత్యారాధనలు, ఉత్స వాలు వైఖానస మహర్షి రచించిన వైఖానస భగ వత్ శాస్త్రం ప్రకారమే వేలాది సంవత్సరాలుగా కొనసాగుతున్నాయని తిరుమల వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధిని సభ అధ్యక్షుడు దీవి రాఘవ దీక్షి తులు తెలిపారు. తిరుమల ఆస్థాన మం డపంలో శనివారం వైఖానస దివ్యసిద్ధాంత వివ ర్ధిని సభ, టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో మరీచి మహర్షి తిరు నక్షత్రోత్స వం నిర్వహించారు. వైఖానస భగవత్ శాస్త్రం వేదాధారితమైనదని, వేదమంత్రాలతో నిర్వహించే వైఖానస ఆరాధన తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమని చెప్పారు. మరీచి మహర్షి రచించిన విమా నార్చనాకల్పం, ఆనంద సంహిత గ్రంథాల్లో ఆరాధన విధానాలను సమగ్రంగా వివరించారని తెలిపారు. ఇప్పటికీ తిరుమలలో నిర్వహిస్తున్న అష్టదళ పాదపద్మారాధన (స్వర్ణ పుష్పార్చన) కూడా మరీచి మహర్షి నిర్దేశించిన శాస్త్ర విధానంలో భాగమేనని పేర్కొన్నారు. **దేవాలయ సంస్కృతికి మరీచి మహర్షి విశిష్ట సేవలం దించారు.** విఖనస ట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకర ఆచార్యులు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం, మండపాల నిర్మాణం, నిత్యారాధ నలు, ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన శాస్త్ర విధానాలను మరీచి మహర్షి సమగ్రంగా అందించారని తెలిపారు. దేవాలయాలు ధర్మప రమైన, సంస్కారవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్రబిందువులని చెప్పారు.

వేదిక్ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు య శ్వంత్ దీక్షి తులు మాట్లాడుతూ తిరుమల బ్రహ్మో త్సవాల వైభవం వైఖానస భగవత్ శాస్త్రంలో పేర్కొనబడిందని, ఈ ఉత్సవాలను దర్శించడం అశ్వమేధ యాగ ఫలాన్ని ప్రసా దిస్తుందని తెలిపారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం వైఖానస పండితుడు శేషసాయి వైఖానస కల్పసూత్రం మానవ జీవితాన్ని సంస్కారవం తంగా తీర్చిదిద్దే మహోన్నత శాస్త్రమని చెప్పారు. శాస్త్రోక్తంగా నిర్వహించే దేవాలయ పూజలు లోకక్షేమానికి, దేశ సుభిక్షానికి దోహదపడతా యని పేర్కొన్నారు.

పంచబేరాల ఆరాధనకు విమానార్చనాకల్పమే ఆధారమన్నారు.

గంజాం కావ్యశ్రీ, శ్రీలక్షి ్మ ఆద్యలు ఆలపించిన వైఖానస వైభవ గీతాలు సభికులను ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో విఖనస ట్రస్ట్ సం యుక్త కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఎన్.వి. వి.ఎన్. దీక్షి తులు,ధర్మగిరి

## సొంత జిల్లాల్లో పరిస్థితులపై సిఎం చంద్రబాబు దృష్టి

**తిరుపతి,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత జిల్లాలు తిరుపతి,చిత్తూరులపై స్పెషల్ ఫోకస్ పెట్టినట్టు తెలిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా లో ఉన్న 14 అసెంబ్లీ నియోజక వర్గాలు చిత్తూరు, తిరుపతి అన్నమయ్య జిల్లాలలో కలి శాయి. మూడు జిల్లాల్లోనూ బలమైన నాయ కత్వం లేక పోవడంతో పార్టీ ప్రతిష్ఠ దిగరారే సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాలు, భూ కబ్జాలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీని నడిపించాల్సిన పార్లమెంటు కమిటీలు బలహీనంగా ఉన్నాయి. దీంతో అంతర్గత గొడ వలు, వర్గపోరు ఎక్కువ అయ్యింది. ఇటీవల పుంగనూరు, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జిల మార్పు కోసం తిరుపతిలో ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశం రసాభాస అయ్యింది. మంత్రులులు బి సి జనార్ధన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, ప్రాంతీయ పర్యవేక్షకుడు దామచర్ల సత్య, పరిశీ లకుడు శాప్ చైర్మన్ రవి నాయుడు సమక్షంలో పుంగనూరు కార్యకర్తలు బాహాబాహీకి పాల్ప డ్డారు.

ఒక వర్గం వారు మరో వర్గం వారిపై హత్యా ప్రయత్నం కేసు పెట్టారు. అయితే న్యా యమూర్తి అక్షి ంతలు వేసి బెయిలు మంజూరు చేశారు. ఈ సంఘటన వల్ల పార్టీ ప్రతిష్ఠ బాగా దెబ్బతిందని గుప్పుమంటోంది. శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, జీడి నెల్లూరు, చంద్రగిరి నియోజకవర్గాలలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవా ణాలు, భూ కబ్జాలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తిరుపతిలో పార్టీ రెండు వర్గాలుగా చీలి పోయింది. కొన్ని నియోజక వర్గాలలో ఎమ్మెల్యేలు అందుబాటులో లేరన్న ఆవేదన వ్యక్తం అవుతున్నది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు పార్టీ నాయకత్వ ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తెలిపారు సింది. పుంగనూరు, తంబళ్లపల్లె నియోజక వర్గాలకు కొత్త ఇన్‌చా ర్జీలను నియమించనున్నారు. మూడు జిల్లాలకు చెందిన ఒకరికి గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని యోచిస్తున్నారని తెలిసింది. త్వరలో ఒకరిద్దరు సీనియర్ నేతలకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పుడు పదవులలో ఉంటూ చెడ్డ పేరు తెచ్చుకున్న వారికి కొందరికి

## ఆంధ్రసారస్వత పరిషత్తు ఆధ్వరంలో 'బాల గేయాల' పోటీల రచనలకు ఆహ్వానం: గజల్ శ్రీనివాస్

**విజయవాడ,జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఎంతో ప్రతిష్ఠా త్మకంగా బాలల కోసం డిసెంబర్ 5,6 తేదీ ల్లో నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒం గోలు ప్రాంగణంలో నిర్వహిస్తున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభలు బాలలు పుర స్కరించుకుని బాల సాహిత్యాన్ని పెంపొం దించే దిశగా "బాల గేయాల రచన" పోటీలు నిర్వహిస్తున్నట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలో ఏ వయసు వారైనా పాల్గొనవచ్చని, గేయం 15 పంక్తులు (లైన్లు) మించకుండావుండాలని కోరారు. గేయ రచన తెలుగు భాష , సంస్కృతి, జీవన విధానం, భారతీయత లపై ఆశక్తి, అనురాగం కలి గించే విధంగా వుండాలని తెలియజేశారు. పో టీలకు పంపే గేయాలు రాత ప్రతిని పిడిఎఫ్ మాధ్యమంలో 10 ఆగస్టు నాటికికోరుప్రోలు మాధవరావు 9866995085 .నెంబర్ కు వాట్సాప్ ద్వారా పంపాలి..ప్రథమ బహు మతిగా రూ.మూడువేలు ద్వితీయ బహుమతి రూ.రెండువేలు తృతీయ బహుమతిగా రూ. వేయి పది ప్రోత్సాహక బహుమతులు ఒక్కొ కటి రూ.ఐదువందలు అలాగే ప్రశంసా పత్ర ము, పతకము మహాసభల సమయంలో విజేతలకు ప్రదానం చేయడం జరుగుతుందని కార్యదర్శి ధవేజీ , ముఖ్య సమన్వయ కర్తలు డా. మురళీధర్ రెడ్డి, శ్రీకాంత్ లు తెలిపారు. ఎన్నిక కాబడిన గేయాలను ధ్వని ముద్రణ చేసి, ఏఐ ద్వారా వీడియో లుగా రూపొందించి ప్రచారం చేస్తామని కార్యక్రమ అంతర్జాతీయ, జాతీయ సమన్వయ కర్తలు కొల్లి రమావతి, రాధికా మంగిపూడి తెలిపారు.

## ముగిసిన లిక్కర్ స్కామ్ కేసు నిందితుల విచారణ

**విజయవాడ,జులై18,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ రవాణా స్కామ్ కేసు నిందితుల ఈడీ కస్టడీ విచారణ ముగిసింది. వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌ను ఈడీఅధికారులు మూడు రోజులు ప్రశ్నించారు. కస్టడీ ముగియ డంతో ముగ్గురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ముగ్గురు నిందితులను నాం పల్లి కోర్టులో హాజరుపరిచారు. సోదాల్లో సేకరించిన వివరాల ఆధారంగా అధి కారులు దర్యాప్తు చేశారు. ఈడీ కస్టడీ విచారణలో నిందితులు పలు కీలక ఆరో పణాలకు సంబంధించి మౌనంగా ఉన్నట్లు సమాచారం.

## ఐదుగురు మృతిపై సిఎం చంద్రబాబు విచారం

**విజయవాడ జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో ఐదుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్య మంత్రి చంద్రబాబు తీవ్రవిచారం వ్యక్తంచేశారు. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారన్న విషయంపై ముఖ్యమంత్రి అధికా రులను అడిగివివరాలు తెలుసుకున్నారు.గొమ్ముకొత్తగూడెంకు చెందిన తుర్రం భరత్, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బొసిబోయిన బాలరాజు, ఊకే రమేష్ అనే ఐదుగురు చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సంఘ టనపై విచారం వ్యక్తంచేసిన సీఎం మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

### డిసిఎం పవన్ విచారం

ఐదుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలవరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిం చాలని అధికారులను ఆదేశించారు.

### హోం మంత్రి అనిత విచారం

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధి కారులను ఆదేశించారు.బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అం దేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దిగ్భ్రాంతి

చేపల వేటకు వెళ్లిన ఐదుగురు మృతి చెందిన ఘటన అత్యంత విషాదకరమని బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక అధికారులు మృతులకుటుంబాలకు తక్షణ సహాయం అం దించి, వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

## చిన్నారులకు తొలిసారిగా సుగర్, బిపి స్క్రీనింగ్ పరీక్షలు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జులై 18, ప్రభాతవార్తప్రతినిధి:** చిన్న వయస్సులోనే మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులను గుర్తించేందుకు రాష్ట్రప్రభుత్వం తొలిసారిగా ప్రత్యేక స్క్రీనింగ్‌కు శ్రీకారం చుట్టింది. జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమాన్ని మరింత విస్తరించి ఆర్‌బీఎస్‌కే-2.0గా అమలు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 62.65 లక్షల మంది చిన్నారులకు 38 రకాల సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి పూర్తిగా ఉచిత చికిత్స అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలోనే స్క్రీనింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని 20.95 లక్షల మంది, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న 41.7 లక్షల మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార సమస్యలు, వివిధ వ్యాధులు, ఎదుగుదలలో జాప్యం, వైకల్యాలను సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

## జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో మాగల్లు విద్యార్థి ప్రతిభ

**విజయవాడ,జులై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా మాగల్లు గ్రామానికి చెందిన కస్తాల జయదీప్ (17) 2026 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించి, పశ్చిమ బెంగాల్‌లోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మైనింగ్ బ్రాంచ్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా నందిగామ బార్ అసోసియే షన్ హాల్‌లో జయదీప్‌ను 16వ అదనపు జిల్లా జడ్జి పి. శ్రీనివాసరావు, నందిగామ ఆర్డీవో అనిల్ , డీవైఈవో ఉప్పులూరి గురునాథం, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు షేక్ కరీముల్లా, ప్రభుత్వ న్యాయవాది మట్టా ప్రసాద్. సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా జడ్జి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జయదీప్ మాగల్లు జడ్పీ పాఠ శాలలో పదో తరగతి చదివి 570మార్కులు సాధించి నందిగామ మండలంలో ప్రతిభ కనబరిచాడని, నందిగామ పట్టణంలోని కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 970 మార్కులు సాధించి, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణత సాధించి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు సంపాదించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాం తానికి చెందిన విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతిష్ఠాత్మక ఐఐటీలో సీటుసాధించడం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నం దిగామ ఆర్డీవో మాట్లాడుతూ జయదీప్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి, దేశానికి సేవచేసే అత్యున్నత సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు.

## కూటమి పాలనలో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితులు వచ్చాయి: ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

**విజయవాడ, జూలై 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి పాలనలో సభ్య సమాజం తలదించుకునే పరిస్థితులు వచ్చాయని, వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు.అధికార పార్టీ నాయకులు కాలకేయుల్లా ప్రవర్తి స్తున్నారని ఆక్షేపించారు.రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, వారు స్వేచ్ఛగా బతికే వాతావరణం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారుఒక సాధారణ నీటి కుళాయి కనెక్షన్ కోసం మల్లెల మూర్తి అనే వ్యక్తి సదరు మహిళను రూ. 10వేల లంచం అడిగాడని వరుదు కల్యాణి ఆరోపించారు. ఆ సమయంలో తలెత్తిన ఘర్షణ కారణంగానే ఆ మహిళను వివస్త్రను చేసి అమా నుషంగా దాడికి తెగబడ్డారని పేర్కొన్నారు. ఈ దారుణంపై బాధితురాలు పోలీ సులను ఆశ్రయించినా తొలుత వారు పట్టించుకోలేదని, ఈ వైఫల్యానికి కూట మి ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అనాగరిక చర్యకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. నిందితుడు మల్లెల మూర్తి అధికార పార్టీ కి చెందిన వ్యక్తి కాబట్టే తప్పు కప్పిపుచ్చుకోవడానికి కేవలం సస్పెన్షన్ వేటు వేసిచేతులు దులుపుకున్నారని విమర్శించారు. అధికార దుర్వినియో గానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేటెంట్ అని ఎద్దేవా చేశారు.

## ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండాలి

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

**కొడవలూరు (నెల్లూరు), జులై 18, ప్రభాతవార్త :** కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు జిల్లా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ గూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వ హణపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, సమీప గృహాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములై నిర్వహించాల్సిన ఉద్యమమని అన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వెంకన్నపురాన్ని ఆదర్శ పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాపా వెంకటేశ్వర్లు నాయుడు, తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు, అజయ్ బాబు,కూటమి నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

19-7Pg6exHMNWJQE_19-7Pg6exHMNWJQE.qxd 18/Jul/26 11:25 PM Page 1



# సప్పరంలో సవ్యసాచి దర్శనం



**శ్రీకాళహస్తి,జులై 18 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల స్వామి ఆలయంలో తిరునాళ్ళ సందర్భంగా శనివారం సవ్యసాచి సప్పరంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయం వద్ద పాండవ విద్యాభ్యాసం మహోత్సవం భారత పఠనంలో నిర్వహించారు. రంగస్థల కళాకారులచే నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణతో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. శనివారం కావటంతో పట్టణానికి చెందిన భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీకృష్ణార్జునులు ఆసీనులై సప్పరంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఊరేగింపు ఆలయం నుంచి ప్రారంభమై సుమారు పట్టణంలో 5కిలోమీటర్లు సాగింది. ఉత్సవంతో పాటు ఆలయ ఇన్స్పెక్టర్ ఆర్.సుబ్రమణ్యం, సహాయకుడు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

# సమగ్ర దర్యాప్తుతో బాధితులకు న్యాయం

## ప్రాసిక్యూషన్ రాష్ట్ర డైరెక్టర్ బైరా రామకోటేశ్వరరావు

**విజయవాడ కార్పొరేషన్,జులై 18,ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసుల్లో సమగ్ర దర్యాప్తుతో పాటు విచారణ జరిగితేనే భాధితులకు పూర్తి న్యాయం చేయగలిగిన వారమవుతామని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం విజయవాడ లోని ఆయన కార్యాలయంలో రాష్ట స్థాయి ఎస్సీ,ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లతో ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ మాసం వరకు స్పెషల్ పిపీల కేసుల విచారణలో ఉన్న కేసుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పోలీసు అధికారులు కేసుల్లో ముందుకు సాగాలన్నారు. న్యాయస్థానంలో విచారణ సమ యంలో స్పెషల్ పీపీలు చేస్తున్న లోపాలను వారికి ఆయన వివరించారు. లోపాలకు తావు లేకుండా చేస్తేనే న్యాయస్థానం నిందితులకు కఠిన శిక్షలు విధించే అవకాశం ఉంటుందన్నారు. భాధితులకు నిజమైన న్యాయం జరుగుతుం దన్నారు. అత్యాచార భాధితులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని వేగంగా అందించేటట్లు చూ డాలని ఆయన ఆదేశించారు. పోలీసు అధికారులు, స్పెషల్ పిపిలు సమన్వయంతో పనిచేస్తేనే న్యాయం భాధితులకు అందుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ డైరెక్టర్ మద్దాల విజయ,డిప్యూటీ డైరెక్టర్‌లు బర్కత్ ఆలీఖాన్, ఎంకె విజయలక్ష్మి, ఆనంద జ్యోతి,రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఎసిపిలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త లక్ష్మీనారాయణ. చిత్రంలో సిపిఐ ముఖ్య నేతలు

# హంద్రీ నీవా కాలవ సామర్ధ్యాన్ని పెంచాలి: పి.లక్ష్మీనారాయణ

## కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి: డి.జగదీష్

**అనంతపురం, జులై 18,ప్రభాతవార్త బ్యూరో :** హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం కింద మాల్యాలనుంచి జీడిపల్లి వరకు ఉన్న ప్రధాన కాలువ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాలని, ఇప్పుడున్న 3,000 క్యూసెక్కుల నుంచి 6 నుంచి 8 వేల క్యూసెక్కుల వరకు కాలువ వెడల్పు చేసేందుకు రాష్ట ప్రభుత్వం చొరవ చూపాలని ప్రముఖ సామాజికవేత్త, రాజకీయ విశ్లేషకులు పి. లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. హంద్రీ నీవా, తుంగభద్ర రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని సక్రమంగా వినియోగించుకుని అనంతపురం జిల్లా సాగునీటి సౌకర్యాలను గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి పనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ,త్వరితగతిన కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా కాలువకు కామ్రేడ్ వి.కె. ఆదినారాయణరెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. శనివారం అనం తపురం నగరంలోని వికె భవన్‌లో స్వాతంత్ర సమరయోధుడు, దివంగత సిపిఐ అగ్రనేత వి.కె.ఆదినారాయణరెడ్డి 29వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కరువు పరిస్థితులు, సాగునీటి ప్రాజెక్టుల ఆశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారా యణ, ఇతర నాయకులు ముందుగా ఆదినారా యణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నారా యణస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నీళ్ల లేకుంటే జీవమే లేదన్నారు. కరువు జిల్లా అయిన అనం తలో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు కాలువల ఆధునీకరణ ఎంతో ప్రాముఖ్యత సంత రించుకుందని అన్నారు. జిల్లాలో 3.50 లక్షల ఎకరాకు సాగునీరు అందించవచ్చునని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 1.50లక్షల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదన్నారు. నేటి కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అందరూ కామ్రేడ్ వి.కె.ఆదినారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్టకార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు.ఈ కార్యక్ర మంలో వి.కె. మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ వి.కె. రంగారెడ్డి, సీనియర్ న్యాయవాది ఐదుకల్లు రవీంద్రనాథ్, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనరు అమర్ నాథ్‌రెడ్డి, ఎస్టీయు రాష్ట సీనియర్ నాయకులు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోనలో వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

## హుండీ రాబడి రూ.4,31,424

**రాపూరు (నెల్లూరు), జూలై 18, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆల య ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకోని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోని స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం,గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయఅర్చక స్వాములు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, స్వామి వారికి భక్తులు సమర్పించిన 100 గోడుగులతో, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు,మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణ నిర్వహించారు. శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,25,910 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.67,764లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.26,250 లు, నిత్య కళ్యాణం ద్వారా రూ.19,500లు ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.46,900లు దేవస్థానం వసతి ద్వారా రూ.20,300 లు, తలనీలలు 1321 మంది సమర్పించగా తద్వారా రూ.52,840లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,64,655లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.21,280 లు, వడ ప్రసాదం విక్రయం ద్వారా రూ.10,385లు,వాహనాల పూజల ద్వారా రూ. 1,550లు చోప్పున మొత్తం రూ.4,31,424 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డితెలిపారు.స్వామి వారి అన్న ప్రసాదాన్ని 1988 మంది స్వీకరించారని, సాయంత్రం 6.30 నిమిషాల వరకు మొత్తం 5,581 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి,వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు తదితరులున్నారు.

# నెల్లూరులో ఘనంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

### వర్చువల్‌గా 101 ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించిన: సీఎం చంద్రబాబు

### కాలుష్య రహిత, స్వచ్ఛమైన నెల్లూరు లక్ష్యంగా మరో ముందడుగు



**నెల్లూరు, జులై 18 ప్రభాతవార్త:** నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సోమవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా గుడివాడ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో నెల్లూరు నగరానికి మంజూరైన 101 ఎలక్ట్రిక్ డోర్‌టుడోర్ చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర మేయర్ సుజాత, నూడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, మున్సిపల్ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్-స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పనిచేస్తున్నారని కొనియాడారు. నెల్లూరు నగరానికి ప్రభుత్వం మొత్తం 200 ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేయగా, తొలి విడతలో 101 వాహనాలను ప్రారంభించడం సంతోషకరమన్నారు. నెల్లూరు రూరల్ సమీపంలోని దొంతాలి వద్ద ఏర్పాటుచేసిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను కూడా సీఎం ప్రారంభించారని అజీజ్ చెప్పారు. ఈఆటోల వినియోగంతో నెలకు సుమారు 25 వేల లీటర్ల డీజిల్ ఆదా కావడంతో పాటు వాయు కాలుష్యం తగ్గి నగరపాలక సంస్థ నిర్వహణ వ్యయాలు కూడా గణనీయంగా తగ్గనున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి వాహనానికి జియో ఫెన్సింగ్ (జీపీఎస్) వ్యవస్థను అనుసం ధానించడం ద్వారా 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణను పకడ్బం దీగా పర్యవేక్షించవచ్చని తెలిపారు. నగరంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్తను సేకరించి 100% శాతం డోర్‌టుడోర్ కలెక్షన్ లక్ష్యాన్ని సాధించేందుకు ఇవి దోహదపడతా యన్నారు. నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్ర మాలను ప్రజలు విజయవంతం చేయాలని, నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి సహ కరించాలని పిలుపునిచ్చారు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా నెల్లూరు కార్పొరేషన్‌లోనే ఇంత పెద్ద మొత్తంలో ఎలక్ట్రిక్ ఆటోలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు నెల్లూరు నగరానికి మొత్తం 200 ఈఆటోలు మంజూరు కాగా, మొదటి దశలో లభించిన ఈ 101 ఆటోల ద్వారా నగరంలోని 54 డివిజన్లలో 100 డోర్‌టుడోర్ చెత్త సేకరణ జరిగేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. స్థానిక మహిళా నేత కప్పిర రేవతి సీఎంతో ఈ కార్యక్రమం గురించి ముఖాముఖిగా మాట్లాడారు. గత ప్రభుత్వం కుప్పలు కుప్పలుగా చెత్తను మిగిల్చి వెళ్లిందని, తమ ప్రభుత్వం ఆ చెత్తను సంపదగా మార్చేందుకు బృహత్తర కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా సీఎంకి, మంత్రి పొంగూరు నారాయణకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమాలతో నెల్లూరు నగరం స్వచ్ఛ నగరంగా మారుతుందని ఆమె సీఎంతో తమ అభిప్రాయాన్ని పంచు కున్నారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగద్గురు చెన్నబసవ రాజేంద్రస్వామి శివైక్యం

### పార్థివదేహం ఉరవకొండ గవిమఠ సంస్థానానికి చేర్చి శాస్త్రోక్తంగా పూజల నిర్వహణ

### 1996 నుంచి గవిమఠం పీఠాధిపతిగా 30 సంవత్సరాలపాటు విశిష్ట సేవలు

### నేటి మధ్యాహ్నం గవిమఠంలో వీరశైవ ఆచారం ప్రకారం స్వామీజీ అంత్యక్రియలు



చెన్నబసవరాజేంద్ర మహాస్వామి (ఫైల్)

**ఉరవకొండ, జులై 18 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోనే ప్రసిద్ధి చెందిన ఉరవకొండ గవిమఠ సంస్థానం 8వ పీఠాధిపతి పరమపూజ్య జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి (98) శివైక్యం పొందారు. గత కొంత కాలంగా స్వామీజీ వృద్ధాప్యం కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవల తనకు తలలో నాలుకలా వ్యవహరించే ఏజెంటు రాజన్నగౌడ్ అకాల మరణం ఆయన్ను బాగా కుంగదీసినట్లు తెలుస్తోంది. నాటి నుండి కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలోగల మరి రాచోటిస్వామి మఠంలో కళ్యాణిస్వామివద్ద ఉంటున్న స్వామీజీ శుక్రవారం రాత్రి స్వల్ప అస్వస్థతకు గురికాగా వైద్యులు మఠానికే వచ్చి స్వామీజీను పరీక్షించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో నిద్రలోనే స్వామీజీ తుదిశ్వాస విడిచారు. పీఠాధిపతి శివైక్యం పొందారన్న వార్త తెలియగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలియగానే ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ మరి రాచోటిస్వామి మఠానికి చేరుకొని పీఠాధిపతి పార్థీవదేహాన్ని సందర్శించుకొని ఆచార పద్దతుల ప్రకారం కళ్యాణిస్వామితో కలిసి అక్కడ పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతికు చెందిన ఇన్నోవా వాహనంలోనే స్వామీజీ పార్థీవదేహాన్ని రోడ్డు మార్గాన ఉరవకొండ గవిమఠంకు చేరి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తుల సందర్శనార్థం ఫ్రీజర్ బాక్సులో ఉంచారు. జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి 1996 నుంచి గవిమఠ సంస్థానికి 8వ పీఠాధిపతిగా నియమితులై 30 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించారు. కర్నాటక రాష్ట్రం బెల్గామ్ జిల్లా బైలవంగల్ తాలుకా మార్గన్ కొప్పం గ్రామానికి చెందిన శంకరప్ప, పారమ్మ పుణ్య దంపతుల ఏకైక మగ సంతానమైన (ఇద్దరు సోదరీమణులు ఉన్నారు) చెన్నబసవయ్య 1929లో జన్మించారు. ఆదివారం మధ్యాన్నం 12 గంటల తరువాత గవిమఠంలోని పూర్వ పీఠాధిపతులు సమాధులు ఉన్న సముదాయం ఆవరణంలోనే పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్ర మహాస్వామి అంతిమ సంస్కారాలు నిర్వహించి సమాధిని నిర్మించడం జరుగుతుందని ఉత్తరాధికారి జగద్గురు డాక్టర్ కరిబసవరాజేంద్ర మహాస్వామి, సహాయ కమీషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ తెలిపారు.

# గుంటూరు ఘటన మానవత్వానికే మచ్చ: మాజీ సిఎం జగన్



**విజయవాడ,జూలై18,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు.ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

# 22న దుర్గమ్మ హుండీ లెక్కింపు




**ఇంద్రకీలాద్రి, జులై 18, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 22న మహామండపం 6వ అంతస్తులో లెక్కిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మవారి ఆలయంలో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణం:** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం 9గంటలకు శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కళ్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**దళారుల మోసాలకు గురికావద్దు:** దుర్గమ్మవారి ఆలయంలో ఉద్యోగాలిప్పిస్తామని, సేవ చేయడానికి అవకాశం కల్పిస్తామని, తదితర మాయ మాటలు చెప్పే దళారుల మాటలను నమ్మవద్దని, మోసపోవద్దని ఇఓ వికె శీనా నాయక్ భక్తులకు తెలిపారు. దళారులు శ్రీ అమ్మవారి పేరిట ఉత్సవాలు, ఊరేగింపులు, శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనం, తదితరాలపై మోసపుచ్చుతూ ఇచ్చే ప్రకటనలను నమ్మవద్దని, భక్తులకు తెలిపారు. భక్తులందరు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కనకదుర్గమ్మ.ఓఆర్‌జి దేవస్థానం వెబ్‌సైట్ ద్వారా లేదా టోల్‌ఫ్రీ ఫోన్ 18004259099 ల ద్వారా కాని మాత్రమే సంప్రదించి దేవస్థానం ద్వారా వివరాలు తెలుసుకోవాలన్నారు.

**దుర్గమ్మవారి సేవలో విఐపిలు:** దుర్గమ్మవారిని శనివారం ఏపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ జయసూర్య దర్శించుకున్నారు. కలకత్తా డెబిట్స్ రికవరి అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ అనిల్ కుమార్ శ్రీవాత్సవ దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటోలు అందించిన తరువాత వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారికి భక్తబృందాల ఆషాఢం సారె:** శనివారం సాయంత్రం 5 గంటల వరకు 21 భక్త బృందాలకు చెందిన 11,613మంది భక్తులు దుర్గమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. వారికి ఉచితంగా రు.100 దర్శనం కల్పించారు.

# చాట్లవాసు మృతి పట్ల ఎమ్మెల్యే దగుమాటి విచారం

**కావలి (నెల్లూరు), జూలై 18, ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయితీ తాగేటివారి పాలెంకు చెందిన టిడిపి కార్యకర్త చాట్ల వాసుపై ఇటీవల వైసిపి నాయకులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శనివారం నెల్లూరు ఆసుపత్రిలో మృతి చెందాడు. సమాచారం అందుకొన్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఇటీవల పథకం ప్రకారం వాసుపై వైసిపి నాయకులు విచ క్షణారహితంగా దాడికి పాల్పడిన విషయంపై ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. వైసిపి నేతలు టిడిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు హెచ్చమీరుతున్నాయని ఇది సహించరానివన్నారు.

రూరల్ మండలం చెన్నయపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ అరగల క్రిష్ణయ్యపై గతనెల 8న అతి దారుణంగా మరాణాయు దాలతో వైసిపి మాజీ ఎమ్మెల్యే అనుచరులు దాడికి పాల్పడిన విషయం గుర్తుచేశారు. ప్రధాన నిందితుడు మదు, మరో ఇద్దరు నిందితులతో రవిచంద్ర అనే నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. తప్పు చేసిన వారిని పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించనట్లు తెలిపారు. మృతుడు చాట్ల వాసు భార్య, చంట పిల్లలు ఉన్నారని వారు ధైర్యంగా ఉండాలని వారికి టిడిపి అండగా ఉంటుందని తెలిపారు.

# నీటిగుంటలో పడి ఇద్దరు మహిళలు మృతి

**నంద్యాల, జులై 18 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉయ్యాలవాడ మండల పరిధిలోని బోడెమ్మనూరు గ్రామ సమీపంలో గల కుందూనది నీటి గుంటలో పడి ఇద్దరు మహిళలు శనివారం మృతి చెందారు. పక్కీర రసూల్ బి (38) పక్కీర బీబీ (50)లు ఇద్దరూ గొర్రెలు తోలుకొని కుందూ నది ఒడ్డున గల ఇంజేడు పొలాలలో గడ్డి మేపుటకు వెళ్ళి నీటి లోతు తెలియక గుంటలో మునిగిపోయారు.మొదట పక్కీర రసూల్ బి నీళ్లలో దిగి మునిగిపోతూ ఉండగా వెంటనే ఆమెను కాపాడటానికి ఆమెతో పాటు పక్కీర బీబీ కూడా నీటిలో దిగింది. ఈత రాకపోవడంతో ఊపిరాడక ఇద్దరూ నీటిలో మునిగి చనిపోయారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ డి ఎస్ పి శ్రీనివాస రావు, రూరల్ సీఐ బీవీ రమణ ఉయ్యాలవాడ ఎస్సై లు ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి ప్రారంభం

**కొడవలూరు (నెల్లూరు), జూలై 18, ప్రభాతవార్త :** కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పాల్గొని రూ.కోటి వ్యయంతో నిర్మించిన మూడు కిలోమీటర్ల తారు రహదారిని ప్రారంభించారు. అనంతరం కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కృష్ణయ్య సహకారంతో రూ.35 లక్షల వ్యయంతో రహదారికి ఇరువైపులా 600 మొక్కలు నాటే కార్యక్ర మాన్ని ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ల శిక్షణ, ఉపాధి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం కోరమాండల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రో మోర్ న్యూట్రి క్లినిక్ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు.

## తాగి వచ్చాడు ప్రాణం తీశాడు

**జగ్గయ్యపేట, జూలై 18, ప్రభాతవార్త :** ఇన్స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యింది. అది ప్రేమకు దారి తీసింది. పెళ్ళి కూడా చేసుకున్నాడు. తాగి వచ్చాడు ప్రాణం తీశాడు. ఇది ఒక విషాద సంఘటన. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామ ఎస్‌సి కాలనీలో ఈ దుర్ఘటన జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం వినుకొండ గ్రామానికి చెందిన ఓర్సు మేరి (30)తీవ్రగాయాలతో విగత జీవిగా మారింది. సహజీవనం చేసుకుని ఇంటి వద్దే తాళి కట్టిపెళ్ళి చేసుకున్న నిందితుడు ఎద్దు గోపి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు గ్రామస్తులు ఆరోపించారు. పోలీసులు ప్రాథమికంగా అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు మేరీకి సంవత్సరం క్రితం ఎద్దు గోపి ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయం అయ్యాడు. ఈ పరిచయం ప్రేమగా మారిపోయింది. దీంతో సంవత్సర కాలంగా మేరి, గోపి అనుమంచిపల్లి గ్రామంలో సహజీవనం చేస్తున్నారు. ఆమె కోరికపై ఇంటి వద్దే తాళికట్టి పెళ్ళి చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి వీరిరువురి మధ్య గొడవ జరిగింది. బాగా మద్యం తాగి వచ్చిన గోపీని మేరి ప్రశ్నించటంతో ఘర్షణకు దిగిన గోపి తీ వ్రంగా కొట్టటంతో ఆమె స్పృహ కోల్పోయింది. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళే సరికే ఆమె మృతి చెందివున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. నిందితుడు గోపిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని నివాసితప్రాంత వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక సిఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడు పోలీసుల అదుపులోవున్నట్లు సమాచారం తెలిసింది.

**జగ్గయ్యపేటలో భారీ చోరీ**

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని సీతారామపురంలో తాళంవేసివున్న ఒక ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని న్యాయవాది ఎం శ్రీధర్ ఈనెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళారు. అయితే 15వ తేదీన పనిమనిషి ఇంటి తలుపులు తెరిచివున్నట్లు గమనించి సమాచారం ఇవ్వటంతో శ్రీధర్ తిరిగివచ్చి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంటిలో రూ.4.42 లక్షల నగదుతోపాటు బంగారు ఉంగరాలు, చెవి దిద్దులు, మాటిల జత, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు శ్రీధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేశారు.

19-7Pg7exHMNWJQE_19-7Pg7exHMNWJQE.qxd 18/Jul/26 11:52 PM Page 1



# అనారోగ్యం కారణంగానే విరాళమిచ్చారా?

## గోశాలలో మగ గుర్రం మృతి



**తిరుమల,జులై 18ప్రభాతవార్తప్రతినిధి:** ఐదురోజులు క్రిందట విరాళం రూపంలో తిరుపతి ఎస్వీగోశాలకు చేరిన మగగుర్రం అనారోగ్యంతో శనివారం సాయంత్రం ప్రాణాలు విడిచింది.

దాత విరాళంగా ఇచ్చిన రోజుకే అది ఆనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసే ఇలా చేశారా అనే విమర్శనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే గోశాలలో సమస్యలు గాడిన పడుతున్న సమయంలో విరాళంగా వచ్చిన మగగుర్రం మృతితో సంచలనంగా మారింది.

ఈనెల 13న గోశాలకు చేరిన వెంటనే గుర్రాన్ని క్వారంటైన్‌లో ఉంచి రక్తం, పేడ నమూనాలను తిరుపతిలోని రాష్ట్ర స్థాయి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలకు పంపించారు. ప్రాథమిక పరీక్షల్లో గుర్రం దీర్ఘకాలిక కాలేయం, మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడైందని ఎస్వీ గోశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.ఎన్. శివకుమార్ తెలిపారు. గుర్రం గోశాలకు వచ్చినప్పటి నుండి మేత, నీరు సరిగా తీసుకోకపోవడం, మాటిమాటికి కూర్చోవడం, పడుకోవడం, దొర్లడం, తిరిగి లేవడం వంటి అస్వస్థత లక్షణాలను గమనించిన వెంటనే గోశాల పశువైద్యుల పర్యవేక్షణలో నిపుణుల సూచనల మేరకు అవసరమైన వైద్య చికిత్సలు, ప్రత్యేక సంరక్షణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. అన్ని విధాలుగా వైద్య చికిత్సలు అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మెరుగుదల కనిపించక, చికిత్సకు స్పందించకుండా శనివారంగుర్రం మృతి చెందినట్లు తెలిపారు.

మధురైకి చెందిన దాత షణ్ముగం వెంటనే ఎస్వీ గోశాలకు వచ్చారని, ఆయన సమక్షంలోనే గుర్రం మృతి చెందిందని పేర్కొన్నారు. శవపరీక్ష అనంతరం శాస్త్రీయ పద్ధతిలో ఖననం వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయానికి చెందిన వైద్య నిపుణుల బృందం సమక్షంలో శవపరీక్ష నిర్వహించారు. ప్రాథమికంగా గుర్రం దీర్ఘకాలిక కాలేయం, హృదయం, మూత్రపిండాల వ్యాధులతో బాధపడినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. తుది శవపరీక్ష నివేదిక అందిన అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణం వెల్లడికానుందని పేర్కొన్నారు.

శవపరీక్ష అనంతరం గుర్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు ఎస్వీ గోశాల అధికారులు తెలిపారు.



## సోషల్ మీడియా విషప్రచారంపై సాయి రూప్ ఆవేదన

### ఎన్టీర్ మా దైవం...ఆయన పేరుతోనే సేవా కార్యక్రమాలు

**తిరుపతిరూరల్,జూలై 18 ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న విషప్రచారంపై 'రా ఎన్‌టిఆర్' వ్యవస్థాపక ప్రతినిధి సాయిరూప్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత వారంరోజులుగా జరుగుతున్న ప్రచారం వల్ల మానసికంగా తీవ్ర కలత చెందినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నందమూరి అభిమానులను వినయపూర్వకంగా క్షమించమని కోరారు. శనివారం తాజ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేము చేపడుతున్న సేవా కార్యక్రమాలు పూర్తిగా సమాజహిత కోసమే...దాదాపు 10 సంవత్సరాల క్రితం జరిగిన ఒక ఆడియో వేడుకలో అభిమానులకు సేవా కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపే మాకు ప్రేరణగా మారిందన్నారు. మహానటుడు నందమూరి తారక రామారావు సేవా స్ఫూర్తే మా మార్గదర్శకం అని సాయిరూప్ అన్నారు. రా ఎన్‌టిఆర్ ఆధ్వర్యంలో మూడు ప్రధాన కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. 'సేవతో యువ జాగృతి-2500' యువతలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు. 'మన ఊరు - మన బాధ్యత' గ్రామాల్లో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రైతు సదస్సుల ద్వారా వ్యవసాయ రంగానికి దోహదం చేస్తామని చెప్పారు. 'ఊరి మాట - పాలకుల దాకా' ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వేదికగా ఈ కార్యక్రమం పని చేస్తుందని వెల్లడించారు. మొదటి దశలో ఎన్టీర్ జిల్లాలో ఈ సేవా కార్యక్రమాలను ప్రారంభించి, అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు.

**ఎన్‌జిఓగా సేవలు ...సిఎస్ఆర్ లక్ష్యాలు:**

చట్టపరంగా నమెదు చేసిన ఎన్‌జిఓగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బుల్టి నిధులతో దాదాపు రూ.100 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. ప్రతి రుపాయి ఖర్చులో పారదర్శకత పాటిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్, పవన్‌రెడ్డి, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గన్నవరం విమానాశ్రయంలో ఏటిసి టవర్

### ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**గన్నవరం(కృష్ణా), జులై 18, ప్రభాతవార్త :** గన్నవరం విమానాశ్రయంలో నూతనంగా నిర్మించిన ఏటిసి టవర్ కమ్ టెక్నికల్ బ్లాక్‌ను కేంద్రపౌరవిమాన 25వతేదీ నుండి ఇంటర్నేషనల్ కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో విమానాశ్రయ అధికారులు పాల్గొన్నారు.



విమానాశ్రయంలో మొక్కనాటుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, యంపిలు చిన్ని, బాలశౌరి తదితరులు

యానశాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు విజయవాడ యంపి కేశినేని చిన్ని, బందరు యంపి వల్లభనేని బాలశౌరిలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాబోయే దసరా నాటికి టెర్మినల్ నిర్మాణం పూర్తికావాలని ఆదేశించారు. విమానాశ్రయం ఆవరణలో మొక్కలు నాటారు. యంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ అగష్టు 13 వతేదీ గన్నవరం-వారణాసి విమానసర్వీసు ప్రారంభంకానుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గన్నవరం నుండి ఇతర పట్టణాలకు విమనసర్వీసులు పెంచనట్లు తెలిపారు. ఈనెల

**రహదారి అభివృద్ధిపనుల ప్రారంభం :** విజయవాడ భారతీనగర్ గురునానక్ కాలనీల్లో రూ.3.02కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎండ్‌టుఎండ్ రహదారి అభివృద్ధి పనులను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శనివారం ప్రారంభించారు. వాయుకాలుష్యం తగ్గించేందుకు 15వ ఆర్థికసంఘం ఎయిర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిధులతో ఈపనులు చేపట్టారు. ఈకార్యక్రమంలో విజయవాడ యంపి కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, ఏపిస్టేట్ కుమ్మరి శాలివాహన కార్పోరేషన్ చైర్మన్ ఈశ్వర్, విజయవాడ నగరపాలకసంస్థ చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.



## మురళీ మోహన్‌కు ఐఎంఎ కమ్యూనిటీ సర్వీస్ అవార్డు

### ఢిల్లీలో అందజేసిన రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్

**విశాఖపట్నం, జులై 18 ప్రభాత వార్త:** ఆంధ్రా వైద్య కళాశాల 1986 బ్యాచ్ పూర్వ విద్యార్థి డాక్టర్ ఎంవీవీ మురళీ మోహన్ ను ప్రతిష్ఠత్మాక ఐఎంఏ సామాజిక వైద్య సేవా అవార్డు వరించింది. భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ)సామాజిక సేవల విభాగం లో డాక్టర్ మురళి మోహన్ చేసిన వైద్య సేవలకు గుర్తింపుగా రాష్ట్రం నుంచి ఆయనను ఈ అవార్డు కు ఎంపిక చేసింది.న్యూ ఢిల్లీలోని కానిస్టట్యూషన్ క్లబ్ లోశనివారం భారత జాతీయ వైద్యుల సంఘం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలోడాక్టర్ మురళీ మోహన్ కు ప్రతిష్టాత్మక కమ్యూనిటీ సర్వీస్ అవార్డు విభాగంలో అవార్డు ను భా రత రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మురళీ మోహన్ సామాజిక వైద్య సేవలు అజరామరం అని భారత రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ కొనియాడారు. రాజ్యసభ సభ్యులు మయాంక్ భాయ్ జె. నాయక్ హాజరైన ఈ కార్యక్రమానికి ఐఎం ఎ అధ్యక్షులు డాక్టర్ అనిల్ జె. నాయక్ అధ్యక్షత వహించారు, డాక్టర్ దిలీప్ బన్సాలియా డాక్టర్ సరాసరి దత్తా, పియూష్ జైన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.అవార్డు గ్రహీత డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ తాను నిర్వహిస్తున్న వైద్య సేవలును గుర్తించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.



## క్వాంటం టెక్నాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్

### పరిశోధనలకు కేంద్రంగా ఎస్వీయూను తీర్చిదిద్దే దిశగా చర్యలు: విసి ఆచార్య టాటా నరసింగరావు

**తిరుపతి విద్య, జూలై 18 ప్రభాతవార్త:** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ హాల్‌లో శనివారం క్వాంటం టెక్నాలజీస్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. రూసా ఫేజ్2 ఆధ్వర్యంలోని యస్వీయూ-క్వాంటం ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, అమరావతి క్వాంటం వ్యాలీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.వైస్ ఛాన్సలర్ ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ, అమరావతి క్వాంటం వ్యాలీ దార్శనికతకు అనుగుణంగా యస్వీ యూను క్వాంటం టెక్నాలజీ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాచీన భారతీయ జ్ఞానం నుంచి ఆధునిక క్వాంటం బిట్స్ వరకు విజ్ఞాన పరిణామాన్ని వివరిస్తూ విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. వరదరాజన్ మాట్లాడుతూ, క్వాంటం సైన్సెస్‌లో ప్రాథమిక పరిశోధనల కోసం ప్రత్యేక మోలిక సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు.

తిరుపతి విద్యా కేంద్రంలోని వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, అమరావతి క్వాంటం వ్యాలీ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీ, రాకెట్రీ, ఎస్‌టీఈఎం విద్య, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలను పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు భారతదేశపు ఫోర్‌క్విబిట్ క్వాంటం వ్యవస్థను ప్రత్యక్షంగా వీక్షిం చేందుకు అమరావతి క్వాంటం వ్యాలీని సందర్శించాలని సూచించారు. అమరావతి క్వాంటం వ్యాలీ సలహాదారు డాక్టర్ వెంకటస్వామి కీలకోపన్యాసం చేస్తూ, పురాణ గాథల ఉదాహరణలతో సూపర్ పొజిషన్, ఇంటర్‌ఫియరెన్స్, ఎంటాంగిల్‌మెంట్, క్వాంటం టన్నెలింగ్, డబుల్‌స్లిట్ ప్రయోగం వంటి క్లిష్టమైన క్వాంటం భావనలను సరళంగా వివరించారు. జాతీయ క్వాంటం మిషన్ ద్వారా ప్రపంచ క్వాంటం రంగంలో భారత్ అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు యువత పరిశోధనలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, రూసా కోఆర్డినేటర్ ఆచార్య కె.వి. సుచరితతో పాటు సైన్స్, ఇంజినీరింగ్, ఎంసీఏ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు

# జమ్మూకాశ్మీర్‌లోని ఎల్‌ఒసి వద్ద కాల్పులు

### ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భగ్నం చేసిన భారత్ సైన్యం

**న్యూఢిల్లీ, జులై 18:** జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి శుక్రవారం రాత్రి దాదాపు రెండు గంటల పాటు భారీ సరిహద్దు కాల్పులు చోటుచేసుకున్నాయి. పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్రవాదులను భారత్‌లోకి చొరబాటుకు పంపే ప్రయత్నాన్ని భారత సైన్యం అప్రమత్తంగా గుర్తించి విజయ వంతంగా తిప్పి కొట్టిందని అధికార వర్గాలు తెలిపాయి. అధికారుల వివరాల ప్రకారం, పాకిస్థాన్ వైపు నుంచి ఎలాంటి రెచ్చగొట్టింపు లేకుం డానే కాల్పులు ప్రారంభ మయ్యాయి. సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న భారత సైనికులు అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో వెంటనే ప్రతిదాడికి దిగారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు.ఘటన అనంతరం శనివారం ఉదయం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడే ప్రయత్నం చేశారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. సరిహద్దు ప్రాంతమంతా ప్రస్తుతం అత్యంత అప్రమత్త నిఘాలో ఉంచినట్లు అధికారులు తెలిపారు. భద్రతా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, పాకిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత రాజకీయ, భద్రతా సంక్షోభాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఎల్‌ఓసీ వెంట కాల్పులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌ఖి అనంతరం ఎల్‌ఓసీ వద్ద చోటుచేసుకున్న తొలి ప్రధాన కాల్పుల విరమణ ఉల్లంఘన ఇదేనని అధికారులు పేర్కొన్నారు. ఇంతకుముందు ఎనిమిది నుంచి పది రౌండ్ల కాల్పులతో కూడిన చిన్నచిన్న ఘటనలు మాత్రమే నమోదయ్యాయి.

## సిపిగెట్-2026 ప్రాథమిక కీ విడుదల

### 20 వరకు అభ్యంతరాల స్వీకరణ

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 9 యూనివర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ)-2026 పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేసినట్టు సీపీగెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేందర్ కట్ల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీగెట్‌కి సంబంధించిన ప్రాథమిక (ప్రొవిజనల్) కీని అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు ప్రాథమిక కీపై అభ్యంతరాలు, సందేహాలను ఈ నెల 20 మధ్యాహ్నం 1.40 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ప్రశ్నకు రూ.200 రుసుము చెల్లించి అభ్యంతరాలను సమర్పించవచ్చని, నిర్ణీత గడువు అనంతరం అందిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని ఆయన ప్రకటనలో స్పష్టం చేశారు.

# విద్యుత్ శాఖలో నకిలీల కలకలం

### విచారణ వేగవంతం చేసిన ఎస్పీడిసిఎల్

### ఆంధ్రలో ఇప్పటికే 69 మంది తొలగింపు

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:**విద్యుత్ శాఖలో నకిలీ సర్టిఫికెట్లు కలకలం సృష్టిస్తున్నాయి. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన ఆరోపణలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్పీడీసీఎల్) సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఎపిఎస్పీడీసీఎల్) విచారణను ముమ్మరం చేశాయి. ఏపీలో ఇప్పటికే నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లు సమర్పించి విధుల్లో చేరిన 69 మంది షిఫ్ట్ ఆపరేటర్లను గుర్తించి ఇటీవల కాలంలో తొలగించారు. ఈ ఉద్యోగులు అసలు ఐటీఐ చదవకుండానే దొంగ సర్టిఫికెట్లు ఇచ్చి షిఫ్ట్ ఆపరేటర్లుగా చేరినట్లు తేలింది. ఉద్యోగుల పూర్వాపరాలను పరిశీలించేందుకు ఎపిఎస్పీడీసీఎల్ యాజమాన్యం కీలక ఆదేశాలు జారీ చేసింది. సిబ్బంది అంతా మీసేవ ద్వారా పోలీస్ ఎన్‌ఓసీ సమర్పించాలని, క్రిమినల్ రికార్డులు ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. తెలంగాణలోనూ అలాంటి మోసాలు జరిగాయన్న అనుమానాలతో అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో సైతం ఫేక్ సర్టిఫికెట్లతో కొందరు ఉద్యోగం పొందారన్న సమాచారంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అప్రమత్తమైంది. అనుమానిత సర్టిఫికెట్లపై సర్కిల్ స్థాయి పరిశీలన కమిటీలను ఏర్పాటు చేసి లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఇందుకుగాను సర్కిల్ స్థాయిలో ఐదు గురు సభ్యులతో కమిటీలు వేసింది. ఈ కమిటీలో డీఈ చైర్మన్‌గా, ఎస్ఏఓ, డీఈ (డీపీఈ), ఏపీటీఎస్పీ, కార్పొరేట్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ సెక్రటరీని సభ్యులుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ కమిటీ అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది అందజేసిన సర్టిఫికెట్లను మరోసారి పరిశీలించనుంది. కొంతమంది సిబ్బంది పదోన్నతులతో పాటు ఎక్కువకాలం సర్వీసులో కొనసాగేందుకు బర్త్ సర్టిఫికెట్లలో మార్పులు చేశారనే విమర్శలున్నాయి. శివారు సర్కిళ్లలో కొంతమంది నకిలీ ఐటీఐ సర్టిఫికెట్లతో జేఎల్ఎం లుగా, ఓ అండ్ ఎం సిబ్బంది డిప్లమా సర్టిఫికెట్లతో సబ్‌ఇంజినీర్లుగా, కొంతమంది సబ్ ఇంజనీర్లు ఏఈలుగా పదోన్నతులు పొందేందుకు నకిలీ సర్టిఫికెట్లు పెట్టారనే ఆరోపణలున్నాయి.

## కెసిఆర్ పాలనలో నిరుద్యోగులకు పాతర

### తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో కొలువుల జాతర

### ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** నిరుద్యోగుల గురించి మాట్లాడే హక్కు బిఆర్ ఎస్ నేతలకు లేదనీ గత పదేళ్ల రాక్షస పాలనలో, నిరుద్యోగుల ఉసురుపోసుకున్నది మీరేననీ ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మీ హయంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించిన 16 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయనీ ఆరోపించారు. ఆత్మహత్యలు చేసుకున్న నిరు ద్యోగుల కుటుంబాలను మీరు ఏనాడు పరామర్శించ లేదు, పట్టించు కోలేదనీ ఆవేదన చెందారు. రాజకీయ స్వార్థం కోసం, ఇవాళ నిరుద్యోగులపై బిఆర్ఎస్ నేతలు కపట ప్రేమ చూపిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో సానుకూలంగా ఉంది.ఇప్పటికే 80వేల ఉద్యోగాలు భర్తీ చేసింది, మరో 30 వేల ఉద్యో గాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉందనీ వివరించారు. నేను ప్రభుత్వానికి, నిరుద్యోగుల మధ్య వారధిగా ఉంటాను.మీ ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అన్నారు.దయచేసి నిరుద్యోగులు బిఆర్ఎస్ ట్రాప్ లో పడొద్దు అని కోరారు.నేను కూడా మీతో ఉద్యమాలు చేసిన వ్యక్తినే, గతంలో నిరుద్యోగులు, కలుస్తామంటే కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని బిఆర్ఎస్ నేతలు, ఇవాళ అధికారం పోగానే, నిరుద్యోగుల పంచానా చేరారనీ ఎద్దేవా చేశారు.



ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ సంఘం నేతలు.

## రాయలసీమ బలిజలకు ఎమ్మెల్సీ ఇవ్వాలి!

రేణిగుంట,జులై 17 ప్రభాతవార్త: రాయలసీమ జిల్లాల్లోని బలిజలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని జాతీయ కాపు సంఘం కమిటీ జాతీయ ప్రచార కార్యదర్శి గోపి రాయల్ డిమాండ్ చేశారు. రేణిగుంట పట్టణంలో శనివారం ఇటీవల మృతి చెందిన కాపు ఉద్యమ నేత మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి బలిజ సంఘం నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపి రాయల్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం బలిజలకు చేసిన సేవలను కొనియాడారు. ముద్రగడ మృతి బలిజ కాపు కులాలకు తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పదవీకాలం పూర్తవుతున్న గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలలో రాయలసీమలోని బలిజలకు ఒక ఒక స్థానానికి నామినేట్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాయలసీమలో 52 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా బలిజలకు ఒక్క తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలకు న్యాయం జరగాలంటే కనీసం గవర్నర్ కోటలోని ఎమ్మెల్సీ అయినా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు త్యాగరాజులు, శ్రీనివాసులు, బసవ పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి మహిళ నగ్నంగా వీధుల్లో పరుగులు

### పీర్జాదిగూడలో కలకలం

### చెరువులో మృతదేహం లభ్యం

**హైదరాబాద్ (ఉప్పల్), జులై 18, ప్రభాతవార్త :** నగర శివారులోని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని పీర్జాదిగూడ శంకర్‌నగర్‌లో ఒక యువతి అనుమానాస్పద మృతి స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. అర్ధరాత్రి నగ్నంగా వీధుల్లో పరుగులు తీసిన ఆ యువతి, అనంతరం సమీపం లోని ఆలయం నుంచి విగ్రహాన్ని తీసుకెళ్లి కొద్దిసేపటికే పక్కనే ఉన్న పీర్జాదిగూడ చెరువులో శవంగా బయటపడింది. ఆమె మృతదేహం చెరువులో లభించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, గజిత్‌నగర్ మండలం, దేవులపల్లి గ్రామానికి చెందిన వక్కలగడ్డ తేజస్విని (27), తన తల్లి అరుణ (52)తో కలిసి పీర్జాదిగూడ శంకర్ నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. తేజస్విని తండ్రి వక్కలగడ్డ ఈశ్వరరావు (55) విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తేజస్విని గతంలో బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసి ప్రస్తుతం తల్లి వద్దే ఉంటున్నది. కాగా తల్లి, కూతుళ్లు కొంతకాలంగా ప్రత్యేక యాప్ ద్వారా అద్దె ఇళ్లలో నివసిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట కాప్రా చెరువు సమీపంలో నివసించి, అనంతరం పీర్జాదిగూడ శంకర్‌నగర్‌కు మారినట్లు పోలీసులు తెలిపారు.

కాగా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత, శనివారం తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో తేజస్విని తన తల్లిని ఇంట్లో ఉంచి, బయట నుంచి తాళంవేసి నగ్నంగా వీధుల్లో పరుగులు తీసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. అనంతరం సమీపంలోని ఓ ఆలయానికి వెళ్లి అక్కడి అమ్మవారి విగ్రహాన్ని, చీరను తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. ఈ దృశ్యాలు సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అనంతరం కొద్దిసేపటికే పక్కనే ఉన్న పీర్జాదిగూడ చెరువులో తేజస్విని మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చెరువులో పడేసినట్లు భావిస్తున్న ఆలయ విగ్రహం కోసం డిఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**రక్తంతో పీడకలలు వస్తున్నాయని..**

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అకస్మాత్తుగా మానసిక సమస్యలతో బలవన్మరణం చెందడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా తేజస్విని మానసిక రోగంతో బాధపడుతున్నదని, తల్లి, తండ్రి విడివిడిగా ఉంటున్నారని, అనారోగ్యంతోనే ఆత్మహత్య చేసుకుందని సిఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కీలక పోస్టుల్లో తెలంగాణ కేడర్ అధికారులు

**హైదరాబాద్, జులై 18, ప్రభాతవార్త:** కేంద్ర సిబ్బంది నియామక పథకం కింద కీలక నియామకాలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఐఆర్ఎఎస్ అధికారి ఇషాన్ శర్మలను కేంద్ర మంత్రిత్వ శాఖలకు నియమించినట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డిపిటి) జారీ చేసిన రెండు వేర్వేరు ఉత్తర్వులలో పేర్కొంది. ఓడరేవులు, నౌకాయా నం, జలమార్గాల మంత్రిత్వ శాఖ పరిధిలోని ముంబైలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్‌లో డైరెక్టర్ స్థాయి డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పాటిల్ నియామకాన్ని సమర్థ అధికారి ఆమో దించినట్లు సిబ్బంది, శిక్షణ శాఖ ఒక ఉత్తర్వులో తెలిపింది.

19-07pg10exHMNWJQE_19-07pg10exHMNWJQE.qxd 18/Jul/26 11:55 PM Page 1



# లార్డ్స్‌లో లాస్ట్ ఫైట్.. సిరీస్ ఎవరిది?



## రోహిత్‌పై అందరి దృష్టి *నేడు భారత్, ఇంగ్లాండ్ మూడో వన్డే

**లార్డ్స్, జులై 18:** మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లాండ్ మధ్య మూడో, నిర్ణయాత్మక వన్డే నేడు క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్‌లో జరగనుంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో గిల్ సేన నెగ్గగా, కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో బ్రూక్స్ సేన గెలుపొందింది. చెరో మ్యాచ్ గెలిసి సమవుజ్జీగా ఉన్నాయి. టీ20 సిరీస్ చేజార్చుకున్న టీమిండియా.. వన్డే సిరీస్‌నైనా చేజిక్కించుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో అందరి కళ్లూ భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపైనే. కారణం లార్డ్స్ వన్డే రోహిత్‌కు చివరిదని.. తర్వాత రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే ప్రచారం జోరుగా జరగడమే. దీనిని బీసీసీఐ ఖండించినా.. మ్యాచ్ ముగిశాక ఏదైనా సంచలన ప్రకటన రావొచ్చొన్న అంచనాతో లార్డ్స్ వన్డేకు క్రేజ్ మరింత పెరిగింది. గత రెండు మ్యాచ్‌ల్లో 11, 26 స్కోర్లకే వెనుదిరిగి నిరాశపరిచిన హిట్‌మ్యాన్.. బ్యాటింగ్‌కు అనుకూలించే లార్డ్స్ పిచ్‌పై చెలరేగి భారత్‌కు విజయాన్ని అందించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

టీమిండియా బ్యాటింగ్‌ను మరింత పటిష్టం చేసే దిశగా రాహుల్‌ను తుది జట్టులో ఆడించే అవకాశం ఉంది. ఇక కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పరుగుల వేటలో ఉండడం, విరాట్‌కోహ్లీ గత మ్యాచ్‌లో బ్యాటింగ్ గాడిలో పడడం భారత్‌కు అనుకూలించే అంశం. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్ నిలకడగా రాణిస్తున్నాడు. ఇషాన్ కిషన్ బ్యాట్‌కు పనిచెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. వాషింగ్టన్ సుందర్ గాయంతో కుల్‌దీప్‌కు తుది జట్టులో చోటు దక్కొచ్చు. ఇక జస్‌ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని బౌలింగ్ డిపార్ట్‌మెంట్ చక్కగా ఇంగ్లాండ్‌ను కట్టడి చేస్తూ ఆకట్టుకుంటోంది. బుమ్రా, ప్రసిద్ధ్‌కృష్ణలతో పేస్ అటాక్‌కు అక్షర్ స్పిన్‌తో తోడుగా నిలుస్తున్నాడు.

ఇక ఇంగ్లాండ్ గత మ్యాచ్‌లో గెలిచి జోరు మీద ఉంది. నిలకడగా రాణిస్తున్న జో రూట్ ఆ జట్టుకు ప్రధాన బలంగా మారాడు. ఇక బెన్ డకెట్ ఫామ్ ఆందోళనపరుస్తున్నా.. జాకబ్ బెతెల్, జాస్ బట్లర్, కెప్టెన్ హారీ బ్రూక్‌లతో కూడిన బ్యాటింగ్... సొంతగడ్డపై చెలరేగడానికి చూస్తోంది. జోఫ్రా అర్చర్, జోష్ టాంగ్, సామ్ కుర్రాన్ పేస్ త్రయానికి అండగా అదిల్ రషీద్, డాసన్ నిలుస్తున్నారు.

లార్డ్స్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కనిపించినా, తొలి గంటలో పేసర్లుకు ఇక్కడ చక్కని స్వింగ్ లభిస్తుంది. ఆ తర్వాత బ్యాటింగ్ సులభమవుతుంది. టాస్ కూడా కీలకంగా మారనుంది. టాస్ నెగ్గిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే అవకాశాలున్నాయి.

# జపాన్ ఓపెన్ టైటిల్ దిశగా సింధు

## గాయంతో చెన్ రిటైర్డ్ * రెండేళ్ల తర్వాత తొలిసారి

**టోక్యో, జులై 18:** రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్, భారత స్టార్ షట్లర్ పీవీ సింధూ చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్ చేరిన తొలి భారత మహిళా షట్లర్‌గా రికార్డు నమోదు చేసింది. క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థి నుంచి వాకోవర్ లభించిన సింధూ.. సెమీఫైనల్లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫీయ్(చైనా)తో తలపడింది.సింధూ21-19, 15-10తో ఆధిక్యంలో ఉన్న దశలో చైనా షట్లర్ గాయంతో గేమ్ మధ్యలోనే వైదొలిగింది. దీంతో సింధూ ఫైనల్లో అడుగుపెట్టింది. రెండేళ్ల తర్వాత ఫైనల్ చేరడం సింధూకు ఇదే తొలిసారి. 2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో సింధూ ఫైనల్ చేరి టైటిల్ సాధించింది. ఫైనల్లో జపాన్ ప్లేయర్ అకనె యమగుచితో తలపడనుంది. రెండో సెమీఫైనల్లో యమగుచి... 9-21, 21-16, 21-14తో పుత్రి కుసుమ వర్దానిపై చెమటోడ్చి నెగ్గింది.

31 ఏళ్ల సింధూ.. చైనాకు చెందిన టోక్యో ఒలింపిక్స్ విజేత చెన్ యుఫేపై ఆరంభం నుంచే ఆధిక్యం చాటింది. పదునైన నెట్ ప్లేతో చైనీస్ క్రీడాకారిణిపై ర్యాలీలతో శాసించింది. అద్భుతమైన డ్రాప్ షాట్, ఆ వెంటనే బలమైన స్మాష్‌తో సింధూ 11-7తో ఆధిక్యాన్ని సాధించింది. చెన్ తిరిగి గాడిలో పడి స్మాష్‌లతో విరుచుకుపడి సింధూ ఆధిక్యాన్ని 15-17కు తగ్గించింది. ఈ దశలో చెన్ కొట్టిన కొన్ని స్మాష్‌లు నెట్‌కు తగలగా, మరోవైపు సింధూ రెండు శక్తివంతమైన స్మాష్‌లతో తొలి గేమ్‌ను 21-19తో నెగ్గి శుభారంభం చేసింది.

రెండో గేమ్‌లో పీవీ సింధూ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లగా... చెన్ పుంజుకుని 3-4కు తగ్గించింది. సింధూ క్రాస్ కోర్ట్ స్మాష్‌తో 15-10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ దశలో చెన్ తొండకండరాలు పట్టేయడంతో బాగా ఇబ్బంది పడింది. చివరకు గేమ్ మధ్యలోనే చెన్ రిటైర్ కావడంతో సింధూ ఫైనల్లో ప్రవేశించింది. ఆదివారం టైటిల్ పోరు జరగనుంది. ఇందులోనూ గెలిస్తే జపాన్ ఓపెన్‌ను సొంతం చేసుకున్న తొలి భారత మహిళా షట్లర్‌గా పీవీ సింధూ అవతరిస్తుంది.




### ఒక్కో టికెట్ 27 లక్షలు
### ప్రీమియం టికెట్ 1.6 కోట్లు

**న్యూయార్క్, జులై 18:** సాకర్ వరల్డ్ కప్ ఫైనల్‌పై అంచనాలు పెరగడంతో టికెట్లకు భారీ డిమాండ్ నెలకొంది. 39 ఏళ్ల మెస్సీ, 18 ఏళ్ల లామిన్ యామల్ ఆటను ప్రత్యక్షంగా చూసేందుకు ఫుట్‌బాల్ ఫ్యాన్స్ పోటీపడుతుండడంతో టికెట్స్ హైప్ తరువాతి స్థాయికి చేరింది. టికెట్ ధరలు ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొడుతున్నాయి. మెట్‌లైఫ్ స్టేడియంలో సీటు సంపాదించుకోవడానికి ఎంత ఖర్చైనా సాకర్ లవర్స్ పెట్టేందుకు వెనకాడటం లేదు.

ఫైనల్ మ్యాచ్ ఒక్కో టికెట్ ధర దాదాపు 27 లక్షలు పలుకుతోంది. స్టేడియానికి అత్యంత దగ్గరగా ఉండే వీఐపీ, ప్రీమియం సీట్ల ధరలు ఏకంగా 1.6 కోట్లుగా ఉన్నాయి. 2022 ఖతార్ వరల్డ్ కప్ ఫైనల్లోను టికెట్ల రేట్ల పరంగా ఈ వరల్డ్ కప్ రికార్డులు బద్దలు కొట్టింది. ఫిఫా అధికారికంగా నిర్ణయించిన అసలు ధరలే సీటింగ్ కేటగిరీని బట్టి 2,030 నుంచి 6,730 డాలర్ల వరకు ఉన్నాయి. అర్జెంటీనా స్టార్ ఆటగాడు లియోనెల్ మెస్సీకి ఇది చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావడం కూడా టికెట్ల ధరలకు రెక్క లొచ్చాయి. టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవడంతో ఫైనల్ మ్యాచ్‌కు మెట్‌లైఫ్ స్టేడియం హౌస్‌ఫుల్ కావడం ఖాయం.

# కప్ కోసం దిగ్గజాల పోరు

*ఫీఫా ప్రపంచకప్ తుది సమరానికి చేరుకుంది. కొత్త ఛాంపియన్ ఎవరో కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.న్యూయార్క్‌లోని న్యూజెర్సీ వేదికగా డిపెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరో పియన్ ఛాంపియన్ స్పెయిన్ తుది పోరుకు సిద్ధమయ్యాయి. గ్రూప్‌లో అగ్రస్థానంతో పాటు రౌండ్ 32లో కాబో వెర్డేను, ప్రీకార్టర్స్‌లో ఈజిప్ట్‌ను, క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌ను, సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఓడించి అర్జెంటీనా ఫైనల్‌కు వచ్చింది. ఇక స్పెయిన్ గ్రూప్ స్టేజ్‌లో సౌదీ అరేబియా, ఉరుగ్వేలపై, రౌండ్ 32లో ఆస్ట్రియాపై, ప్రీ క్వార్టర్స్‌లో పోర్చుగల్‌పై, క్వార్టర్ ఫైనల్లో బెల్జియంపై, సెమీఫైనల్లో ఫ్రాన్స్‌పై నెగ్గి తుది సమరానికి చేరుకుంది. ఫైనల్ మ్యాచ్ మెస్సీ అనుభవమా? యమాల్ యువ తుఫానా? అన్నట్లుగా ఆసక్తి రేపు తోంది. కోట్లాది అభిమానుల దృష్టంతా ఇపుడు ఈ ఒక్క మ్యాచ్‌పైనే నిలిచింది.*




# అర్జెంటీనా, స్పెయిన్ సై

* మెస్సీ మ్యాజికా? యమాల్ యువ జోషా?
* అందరూ స్టార్లే, సమష్టితత్వమే స్పెయిన్ బలం
* నేటి అర్ధరాత్రి 12.30 గంటలకు మ్యాచ్

**న్యూయార్క్, జులై 18:** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, యూరోపియన్ దిగ్గజం స్పెయిన్ ప్రపంచకప్ ఫైనల్లో తలపడనున్నాయి. అనుభవం, ప్రతిభ, వ్యూహాలు, స్టార్ ఆటగాళ్లు... అన్నీ ఒకే వేదికపై ఢీకొట్టనున్న ఈ పోరు ఫుట్‌బాల్ చరిత్రలో మరో చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచే అవకాశముంది. పెద్ద మ్యాచ్‌ల అనుభవం అర్జెంటీనా ప్రధాన బలం. కౌంటర్ అటాక్‌లో అత్యంత ప్రమాదకర జట్టు. మిడ్‌ఫీల్డ్‌లో బంతిపై నియంత్రణతో పాటు వేగవంతమైన మార్పులు తీసుకురాగలదు. గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ పెనాల్టీలు, కీలక సేవ్‌లలో ప్రత్యేక నైపుణ్యం కలవాడు. లియోనెల్ మెస్సీ, జులియస్ ఆల్వారెజ్, అలెక్సిస్ మాక్ అలిస్టర్ అర్జెంటానా గెలుపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే స్పెయిన్ దుర్భేధ్యమైన డిఫెన్స్‌ను అర్జెంటీనా ఎంతవరకు ఛేధిస్తుందనడంపైనే ఆ జట్టు విజయావకాశాలుంటాయి. చివరి నిమిషాల్లో గోల్స్ మ్యాజిక్ చేస్తున్న అర్జెంటీనా తుదిపోరులోనే హాట్ పేవరెట్‌గానే బరిలోకి దిగుతోంది. వరుసగా రెండోసారి కప్ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది. ఇది సాధిస్తే బ్రెజిల్ సరసన నిలుస్తుంది.

**అభేద్యమైన డిఫెన్స్‌తో స్పెయిన్ సవాల్**

యూరోపియన్ దిగ్గజం స్పెయిన్‌ను తక్కువ అంచనా వేయలేం. మెస్సీ చుట్టూ అర్జెంటీనా, ఎంబాపె చుట్టూ ఫ్రాన్స్, రొనాల్డో చుట్టూ పోర్చుగల్‌లా కాకుండా సమిష్టితత్వమే స్పెయిన్ బలం. ఆ జట్టులో ప్రతి ఒక్కరూ స్టారే. ఎవరు ఏపాత్ర పోషించాలనేది ముందే నిర్ణయమౌతుంది. అందుకు తగ్గట్లుగానే మైదానంలో దూసుకుపోతారు. లామెనె యమాల్ బంతిని పాస్ చేయడంతో పాటు గోల్‌పోస్ట్ వైపు తీసుకెళ్లడంలో నేర్పరి. గావి, మెరినో, ఓల్మో, నికో, మునోజ్ లాంటి ప్రతిభావంతుల బలం స్పెయిన్ సొంతం. స్పెయిన్ ప్రధాన బలం బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచే ఆటతీరు. వేగవంతమైన వింగ్ దాడులు, కచ్చితమైన పాస్‌లు. యువ ఆటగాళ్ల ఉత్సాహం, జట్టు సమన్వయం అద్భుతం. నిరంతర పాస్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

సాకర్ వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌ను కాబో వెర్డేతో డ్రా చేసుకున్నా...ఆ వెంటనే లోపాల నుంచి పాఠాలు నేర్చుకుంది. ఆ తర్వాత నుంచి విజయాలతో దూసుకు వచ్చింది. స్పెయిన్ అభేద్యమైన డిఫెన్స్‌ను తట్టుకుని కేవలం ఒక్క గోల్‌ను మాత్రమే ప్రత్యర్థులు చేయగలిగారు. ఫైనల్‌కు వచ్చిన తొలిసారే ఫిఫా కప్ అందుకున్న స్పెయిన్.. రెండోసారి ఫైనల్‌కు వచ్చింది. ఈ సారి కూడా కప్ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది.

### కామన్ వెల్త్ క్రీడల ఫ్లాగ్ బేరర్స్‌గా
## మీరాచాను, లవ్లీనా

**న్యూఢిల్లీ, జులై 18:** భారత దిగ్గజ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను, మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌కు అరుదైన గౌరవం దక్కింది. గ్లాస్కో కామన్వెల్త్ క్రీడల ప్రారంభోత్సవంలో వీరిద్దరూ భారత ఫ్లాగ్ బేరర్స్‌గా ఎంపికయ్యారు. భారత ఒలింపిక్ సంఘం ఈ విషయాన్ని వెల్లడించింది.

స్కాట్లాండ్లోని గ్లాస్కోలో కామన్వెల్త్ క్రీడలు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయి. అగస్టు2 వరకు జరుగుతాయి. భారత్ నుంచి మొత్తం 124 మంది అథ్లెట్లు 13 క్రీడాంశాల్లో బరిలోకి దిగుతున్నారు. ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి మీరాబాయి, లవ్లీనా నాయకత్వం వహిస్తారు. జాతీయ జెండా చేతబూని భారత బృందాన్ని నడిపించనున్నారు. మీరాబాను, లవ్లీనా భారత క్రీడ రంగానికి చేసిన అద్భుతమైన సేవలకు గుర్తింపుగా వారిని ఎంపికచేసినట్లు భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పిటి ఉష చెప్పారు. వారిద్దరూ అంతర్జాతీయ వేదికపై ఎన్నోసార్లు తమను తాము నిరూపించుకున్నారన్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో కామన్వెల్ క్రీడల కోసం శిక్షణ పొందుతున్నారు.





### రూ.67,515.7 కోట్ల డాలర్లకు పెరిగిన...
# ఆర్బీఐ ఫారెక్స్ ఖజానా

**న్యూఢిల్లీ, జులై 18:** భారత విదేశీ మారక నిల్వలు జులై 10తో ముగిసిన వారంలో 96.4 కోట్ల డాలర్లు పెరిగి 67,515.7 కోట్ల డాలర్లకు చేరినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. అంతకుముందు వారంలో దేశ విదేశీ మారక నిల్వలు 726 కోట్ల డాలర్లు పెరిగి 67,419.3 కోట్ల డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 72,849.4 కోట్ల డాలర్లతో చరిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అయితే అనంతరం పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రారంభమవడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి మారక విలువను స్థిరంగా ఉంచేందుకు ఆర్‌బీఐ డాలర్లను విక్రయిస్తూ విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో నిల్వలు వరుసగా కొన్ని వారాల పాటు తగ్గాయి.

జులై 10తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 93 కోట్ల డాలర్లు పెరిగి 54,650.8 కోట్ల డాలర్లకు చేరాయి. డాలర్ విలువలో లెక్కించే ఈ విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, బ్రిటిష్ పౌండ్, జపాన్ యెన్ వంటి అమెరికా డాలరేతర కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బీఐ తెలిపింది. దేశ బంగారం నిల్వల విలువ 2.4 కోట్ల డాలర్లు పెరిగి 10,522.3 కోట్ల డాలర్లకు చేరింది. అలాగే ప్రత్యేక డ్రాయింగ్ హక్కులు ఎస్డీఆర్‌లు 30 లక్షల డాలర్లు పెరిగి 1,862.6 కోట్ల డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ఇక అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వ్ పొజిషన్ కూడా 70 లక్షల డాలర్లు పెరిగి 479.3 కోట్ల డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు వెల్లడించాయి.

# నికరలాభంలో 15.9% వృద్ధి




**ముంబయి, జులై 18:** దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఐసీఐసీఐ బ్యాంక్ బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. నికర లాభం 15.9 శాతం పెరిగి రూ.14,804.50 కోట్లకు చేరుకుంది. పన్నులు మినహా ప్రొవిజన్లు మరియు ఇతర అత్యవసర నిధులు గత ఏడాది రూ.1,814.57 కోట్ల నుంచి రూ.1,260.45 కోట్లకు తగ్గాయి. అంటే వార్షిక ప్రాతిపదికన 30.5 శాతం తగ్గుదల నమోదైంది. గత త్రైమాసికంలో ఇవి కేవలం రూ.96.16 కోట్లు మాత్రమే ఉండటంతో, త్రైమాసిక ప్రాతిపదికన పెరిగాయి. నికర వడ్డీ ఆదాయం 12.7పెరుగుదల బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 12.7శాతం పెరిగి 24వేల 384 కోట్లకు చేరుకుంది. మొత్తం వడ్డీ ఆదాయం 8.1 శాతం పెరిగి రూ.45,670.78 కోట్లకు చేరగా, వడ్డీ వ్యయం రూ.21,286.43 కోట్లుగా నమోదైంది.

ఈ సందర్భంగా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్రా మాట్లాడుతూ, ఈ త్రైమాసికంలో ఆదాయపు పన్ను రిఫండ్‌లు రావడం వల్ల నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ పెరిగిందన్నారు. టర్మ్ డిపాజిట్ల రీప్రైసింగ్, అధిక వడ్డీ రిఫండ్‌లు కూడా మార్జిన్‌కు మద్దతు ఇచ్చాయన్నారు. బ్యాంక్ మొత్తం ఆదాయం 5.4 శాతం పెరిగి రూ.54,246.84 కోట్లకు చేరుకుంది. ఇతర ఆదాయం 0.8 శాతం పెరిగి రూ.8,576.06 కోట్లుగా నమోదైంది. ట్రెజరీ కార్యకలాపాల ద్వారా బ్యాంక్ రూ.151 కోట్ల లాభం నమోదు చేసింది. గత త్రైమాసికంలో రూ.106 కోట్ల నష్టం ఉండగా, గత ఏడాది ఇదే కాలంలో రూ.1,241 కోట్ల లాభం వచ్చింది. ప్రొవిజన్లకు ముందు ఆపరేటింగ్ లాభం 8.8 శాతం పెరిగి రూ.20,386.07 కోట్లకు చేరుకుంది. 2026 జూన్ నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.23,846.59 కోట్లుగా నమోదయ్యాయి. నికర నిరర్థక ఆస్తులు రూ.5,908.27 కోట్లకు తగ్గాయి.

# 5.4శాతం పెరిగిన ఐడిబిఐ నికరలాభం




**ముంబయి, జులై 18:** ఐడీబీఐ బ్యాంక్‌కు తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం పెరిగింది. శనివారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమర్పించిన ఆర్థిక ఫలితాల ప్రకారం బ్యాంక్ నికర లాభం రూ.2,007 కోట్ల నుంచి రూ.2,115 కోట్లకు చేరింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 10.1 శాతం పెరిగి రూ.3,166 కోట్ల నుంచి రూ.3,486కోట్లకు పెరిగింది. మొత్తం వడ్డీ ఆదాయం 7.4 శాతం వృద్ధితో రూ.7,021 కోట్ల నుంచి రూ.7,541 కోట్లకు చేరింది. ఆస్తుల నాణ్యత పరంగా స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 2.32 శాతం నుంచి 2.30 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏ (నెట్ ఎన్‌పీఏ) 0.15 శాతం నుంచి 0.16 శాతానికి ఒక బేసిస్ పాయింట్ మేర పెరిగింది.

ప్రొవిజన్ కవరేజ్ రేషియో గత త్రైమాసికంలోని 99.39 శాతం నుంచి 99.31 శాతానికి స్వల్పంగా తగ్గింది. మరోవైపు నిర్వహణ లాభం 7.9శాతం క్షీణించి రూ.2,354 కోట్ల నుంచి రూ.2,168 కోట్లకు పడిపోయింది. నికరవడ్డీ మార్జిన్ 3.61 శాతానికి తగ్గింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 3.68 శాతంగా నమోదైంది. అలాగే కరెంట్ అకౌంట్‌సేవింగ్స్ అకౌంట్ నిష్పత్తి 44.59 శాతం నుంచి 43.64 శాతానికి తగ్గింది. ఇదిలా ఉండగా, ఎన్‌ఎస్‌ఈలో ఐడీబీఐ బ్యాంక్ షేరు 1.73 శాతం లాభంతో రూ.87.02 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 1.09 శాతం మాత్రమే పెరిగింది. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు బ్యాంక్ షేరు ధర 15.51 శాతం తగ్గగా, గత 12 నెలల్లో 12.69 శాతం క్షీణించింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికరలాభం 19వేల కోట్లు




**ముంబయి, జులై 18:** దేశంలోనే అతి పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 5 శాతం పెరిగి రూ.19,059 కోట్లకు చేరింది. బ్యాంక్ నికరవడ్డీ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.33,534 కోట్లకు చేరింది. గత ఏడాది బ్యాంక్‌కు సంబంధించిన ప్రొవిజన్లు వార్షిక ప్రాతిపదికన భారీగా 78.8 శాతం తగ్గి రూ.3,060 కోట్లకు చేరాయి. ఆస్తుల నాణ్యత విషయంలో స్వల్ప ఒత్తిడి కనిపించింది. స్థూల నిరర్థక ఆస్తులు గత త్రైమాసికంలోని 1.15 శాతం నుంచి 1.17 శాతానికి పెరిగితే నికర నిరర్థక ఆస్తులు0.38 శాతం నుంచి 0.41 శాతానికి చేరింది. బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ మాత్రం గణనీయంగా తగ్గింది. గత ఏడాది రూ.35,734 కోట్లుగా ఉన్న ఆపరేటింగ్ లాభం ఈసారి 21.2 శాతం తగ్గి రూ.28,168 కోట్లకు పరిమితమైంది. ఇక నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ మొత్తం ఆస్తులపై 3.26 శాతంగా నమోదైంది. ఇది మార్కెట్ అంచనా అయిన 3.32 శాతం కంటే కొద్దిగా తక్కువ. వడ్డీ ఆర్జించే ఆస్తులపై 3.40 శాతంగా నమోదైంది. బ్యాంక్ సీఈఓ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా ఎదురైన సవాళ్లను బ్యాంక్ విజయవంతంగా అధిగమించిందన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ ఉద్యోగులు బ్యాంక్ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేశారని తెలిపారు. కొత్త చైర్మన్ నియామకంతో నాయకత్వ మార్పుపై ఉన్న అనిశ్చితికి తెరపడిందనిపేర్కొన్నారు. స్టాక్ మార్కెట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 1.40 శాతం పెరిగి రూ.819.60 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 1.09శాతం లాభపడింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు హెచ్‌డీఎఫ్‌సీ షేరు 17.31శాతం క్షీణించగా, గత 12 నెలల్లో 58.75శాతం పతనమైంది.

# ఆర్‌బీఐ పాలిమర్ కరెన్సీ నోట్ల పైలట్‌కు సిద్ధం

## తొలి దశలో రూ.10, రూ.20 నోట్లు



**ముంబయి, జులై 18:** పాలిమర్ కరెన్సీ నోట్ల తొలి పైలట్ ప్రాజెక్ట్‌ను ఆర్బీఐ త్వరలోనే ప్రారంభించే కసరత్తులు చేపట్టింది. మొదటి దశలో రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకు రానున్నారు. ఈ పైలట్ విజయవంతమైతే, 2027 నుంచి దేశవ్యాప్తంగా దశలవారీగా పూర్తి స్థాయిలో పాలిమర్ నోట్లను విడుదల చేసే అవకాశముంది.

పాలిమర్ నోట్లు వచ్చిన తర్వాత ప్రస్తుతం వినియోగంలో ఉన్న కాగితపు కరెన్సీ నోట్లను ఉపసంహరించబోరని ఆర్‌బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. పాలిమర్ నోట్లు, కాగితపు నోట్లు రెండూ ఒకేసారి చలామణిలో కొనసాగుతాయి. కొత్త నోట్లను దశలవారీగా ప్రవేశపెడుతూనే, ప్రస్తుతం ఉన్న కరెన్సీ కూడా చెల్లుబాటులోనే ఉంటుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఆర్‌బీఐకి చెందిన నోట్ల ముద్రణ సంస్థ ఇటీవల పాలిమర్ నోట్ల తయారీలో ఉపయోగించే ప్రత్యేక పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల తయారీ, సరఫరా కోసం అంతర్జాతీయ సంస్థల నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ బిడ్లను ఆహ్వానించింది. టెండర్ పత్రాల ప్రకారం, అధునాతన భద్రతా ఫీచర్లతో కూడిన పాలిమర్ సబ్‌స్ట్రేట్‌ను సరఫరా చేయాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీసంస్థలను ఆహ్వానించారు. దీంతో నకిలీ నోట్ల తయారీని మరింత సమర్థంగా అడ్డుకోవడంతో పాటు, కరెన్సీ నోట్ల భద్రతను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. టెండర్ల దాఖలుకు ఆగస్టు 18 చివరి తేదీగా నిర్ణయించారు. పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. తేమ, దుమ్ము, మురికి, చిరిగిపోవడం వంటి సమస్యలకు ఇవి అధిక నిరోధకతను కలిగి ఉంటాయి. అలాగే అత్యాధునిక భద్రతా లక్షణాలను వీటిలో అమర్చే అవకాశం ఉండటంతో నకిలీ చేయడం కూడా చాలా కష్టంగా మారుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్ వంటి అనేకదేశాలు పాలిమర్ కరెన్సీ నోట్లను విజయవంతంగా అమలు చేస్తున్నాయి. చలామణిలో ఉన్న కరెన్సీ నాణ్యతను మెరుగుపరచడం, నోట్ల ఆయుష్షును పెంచడం లక్ష్యంగా పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ గతంలోనే ప్రకటించింది.




## 26శాతం వృద్ధితో కోటక్ బ్యాంకు
# లాభాలు రూ.4,123 కోట్లు

**ముంబయి, జులై 18:** ప్రైవేట్ రంగానికి చెందిన కొటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 26 శాతం పెరిగి రూ.4,123 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం గత ఏడాది రూ.7,260 కోట్ల నుంచి 9.2 శాతం పెరిగి రూ.7,928 కోట్లకు చేరింది. బ్యాంక్ నిర్వహణ లాభం కూడా బలంగా పెరిగింది. గత ఏడాది రూ.5,564 కోట్లుగా ఉన్న నిర్వహణ లాభం 10.2 శాతం వృద్ధితో రూ.6,131 కోట్లకు చేరింది.

ఆస్తుల నాణ్యత పరంగా కూడా బ్యాంక్ మంచి పనితీరును కనబరిచింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 1.20 శాతం నుంచి 1.18 శాతానికి తగ్గింది, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి గత త్రైమాసికంలోని 0.25 శాతం నుంచి 0.27 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ కేటాయింపులు గత త్రైమాసికంలోని రూ.516 కోట్ల నుంచి రూ.668 కోట్లకు పెరిగాయి. అయితే గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.1,208 కోట్లతో పోలిస్తే 45 శాతం తగ్గాయి.

గత ఏడాది రూ.3,282 కోట్లుతో పోలిస్తే కోటక్ బ్యాక్ నికర లాభం రూ.4,123 కోట్లు సాధించింది. నికర వడ్డీ ఆదాయం కూడా 7259 కోట్లనుంచి 9శాతం వృద్ధితో 7928 కోట్లు రాబట్టింది. నిర్వహణ లాభం గత ఏడాది 5564 కోట్లనుంచి 10శాతం వృద్ధితో 6131 కోట్లు రాగా కేటాయింపులు గత ఏడాది 1208 కోట్లనుంచి రూ.668 కోట్లకు గణనీయంగా తగ్గించుకోగలిగింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps